www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
శనివారం
02-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 312
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

భగవంత్ కేసరికి జాతీయ అవార్డు

ఉత్తమ చిత్రం ట్వల్త్ ఫెయిల్

నటులు షారుక్ ఖాన్, విక్రాంత్, రాణీ ముఖర్జి

బలగం, హనుమాన్, బేబీకి పురస్కారాలు

జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రకటన

న్యూఢిల్లీ: జాతీయ ఉత్తమ చిత్రంగా ట్వల్త్ ఫెయిల్, ఉత్తమ తెలుగు చిత్రంగా భగవంత్ కేసరికి అవార్డులు దక్కాయి. జాతీయ చలన చిత్ర పురస్కారాలను కేంద్రం శుక్రవారం ప్రకటించింది. దీనికి సంబంధించిన జ్యూరీ కమిటీ...ఫలితాల జాబితాను కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు అందజేసింది. 15 విభాగాల్లో అవార్డులు ప్రకటించారు. జాతీయ ఉత్తమ నటుడి అవార్డును షారుక్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే (ట్వల్త్ ఫెయిల్) పంచుకున్నారు. 'మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' (హిందీ) చిత్రానికిగాను ఉత్తమ నటిగా రాణీ ముఖర్జీ ఎంపికయ్యారు. ఉత్తమ దర్శకుడిగా 'ది కేరళ స్టోరీ'ని తెరకెక్కించిన సుదీప్తో సేన్ అవార్డు దక్కించుకున్నారు. ఉత్తమ యాక్షన్ (స్టంట్ కొరియోగ్రఫీ)లో 'హనుమాన్' చిత్రం అవార్డు దక్కించుకోగా, ఉత్తమ గేయ రచయితగా 'బలగం'లో 'ఊరు పల్లెటూరు' పాటకు కాసర్ల శ్యామ్ పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు. ఉత్తమ నేపథ్య గాయకుడి అవార్డు బేబీ చిత్రంలోని ప్రేమిస్తున్నా... పాటకుగాను పీవీఎన్ఎస్ రోహిత్‌ను వరించింది. అలాగే, ఉత్తమ తమిళ చిత్రంగా 'పార్కింగ్'ను పురస్కారం వరించింది. ఉత్తమఫిల్మ్ క్రిటిక్ అవార్డు ఉత్పల్ దత్త (అస్సామీ)కు దక్కింది. ఉత్తమ సహాయ నటుడు: పూక్కాలం (మలయాళం) విజయ రాఘవన్, పార్కింగ్ (తమిళ్) ముత్తుపెట్టాయ్ సోము భాస్కర్, ఉత్తమ సహాయ నటి: ఉళ్లోలుక్కు (మలయాళం) ఊర్వశి, వష్ (గుజరాతీ) జానకీ బోడివాలా, ఉత్తమచైల్డ్ ఆర్టిస్ట్: గాంధీతాత చెట్టు (తెలుగు) సుకృతివేణి, జిప్సీ (మరాఠీ) కబీర్ ఖందారీ, నాల్ 2 (మరాఠీ) త్రిష థోసర్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ జగ్గీప్; ఉత్తమ నేపథ్య గాయకుడు: బేబీ (ప్రేమిస్తున్నా..) పీవీఎన్ ఎస్ రోహిత్, ఉత్తమ నేపథ్య గాయని: జవాన్ (చెలియా) శిల్పారావు, ఉత్తమ సినిమాటోగ్రఫీ: ది కేరళ స్టోరీ (హిందీ) పసంతను మొహపాత్రో, ఉత్తమ సంభాషణలు: సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై (హిందీ) దీపక్ కింగ్రానీ, ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): పార్కింగ్ (తమిళ్) రామ్‌కుమార్ బాలకృష్ణన్, బేబీ (తెలుగు) సాయి రాజేశ్ నీలం, ఉత్తమ సౌండ్ డిజైన్: యానిమల్ (హిందీ) సచిన్ సుధాకరన్, హరి హరన్ మురళీ ధరన్, ఉత్తమ ఎడిటింగ్: పూక్కాలమ్ (మలయాళం) మిథున్ మురళి, ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: 2018 (మలయాళం) మోహన్‌దాస్, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: సామ్ బహదూర్ (హిందీ), ఉత్తమ మేకప్: సామ్

- మిగతా 2 లో

అత్యాచార కేసులో ప్రజ్వల్ రేవణ్ణ దోషి

బెంగళూరు: అత్యాచారం కేసులో జేడీఎస్ అధినేత దేవెగౌడ మనవడు, కర్నాటక మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ దోషిగా తేలాడు. బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం ఈ తీర్పు వెలువరించింది. దీనిపై శనివారం శిక్ష ఖరారు చేయనుంది. ఈ తీర్పు వినగానే ప్రజ్వల్ కోర్టు గదిలోనే కంటతడి పెట్టుకున్నాడు. ప్రజ్వల్ అత్యాచారానికి పాల్పడ్డాడని, ఆ దారుణాన్ని రికార్డు చేసి బెదిరించేవాడంటూ ఓ మహిళ సైబర్ క్రైమ్ స్టేషన్‌లో గతేడాది ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రత్యేక బృందం దర్యాప్తు చేసి 2 వేల పేజీల చార్జిషీట్ దాఖలు చేసింది. విచారణలో భాగంగా 123 ఆధారాలు సేకరించింది. దీనిపై

- మిగతా 2 లో

రమ్మీ ఆడిన మంత్రికి క్రీడల శాఖ

ముంబై: అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా సభలో కూర్చొని రమ్మీ ఆడారంటూ మహారాష్ట్ర మంత్రి మాణిక్ రావ్ కోకాటేపై వచ్చిన ఆరోపణలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. ఆయన మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ విపక్షాలు డిమాండ్ చేశాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశమైంది. మాణిక్ రావ్‌పై వేటు వేయలేదు కానీ... ఆయనకు క్రీడల శాఖను అప్పగించడం విమర్శలకు దారితీసింది. మహారాష్ట్రలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు సంబంధించి గురువారం అర్ధరాత్రి ఓ ప్రకటన వెలువడింది. ఇప్పటివరకు మాణిక్ రావ్ కోకాటే

- మిగతా 2 లో

డీఎస్సీ తుది 'కీ' విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షల తుది కీ విడుదలయింది. ఈ మేరకు మెగా డీఎస్సీ-2025 కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి శుక్రవారం వెల్లడించారు. జూన్ 6 నుంచి జులై 2వ తేదీ వరకు 89 విభాగాల్లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక 'కీ' విడుదల తర్వాత అభ్యర్థుల అభ్యంతరాలను ఆన్ లైన్‌లో స్వీకరించారు. నిపుణుల బృందం వీటిని పరిశీలించి తుది కీ రూపొందించింది. ఉపాధ్యాయ తుది కీని పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ https://apdsc.apcfss.in లో అందుబాటులో ఉంచారు.

ఇదీ లోకం!

అయ్యో రామా..ఫ్రెండనుకుంటే వీడేంటి మన గుడ్డలన్నీ ఇలా ఊడదీసేస్తున్నాడు!

కమ్యూనిస్టుల ఉద్యమాలతోనే అధికారం

- దుష్ట పాలకులను గద్దె దించేది వామపక్షాలే
- ప్రజల్లో చైతన్యం తెచ్చేది లెఫ్ట్ పత్రికలే
- సన్నగిల్లుతున్న జర్నలిస్టుల విశ్వసనీయత: రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: తప్పు చేసే పాలకులను గద్దె దించడంలో కమ్యూనిస్టులు ముందుంటారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం "నవ తెలంగాణ" దినపత్రిక 10వ వార్షికోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కమ్యూనిస్టులు చేసిన ఉద్యమాలు ఎంతో దోహదపడ్డాయన్నారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పనిచేసే పత్రికా సంస్థలు కొన్ని మాత్రమే ఉంటాయని అందులో నవ తెలంగాణ ఒకటని పేర్కొన్నారు. ప్రస్తుతం పత్రికా సంస్థలు తమ విశ్వసనీయతను కోల్పోయే పరిస్థితి తలెత్తుతోందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు పత్రికలు ఉపయోగపడ్డాయని గుర్తు చేశారు. నాటి సాయుధ రైతాంగ పోరాటంలో, సామాజిక రుగ్మతలపై ప్రజలలో చైతన్యం తీసుకొచ్చేందుకు కమ్యూనిస్టుల అధ్వర్యంలో నిర్వహించిన పత్రికలు దోహదం చేశాయన్నారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ... పాలకులు ఎవరైనా ప్రజల పక్షం నిలుస్తున్న పత్రికలు కమ్యూనిస్టు పత్రికలన్నారు. నేడు తమ సంపాదనను కాపాడుకోవడానికి, తప్పులను కప్పి పుచ్చుకునేందుకు కొన్ని రాజకీయ పత్రికలు పనిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో జర్నలిస్టు అనే పదానికి అర్థం లేకుండా పోతోందని, జర్నలిజం ముసుగులో ఉన్న కొన్ని రాజకీయ పార్టీల పత్రికల తీరును ప్రజలు నిశితంగా గమనించాలని సూచించారు. జర్నలిజంలో ఓనమాలు తెలియనివారు కొంతమంది జర్నలిస్టు ముసుగు వేసుకుని సోషల్ మీడియా పేరుతో తిరుగుతున్నారని, దీన్ని అడ్డుకునేందుకు నిజమైన జర్నలిస్టులు సెమినార్లు నిర్వహించి జర్నలిస్ట్ పదానికి సరైన అర్థాన్ని చెప్పాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రాజకీయ నాయకుల విశ్వసనీయతలాగే జర్నలిస్టుల విశ్వసనీయత కూడా వేగంగా సన్నగిల్లుతోందని అభిప్రాయపడ్డారు. అందుకే నిజమైన జర్నలిస్టులు దీనికి ఒక లక్ష్మణ రేఖ గీయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, జర్నలిస్టుల ముసుగు తొడుక్కున్న వారిని మీరే వేరు చేయాల్సిన అవసరం ఉందని, లేకపోతే దేశ భద్రతకే ప్రమాదకరంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. కమ్యూనిస్టులు ఉప్పు లాంటి వారు... అది లేనిదే వంట రుచి ఉండదని, ప్రజా సమస్యలపై పోరాటంలో ఎర్రజెండా కనిపించినప్పుడే అవి పరిష్కారం అవుతున్నాయన్నారు. ఆనాడైనా... ఈ నాడైనా కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కమ్యూనిస్టుల సహకారం ఎంతో ఉందన్నారు. భవిష్యత్‌లోనూ ఇలాగే సహకారం కొనసాగాలని, కాంగ్రెస్-కమ్యూనిస్టులు కలిసి పని చేస్తే ప్రజలకు మరింత ప్రయోజనం ఉంటుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పాల్గొన్నారు.

ఈ-పాస్‌తో సచివాలయంలోకి ప్రవేశం... ప్రభుత్వ నిర్ణయం

రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి సచివాలయానికి సందర్శకుల ప్రవేశానికి విజిటర్ ఈ-పాస్ మేనేజ్‌మెంట్

- మిగతా 2 లో

ట్రంప్ బెదిరింపులకు లొంగొద్దు

సీపీఐ

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో విరుచుకుపడుతుంటే మోదీ ప్రభుత్వం ఎందుకు అడ్డు చెప్పడం లేదని సీపీఐ ప్రశ్నించింది. ట్రంప్ బెదిరింపులకు లొంగవద్దని సర్కారుకు హితవు పలికింది. రష్యా వంటి దేశాలతో వాణిజ్యం, సహకారం కోసం సార్వభౌమ హక్కు భారత్‌కు ఉందని అమెరికాకు స్పష్టం చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గం సూచించింది. అమెరికా జోక్యాన్ని, బెదిరింపు ధోరణిని తిరస్కరించాలని, ఏదేని సామ్రాజ్యవాద శక్తికి భాగస్వామిగా కాకుండా సమాన సహకారాధారిత విదేశాంగ విధానాన్ని పునరుద్ధాటించాలని డిమాండ్ చేసింది. 'అమెరికాతో వాణిజ్య సంబంధాలను భారత్ కొనసాగించాలి. కానీ అవి పరస్పర ప్రయోజనం ఇచ్చేవిగా, సమాన స్థాయిలో ఉండాలి. ఏకపక్ష డిమాండ్లతో లేక ప్రతిబంధకాలతో అమెరికా శాశించేలా ఉండకూడదు. ట్రంప్ బెదిరింపులు, అవమానాలను కేంద్రప్రభుత్వం తేలికగా తీసుకొని, వినయంగా ప్రవర్తిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ వైఖరి బీజేపీ ప్రభుత్వ పరికితనానికి, పశ్చిమ దేశాలపై ఆధారానికి... ముఖ్యంగా దేశ ప్రయోజనాలను అమెరికా కోసం పణంగా పెట్టేయడానికి అద్దం పడుతోంది' అని సీపీఐ వ్యాఖ్యానించింది. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్న భారత్ లేక ఇతర దేశంపై సుంకాలు విధించడం లేక శిక్షనాత్మక చర్యలు తీసుకోవడం ఆమోదయోగ్యం కాదని ట్రంప్ సుంకాలనుద్దేశించి పేర్కొంది. భారత్‌పై అమెరికా 25 శాతం సుంకం విధించడాన్ని ఆక్షేపించింది. ఇతర దేశాల ఆర్థిక-విదేశాంగ విధానాల ఎంపికల్లో జోక్యాన్ని, వాటిని శాశించే లక్ష్యంతో ఒత్తిడిని పెంచడం వాటిని అవమానించడమే అవుతుందని పేర్కొంది. భారత్ సార్వభౌమ దేశమని, దేశ ప్రయోజనాల దృష్ట్యా రష్యా లేక గ్లోబల్ సౌత్‌లోని ఏ దేశంతోనైనా వాణిజ్య సంబంధాలు పెట్టేకునే స్వేచ్ఛను

- మిగతా 2 లో

సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక

న్యూఢిల్లీ: నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం షెడ్యూల్ ప్రకటించింది. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. జగదీప్ ధన్కర్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఈ ప్రక్రియ అనివార్యమైంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ధన్కర్ తన పదవిని వీడారు. ఆరోగ్యపరమైన కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ పంపారు. ఈ నేపథ్యంలో ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. దీనిపై ఆగస్టు 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. నామినేషన్లు దాఖలుకు చివరితేదీ ఆగస్టు 21గా ప్రకటించింది. పోలింగ్ తేదీ సెప్టెంబర్ 9నే ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి ఎవరిని ఎంపిక చేస్తుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రేసులో పలువురి పేర్లు తెర పైకి వచ్చాయి. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, జేడీయూ నేత హరివంశ్ నారాయణ్ సింగ్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సహా

- మిగతా 2 లో

వెయ్యి కోట్ల అక్రమాలు

గొర్రెల పథకంపై ఈడీ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన గొర్రెల పంపిణీ పథకంలో రూ.వెయ్యి కోట్లకుపైబడి అక్రమాలు జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. గొర్రెల పెంపకం, అభివృద్ధి పథకం అమలులో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ అవినీతి నిరోధకశాఖ నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఓఎస్డీగా ఉన్న జి. కల్యాణ్ కుమార్, లబ్ధిదారులు, మధ్యవర్తుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అనేక ఆధారాలు సేకరించినట్లు ఈడీ అధికారులు ప్రకటించారు. వివిధ ప్రభుత్వ అధికారులకు ముడుపుల రూపంలో అక్రమ చెల్లింపులు జరిగినట్లు సూచించే పత్రాలను స్వాధీనం

- మిగతా 2 లో

రేషన్ కార్డు ఆత్మగౌరవ పత్రం

ప్రజల జీవితాలు మార్చడమే ఉద్దేశం

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రేషన్ కార్డుల పంపిణీలో మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర-హైదరాబాద్: రేషన్ కార్డు అనేది ఆత్మగౌరవ పత్రమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రేషన్ కార్డు ప్రజల జీవితాలు మార్చగలదన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్, కర్మంజీపత్‌లో కొత్త కాపు యాదవ రెడ్డి గార్డెన్స్‌లో శుక్రవారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అర్హులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ రేషన్ కార్డుల ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరు

- మిగతా 2 లో

ఓట్ల దొంగలను వదిలిపెట్టం

ఆధారాల 'అణు బాంబు' పేల్చితే

ఈసీ ముఖం చాటేయాల్సిందే: రాహుల్

న్యూఢిల్లీ: ఎన్నికల సంఘం (ఈసీ) ఓట్ల దొంగ, బీజేపీ కోసం ఈ పనిచేస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. ఓట్ల చోరికి పాల్పడిన వారు ఏ స్థాయిలో ఉన్నా వదిలిపెట్టమని, పక్కా ఆధారాలతో వారి మోసాలు నిరూపిస్తామన్నారు. 'మా వద్ద అణు బాంబు లాంటి ఆధారముంది. నిజాల విస్ఫోటనతో ఈసీ ముఖం చాటేయాల్సిందే' అని రాహుల్ వ్యాఖ్యానించారు. బీజేపీకి కోసం ఓట్లు దోపిడీకి పాల్పడినవారు పదవిలో ఉన్నా, పదవీ విరమణ పొందినాగానీ వెతికి పట్టుకుంటామని, ఎవరినీ వదిలిపెట్టమని రాహుల్ అన్నారు. ఓట్ల దొంగతనం దేశ ద్రోహమని, ఈ విషయాన్ని కింది నుంచి పై స్థాయి వరకు ఈసీలో పనిచేసే వారంతా గ్రహించాలన్నారు. రాహుల్ శుక్రవారం పార్లమెంటు హౌస్ కాంపెక్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'ఓట్ల చోరీ జరుగుతోందని గతంలోనూ చెప్పా. ఇది ఓపెన్-షట్ వ్యవహారం. పక్కా ఆధారాలతో ఈసీ ఓట్లు దొంగతనాన్ని నిరూపించగలం. ఇది ఆరోపణ కాదు. 100 శాతం రుజువు చేయగలం. ఆధారాలను మేము బయటకు తెచ్చాక దేశం మొత్తానికి ఈసీ ఓట్ల దొంగ అని తెలిసిపోతుంది. బీజేపీ కోసమే ఎన్నికల సంఘం ఈ పని చేస్తున్నది' అని అన్నారు. 2023లో జరిగిన మధ్యప్రదేశ్ ఎన్నికల్లో అవకతవకలు జరిగినట్లు తమ పార్టీ అనుమానించిందని ఆయన తెలిపారు. గతేడాది లోక్‌సభ ఎన్నికల్లో, ఆపై మహారాష్ట్రలోనూ ఎన్నికల తీరు తమకు అనుమానాస్పదంగా తోచిందని చెప్పారు. 'మహారాష్ట్రలో రాష్ట్రస్థాయిలో ఓట్ల దొంగతనం జరిగింది. ఓటర్ల జాబితా సవరణ క్రమంలో కోటి మంది

- మిగతా 2 లో

యాదాద్రి, పులిచింతల భూ నిర్వాసితులకు 15 లోగా ఉద్యోగాలు

- వైటీపీఎస్ మొదటి యూనిట్ జాతికి అంకితం
- 5 నెలల్లో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తాం: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: రాబోయే ఏడాదిలో నాలుగువేల మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. నల్లగొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (వైటీపీఎస్)లోని 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌ను శుక్రవారం మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి జాతికి అంకితం చేశారు. గత ప్రభుత్వం పర్యావరణ అనుమతులు సాధించడంలో జాప్యం చేయడం వల్లే సుమారు రెండు సంవత్సరాలు ప్రాజెక్టు పనుల్లో ఆలస్యం జరిగిందని, ఫలితంగా ఆర్థిక భారం గణనీయంగా పెరిగిందని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే కేవలం రెండు నెలల్లోనే పర్యావరణ అనుమతులు సాధించామని పేర్కొన్నారు. ప్రతి నెల టార్గెట్లు పెట్టుకొని అనుకున్న లక్ష్యం మేరకు 1600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు జాతికి అంకితం చేసినట్లు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో ఇది సాధ్యమైందని అన్నారు. కిందిస్థాయి నుంచి సీఈ స్థాయి అధికారి వరకు మనసు పెట్టి పని చేయడంతో యాదాద్రి పవర్ ప్లాంట్ పనులు పూర్తవుతున్నాయన్నారు. ఇక్కడ

- మిగతా 2 లో

70 దేశాలపై ట్రంప్ సుంకాల బాంబు

సిరియాపై 41 శాతం పెంపు- పాక్‌కు రాయితీ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాలతో విరుచుకుపడ్డారు. దాదాపు 70 దేశాలపై ఉన్న సుంకాలను భారీగా పెంచారు. 10 శాతం నుంచి 41 శాతం వరకు పరస్పర సుంకాలను విధించేలా ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు చేశారు. భారత్‌పై 25 శాతం టారిఫ్ విధించారు. పాకిస్థాన్ దిగుమతులపై 29 శాతంగా ఉన్న టారిఫ్‌లను 19 శాతానికి తగ్గించారు. సిరియాపై అత్యధికంగా 41 శాతం సుంకం విధించారు. కెనడా నుంచి వచ్చే దిగుమతులపై సుంకాన్ని 25 శాతం నుంచి 35 శాతానికి పెంచారు. బ్రెజిల్‌పై 10 శాతం ఉన్న సుంకాన్ని అదనంగా 40 శాతం జత చేశారు. జాబితాలో లేని దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై 10 శాతం సుంకం ఉంటుందని ట్రంప్ వెల్లడించారు. పరస్పర సుంకాల నేపథ్యంలో వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి ఆగస్టు 1 వరకు ట్రంప్ గడువు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన సుంకాలను సవరించారు. కొత్త సుంకాలు ఏడు రోజుల్లో అమల్లోకి రానున్నాయి. భారత్, కెనడా దిగుమతులపై సుంకాలు మాత్రం శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి.

భారత్‌పై కోపమందుకే: మార్కో రూబియో

రష్యాతో భారత్ చమురు బంధమే అమెరికాను ఇబ్బంది పెట్టే అంశమని ఆ దేశ విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుండటం వల్లనే ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని మాస్కో కొనసాగించగలుగుతోందని వ్యాఖ్యానించారు. ఫాక్స్ రేడియోకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మార్కో రూబియో భారత్‌పై అసహనం వ్యక్తంచేశారు. భారత్‌కు భారీగా ఇంధనం అవసరమని, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి చమురు, బొగ్గు, గ్యాస్ కొనగలిగే శక్తి ఆ దేశానికి ఉందని అన్నారు. రష్యాపై కొన్ని దేశాలు ఆంక్షలు విధించిన క్రమంలో ఆ దేశంలో చమురు చౌకగా లభిస్తుందని, అందుకే న్యూఢిల్లీ కొనుగోలు చేస్తోందన్నారు. ఈ కొనుగోళ్లతో రష్యాకు నిధులు సమకూరుతున్నాయని, వాటితోనే ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని సాగిస్తోందని, ఇదే అమెరికాకు కోపం తెప్పిస్తున్న అంశమని మార్కో రూబియో వెల్లడించారు.

మీరు చేయొచ్చు... ఇతరులు చేయరాదా?

రష్యాతో వాణిజ్యంపై అమెరికాకు చైనా ప్రశ్న

బీజింగ్: రష్యాతో వాణిజ్య సంబంధాలను సాకుగా చూపుతూ ప్రపంచ దేశాలపై సుంకాలతో అమెరికా విరుచుకుపడుతుండటంపై చైనా మండిపడింది. మీకో న్యాయం, మిగతా దేశాలకు మరొక న్యాయమా అంటూ నిలదీసింది. రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న అమెరికా... మిగతా దేశాలను తప్పుపట్టడం సమంజసమా అని ప్రశ్నించింది. ఐక్యరాజ్య సమితి (ఐరాస)లోని బీజింగ్ శాశ్వత ప్రతినిధి గెంగ్ షువాంగ్ అమెరికా తీరును ఖండించారు. ఐరాస భద్రతా మండలిలో ఉక్రెయిన్‌కు ఆయుధాల సరఫరాపై చర్చలో అమెరికా ఆరోపణలను తోసిపుచ్చారు. రష్యాకు ఎలాంటి ఆయుధాలు అందించలేదని తేల్చిచెప్పారు. రష్యా, ఉక్రెయిన్‌తో సాధారణ వాణిజ్య సంబంధాలు ఉన్నట్లు తెలిపారు. అంతర్జాతీయ చట్టాలకు లోబడే ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు. తాము ఎక్కడ కూడా చట్టాలను ఉల్లంఘించలేదని అన్నారు. రష్యాతో అమెరికా వాణిజ్యం కొనసాగించిందని, ఆ దేశంతో ఇతరులు వాణిజ్యం చేయకూడదంటూ హెచ్చరిస్తోందని షువాంగ్ అన్నారు. అమెరికా చేస్తే ఒప్పు, మిగతా దేశాలు చేస్తే తప్పా అంటూ అసహనం వ్యక్తంచేశారు. ఉక్రెయిన్‌లో సంక్షోభం పరిష్కారానికి ఇదే సమయమని, కాల్పుల విరమణ, శాంతి నెలకొల్పడంపై దృష్టి పెట్టాలని షువాంగ్ సూచించారు.

నోబెల్‌కు ట్రంప్ అర్హుడు

శ్వేతసౌధం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని, ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఆయన అన్ని విధాలా అర్హులంటూ శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరోలీన్ లివెట్ ఒక ప్రకటన చేశారు. ఈజిప్ట్-ఇథియోపియా మొదలు ఇటీవల థాయిలాండ్-కాంబోడియా మధ్య రాజీకి ట్రంప్ ప్రయత్నించారని, యుద్ధాలు ఆపారని కరోలీన్ వెల్లడించారు. ఘర్షణ పడే దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులకు ఫోన్లు చేసి యుద్ధం ఆపేయాలని హెచ్చరించారని, ట్రంప్ జోక్యంతోనే ఇజ్రాయిల్-ఇరాన్, రువాండా-కాంగో (డీఆర్సీ), భారత్-పాకిస్థాన్, సెర్బియా-కొసావో, ఈజిప్ట్-ఇథియోపియా, థాయిలాండ్-కంబోడియా దేశాల మధ్య యుద్ధాలు ఆగాయని మీడియా సమావేశంలో కరోలీన్ తెలిపారు. ట్రంప్ జోక్యం చేసుకొని వుండకపోతే భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగేదని అన్నారు. ఉద్రిక్తతలు చల్లార్చి... శాంతిని నెలకొల్పిన ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.

కమ్యూనిస్టుల ఉద్యమాలతోనే అధికారం

(మొదటిపేజీ తరువాయి)

సిస్టమ్ అమలులోకి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో సచివాలయానికి సాధారణ ప్రజలు, మీడియా ప్రతినిధులు ప్రవేశానికి అనుమతి లభించలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలన సర్కారు అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ, పారదర్శక పాలనకు పెద్దపీట వేసింది. ప్రజలు... మంత్రులు, అధికారులను కలవాలంటే ఈ-పాస్ ద్వారా సచివాలయంలోకి ప్రవేశించవచ్చు.

వెయ్యి కోట్ల అక్రమాలు

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నారు. 200కుపైగా బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన చెక్‌బుక్‌లు, పాస్‌బుక్‌లు, డెబిట్ కార్డులు, 31 సెల్‌ఫోన్లు, 20 సిమ్‌కార్డులను సీజ్ చేశారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదిక కూడా గొర్రెల పంపిణీలో కుంభకోణం జరిగినట్లు గుర్తించింది. మార్చి, 2021తో ముగిసిన కాలానికి సంబంధించిన కాగ్ నిర్వహించిన ఆడిట్‌లో గొర్రెల పంపిణీ పథకం అమలులో అనేక అవకతవకలు జరిగినట్లు వెల్లడైంది. లబ్ధిదారుల వివరాలను సరిగ్గా నిర్వహించకపోవడం, రవాణా ఇన్వాయిస్ రికార్డులు అసంపూర్ణంగా ఉండటం, నకిలీ వాహన నంబర్లతో కూడిన ఇన్వాయిస్‌కు చెల్లింపులు చేయడం వంటివి గుర్తించారు. చనిపోయిన/ఉనికిలో లేని వ్యక్తుల పేరుతో కూడా గొర్రెల యూనిట్లను కేటాయించినట్లు తేలింది. మొత్తం రూ.వెయ్యి కోట్లకుపైగా అక్రమాలు జరిగాయని ఈడీ అంచనా వేసింది. ఈ కుంభకోణంలో ఎవరి పాత్ర ఎంత, ఇంకా ఎంతమంది అక్రమాలకు పాల్పడ్డారనే విషయంపై దర్యాప్తు కొనసాగిస్తోంది.

రేషన్ కార్డు ఆత్మగౌరవ పత్రం

(మొదటిపేజీ తరువాయి)

కిలోల బియ్యం అందుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రతి ఇంటికి బియ్యం అందించే హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని చెప్పారు. తొమ్మిదేళ్ల పాలనలో ప్రాంతాలు మారిన వారి పేర్లను రేషన్ కార్డుల నుంచి తొలగించినప్పుడు అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు తమ కొడుకులు, కొడుకుల పిల్లల పేర్లను కూడా రేషన్ కార్డులలో నమోదు చేస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిందని గుర్తుచేశారు. అలాగే, ఎల్బీ నగర్ నియోజకవర్గంలో డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మెట్రో రైలుకు నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే కోరినప్పటికీ నిధులు మంజూరు కాలేదన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ప్రాంతీయ రింగ్ రోడ్డుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, రెండేళ్లలో పూర్తి చేస్తామని శ్రీధర్ బాబు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, జంట నగరాలకు కృష్ణా, మంజీరా నీరు అందుతోందని, బీఆర్ఎస్ ప్రభుత్వం చుక్క నీరు తేలేదన్నారు. గోదావరి జలాలను పూర్తి స్థాయిలో తేవడానికి కొత్త ప్రాజెక్టు చేపడతామని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తెస్తున్నామని, ఉపాధి కల్పిస్తున్నామని శ్రీధర్ బాబు చెప్పారు. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లను మంత్రి అందజేశారు. ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, దయానంద్ గుప్తా, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహరెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి, ఆర్డీఓ రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి పారిజాత, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

15 లోగా ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థలు నిర్మిస్తామని, కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు అంబులెన్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు పెద్ద సంఖ్యలో సీసీ రోడ్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన వారికి ఈ నెల 15లోగా ఉద్యోగాలు ఇస్తామని, ప్యాకేజీ పూర్తిగా అందనివారికి అందచేస్తామని, దీంతోపాటు పులిచింతల ప్రాజెక్టు భూ నిర్వాసితులకు నిబంధనల మేరకు ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... డిప్యూటీ సీఎం సమర్థవంతంగా పర్యవేక్షించడంతో ఆగిపోయిన యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు చివరి దశకు చేరిందని తెలిపారు. కాగా, గత ప్రభుత్వం 2015లో 800 మెగావాట్ల సామర్థ్యం గల ఐదు కేంద్రాల నిర్మాణం చేపట్టింది. 2017లో పనులు ప్రారంభించారు. సుమారు రూ.30వేల కోట్ల అంచనా వ్యయం కాగా మరో రూ.ఐదువేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండో యూనిట్‌ను గతేడాది డిసెంబరు ఏడో తేదీన సీఎం ప్రారంభించారు. ఇప్పుడు ఒకటో యూనిట్‌ను జాతికి అంకితం చేసి పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. మూడు, నాల్గవ యూనిట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానున్నాయి. వైదో యూనిట్ 2026 మార్చిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

- అన్నదాత సుఖీభవతో 47 లక్షల మందికి లబ్ధి
- ప్రభుత్వం చేసే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- వైసీపీ కుట్రలు తిప్పికొట్టాలి
- టీడీపీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ త్వరలో పూర్తి చేస్తామని టీడీపీ నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభయమిచ్చారు. పార్టీ పటిష్టత, ప్రజా సంక్షేమం కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని చెప్పారు. 'ప్రజలకు సుపరిపాలన అందించే బాధ్యత మాది, దాన్ని సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీది' అని మంత్రులు, టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్లమెంటు అధ్యక్షులు, జోనల్ సమన్వయకర్తలు, రైతు నేతలు, గ్రామస్థాయి కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు అన్నారు. అన్నదాత సుఖీభవ పథకంతో పాటు సుపరిపాలనలో తొలి అడుగు వంటి అంశాలపై పార్టీ యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. సింగపూర్ పర్యటన విశేషాలు తెలిపారు. వైసీపీ కుట్రలు తిప్పికొట్టాలన్నారు. సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి చూసి వైసీపీ ఓర్వలేకపోతున్నట్లు విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలు రాష్ట్రాన్ని నాశనం చేశారని ఇంకా కుట్రలు పన్నుతూనే ఉన్నారని, దాంతో రాష్ట్రానికి నష్టం జరుగుతున్నదన్నారు. 'చేసే మంచిని గతంలో చెప్పుకోలేకపోయాం. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడంలో నిర్లక్ష్యం ప్రదర్శించాం. ఈసారి అలా జరగకూడదు' అని సీఎం సూచించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కోటి కుటుంబాలను కలిసిన మనం... వారి మనస్సులు గెలుచుకోవాలని చంద్రబాబు అన్నారు.

హామీలన్నీ అమలు చేస్తున్నాం

'ఎన్నికల హామీలన్నీ వరుసగా అమలు చేస్తున్నాం. శనివారం నుంచి అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద ఏడాదికి రూ. 20 వేలు చొప్పున అర్హులైన ప్రతి రైతుకూ అందిస్తున్నాం. ఈ పథకం ద్వారా 46,85,838 మంది రైతులకు లబ్ధి కలుగుతుంది. అన్నదాత సుఖీభవ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2,342.92 కోట్లు విడుదల చేసింది. కేంద్రం రూ.831.51 ఇస్తోంది. అర్హులైన రైతులందరి పేర్లు లబ్ధిదారుల జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో మీరే జాగ్రత్తలు తీసుకోవాలి' అని నేతలకు చంద్రబాబు సూచించారు. అర్హుల పేర్లు లబ్ధిదారుల జాబితాలో లేకపోతే 155251 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పార్టీ యంత్రాంగం మొత్తం పాల్గొనాలని ఆదేశించారు.చేసిన మంచి ఎక్కడికీ పోదని... అది మనతోనే ఉంటుందని సింగపూర్ పర్యటనలో స్పష్టమైందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 1996 నుంచి హైదరాబాద్, రాష్ట్రాభివృద్ధికి సింగపూర్ సహకరించిందని, అలాంటి దేశాన్ని వైసీపీ వేధించిందన్నారు. దెబ్బతిన్న సంబంధాలు పునరుద్ధరిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. టెలికాన్ఫరెన్సులో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడారు.

ఓట్ల దొంగలను వదిలిపెట్టం

(మొదటిపేజీ తరువాయి)

చేరారు. వివరాల్లోకి వెళ్లే ప్రయత్నం చేశాం కానీ ఈసీ సహకరించలేదు. దీంతో లోతుగా అధ్యయనం చేయాలని నిర్ణయించం. సొంతంగా దర్యాప్తు చేపట్టాం. ఇందుకు ఆరు నెలలు పట్టింది. అయితే మాకు అణు బాంబు లభించింది. ఇది పేలితే ఈసీకి దాక్కునేందుకు దేశంలో ఎక్కడా స్థానం ఉండదు' అని రాహుల్ వెల్లడించారు. కింది నుంచి పై స్థాయి వరకు ఓట్ల చోరీలో భాగస్వాములైన వారెవరినీ వదిలేది లేదని, వీరు దేశానికి విరుద్ధంగా పనిచేస్తున్నారని అన్నారు. ఇది దేశ ద్రోహంతో సమానమన్నారు. ఓట్ల దొంగతనం చేసిన వారు రిటైర్ అయినా, ఎక్కడ ఉన్నాగానీ వెతికి పట్టుకుంటామని రాహుల్ హెచ్చరించారు. ఇదిలా వుంటే, ఆగస్టు 5న కర్నాటకలో తలపెట్టిన నిరసనలో భాగంగా ఆ రాష్ట్ర ఈసీ ద్వారా ఓటర్ జాబితాల రిగ్గింగ్‌ను బహిర్గతం చేస్తామని కాంగ్రెస్ పేర్కొంది. ఎన్నికలకు సంబంధించి ఇటువంటి తప్పులను నిలదీస్తామని తేల్చిచెప్పింది. రాహుల్ గాంధీ అధ్వర్యంలో బెంగళూరులో మంగళవారం జరగబోయే భారీ నిరసన కోసం ఏర్పాట్లను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సమీక్షించారు. నిరసనలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పార్టీ శ్రేణులను కోరారు. కాగా, లోక్‌సభ స్పీకర్‌కు ప్రతిపక్ష పార్టీలు ఉమ్మడిగా లేఖ రాశాయి. బీహార్‌లో ఎస్ఐఆర్‌పై ప్రత్యేక చర్చ కోసం సమయాన్ని ఇవ్వాలని, ఇందులో మరింత జాప్యం వద్దని కోరాయి. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతిపక్ష ఎంపీలు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేశారు. పార్లమెంటు ఉభయ సభల్లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల సభ్యులు ఆందోళన కొనసాగించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఓటర్ల తొలగింపే లక్ష్యంగా ఓటర్ల జాబితాల సవరణను ఈసీ చేపట్టిందని ఆరోపించారు. పార్లమెంటులో ఎస్ఐఆర్‌పై ప్రత్యేక చర్చకు డిమాండ్ చేశారు.

రాహుల్ ఆరోపణలు నిరాధారం: ఈసీ

న్యూఢిల్లీ: బీజేపీ కోసం ఓట్ల చోరీ జరుగుతోందంటూ తమపై నిరాధార ఆరోపణలు చేయడం నిత్యకృతమైందని ఎన్నికల సంఘం వ్యాఖ్యానించింది. ఇలాంటివి పట్టించుకోవద్దని ఎన్నికల అధికారులకు సూచించింది. 'నిరాధారణ ఆరోపణలు, బెదిరింపులు మామూలే. ఎన్నికల సంఘం వీటికి ప్రాధాన్యత ఇవ్వదు. బాధ్యతారహితంగా చేసే వ్యాఖ్యలను ఎన్నికల అధికారులు కూడా పట్టించుకోవద్దు. మీ పనిని న్యాయంగా, పారదర్శకంగా చేయండి' అని ఈసీ పేర్కొంది.

కానిస్టేబుల్ తుది ఫలితాల విడుదల

సెప్టెంబరు నుంచి శిక్షణ: హోంమంత్రి అనిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర పోలీసు శాఖలోని 6,100 కానిస్టేబుళ్ల భర్తీకి చెందిన తుది ఫలితాలు వెల్లడయ్యాయి. 3,580 సివిల్ పోలీస్ కానిస్టేబుళ్లు (స్త్రీ, పురుషులు), 2,520 ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు (పురుషులు) నియామకాల కోసం పరీక్షలు నిర్వహించారు. గండి నానాజీ (విశాఖపట్నం) 168 మార్కులతో ప్రథమ స్థానం, జి.రమ్యమాధురి (విజయనగరం) 159 మార్కులతో ద్వితీయ, మెరుగు అచ్యుతారావు (రాజమండ్రి) 144.5 మార్కులతో తృతీయ స్థానాలు సాధించారు. ఏపీ డీజీపీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఫలితాలను ప్రకటించారు. డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ ఆర్.కె.మీనా, అడిషనల్ డీజీపీ ఎన్.మధుసూదనరెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 28, నవంబరు 2022న కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రాథమిక రాత పరీక్షను 22 జనవరి 2023న నిర్వహించారు. మొత్తం 5,03,486 మంది అభ్యర్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 4,59,182 మంది రాత పరీక్షకు హాజరయ్యారన్నారు. వారిలో 95,208 మంది అభ్యర్థులు శారీరక సామర్థ్య పరీక్షలకు అర్హత సాధించారు. శారీరక సామర్థ్య పరీక్షల్లో 95,208కిగాను 38,914 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత పొందారు. అనేక సాంకేతిక, న్యాయపరమైన సమస్యలతో ఈ భర్తీ ప్రక్రియకు ఆటంకాలు ఎదురయ్యాయి. జులై 10న విడుదలయిన తుది రాత పరీక్షా ఫలితాల్లో 33,921 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఎంపికయిన 6,100 మంది అభ్యర్థులకు సెప్టెంబరు మొదటి వారం నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు హోం మంత్రి అనిత తెలిపారు. పోలీసు శాఖలో మిగిలిన ఖాళీలను భర్తీ చేయడానికి త్వరలో ప్రకటన జారీ చేయనున్నారు. 3,580 సివిల్ పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు జరిగిన నియామక ప్రకియలో 1,063 మంది మహిళలు కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా www.slprb.ap. gov.in వెబ్ సైట్ అందుబాటులో ఉంటుంది. వివిధ విభాగాలకు సంబంధిం చిన కటాఫ్ మార్కులు కూడా వెబ్‌సైట్‌లో ఉంచుతారు. అభ్యర్థులు సమాచారం కోసం 94414 50639 లేదా 91002 03323 నంబర్లను సంప్రదించాలి.

అభ్యర్థులకు డీజీపీ శుభాకాంక్షలు

డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా తుది రాత పరీక్షలో విజయం సాధించి కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయిన అభ్యర్థు లకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అన్ని పోలీస్ స్టేషన్లలో సీసీ టీవీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ పోలీసు అకాడమీ 'అప్పా' కోసం 95 ఎకరాల భూమిని సేకరించామని, ల్యాండ్ సర్వే జరుగుతుందని, పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు చేపడతామని వివరించారు.

ట్రంప్ బెదిరింపులకు లొంగొద్దు

(మొదటిపేజీ తరువాయి)

కలిగివుందని సీపీఐ నొక్కిచెప్పింది. వాణిజ్య-సహకార బంధాలతోనే భారత్ పురోగతి సాధిస్తున్నట్లు వెల్లడించింది. ఇంధన భద్రత సాధించడం, రక్షణ సామర్థ్యాలు పెంచుకోవడం, భౌగోళిక రాజనీతి సంబంధమైన సమతుల్యత పొందడం కోసం ఈ బంధాలు భారత్‌కు దోహదమవుతున్నట్లు సీపీఐ పేర్కొంది.

సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

పలువురు నేతల పేర్లు ఉప రాష్ట్రపతి రేసులో ఉన్నాయి. పార్టీ సిద్ధాంతాలు, భావజాలానికి అనుగుణంగా వ్యవహరించే నేతకు బీజేపీ ఆ పదవి అప్పగిస్తుందని సమాచారం. ఉభయ సభల్లో వివిధ ఖాళీలతో కలిపి సభ్యుల సంఖ్య 786గా ఉంది. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మరోవైపు విపక్ష కూటమికి లోక్‌సభలో 234 మంది సభ్యులు, రాజ్యసభలో 79 మంది సభ్యుల బలముంది. మొత్తంగా ఎన్డీయేకు 422 మంది, విపక్ష కూటమికి 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఇలా ఉభయ సభల్లో మెజారిటీ లేనప్పటికీ ఉప రాష్ట్రపతి ఎన్నికలో పోటీ చేసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

ప్రజ్వల్ రేవణ్ణ దోషి

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక న్యాయస్థానంలో డిసెంబర్ 31, 2024న విచారణ ప్రారంభమైంది. ఫోరెన్సిక్ ఆధారాలను పరిగణనలోకి తీసుకున్నారు. గతేడాది లోక్‌సభ ఎన్నికల వేళ హాసన సెక్స్ కుంభకోణం కర్నాటకలో ప్రకంపనలు సృష్టించింది. నాడు ఓ మహిళ షాకింగ్ విషయాలు వెల్లడించింది. తన తల్లిపై కొన్నేళ్ల క్రితం బెంగళూరులోని నివాసంలో ప్రజ్వల్ రేవణ్ణ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపించింది. దీనికి సంబంధించి సిట్ అధికారుల ఎదుట వాంగ్మూలం ఇచ్చింది. అంతేకాకుండా ప్రజ్వల్ వీడియో కాల్‌లో బెదిరించి తన దుస్తులు విప్పించినట్లు తెలిపింది. 'ఆయన మా అమ్మ ఫోన్‌కు కాల్ చేసి... వీడియో కాల్‌లో మాట్లాడాలని నన్ను బలవంతం చేసేవాడు. నా దుస్తులు విప్పాలని అడిగేవాడు. నేను అందుకు నిరాకరిస్తే... నాకు, మా అమ్మకు హాని తలపెడతానని బెదిరించేవాడు' అని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తాము ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగానే... తన తండ్రిని ఉద్యోగం నుంచి తొలగించారని పేర్కొంది. తన నివాసంలో పనిచేసే మహిళలను ప్రజ్వల్ వేధింపులకు గురిచేశాడని తెలిపింది. ప్రజ్వల్ బాధితుల్లో ఎంతో మంది మహిళలు ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

భగవంత్ కేసరికి జాతీయ అవార్డు

(మొదటిపేజీ తరువాయి)



బహదూర్ (హిందీ) శ్రీకాంత్‌దేశాయ్, ఉత్తమ సంగీతం (నేపథ్యం): యానిమల్ (హిందీ) హర్షవర్ధన్ రామేశ్వర్, ఉత్తమ సంగీత దర్శకత్వం: వాతి (తమిళ్) జీవీ ప్రకాశ్ కుమార్, ఉత్తమ ప్రజాదరణ చిత్రం: రాకీ ఔర్ రాణికి ప్రేమ్ కహానీ (హిందీ), ఉత్తమ జాతీయ సమగ్రత, సామాజిక విలువల చిత్రం: సామ్ బహదూర్ (హిందీ), ఉత్తమ పరిచయ దర్శకుడు: ఆత్మపాంప్లెట్ (మరాఠీ) ఆశిష్ బెండే, ఉత్తమ బాలల చిత్రం: నాల్ (మరాఠీ), ఉత్తమ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ మూవీ: హనుమాన్ (తెలుగు) అవార్డులు పొందాయి. నాన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో నేకల్: క్రానికల్ ఆఫ్ ప్యాడీ మ్యాన్ (మలయాళం), ది సీ అండ్ సెవెన్ విలెజెస్ (ఒడియా), ఉత్తమ స్క్రిప్ట్: సన్ ఫ్లవర్స్ వోర్ ది ఫస్ట్ వన్స్ టు నో (కన్నడ), ఉత్తమ వాయిస్ ఓవర్: ది సేక్రెడ్ జాక్-ఎక్స్‌ప్లోరింగ్ ది ట్రీస్ ఆఫ్ విషెస్ (ఆంగ్లం), ఉత్తమ మ్యూజిక్ డైరెక్షన్: ది ఫస్ట్ ఫిల్మ్ (హిందీ), ఉత్తమ ఎడిటింగ్: మూవీంగ్ ఫోకస్ (ఆంగ్లం), ఉత్తమ సౌండ్ డిజైన్: దుందగిరి కే ఫూల్ (హిందీ), ఉత్తమ సినిమాటోగ్రఫీ: లిటిల్ వింగ్స్ (తమిళం), ఉత్తమ డైరెక్షన్: ది ఫస్ట్ ఫిల్మ్ (హిందీ), ఉత్తమ ఎడిటింగ్: మూవీంగ్ ఫోకస్ (ఆంగ్లం), ఉత్తమ సౌండ్ డిజైన్: దుందగిరి కే ఫూల్ (హిందీ), ఉత్తమ సినిమాటోగ్రఫీ: లిటిల్ వింగ్స్ (తమిళం), ఉత్తమ డైరెక్షన్: ది ఫస్ట్ ఫిల్మ్ (హిందీ), ఉత్తమ ఆర్ట్స్/కల్చర్ ఫిల్మ్: టైమ్‌లెస్ తమిళనాడు (ఆంగ్లం), ఉత్తమ బయోగ్రాఫికల్ ఫిల్మ్: మా బావు, మా గావ్ (ఒడిశా), లెంటినో ఓవో ఏ లైట్ ఆన్ ది ఈస్టన్ హారిజాన్ (ఆంగ్లం), ఉత్తమ పరిచయ దర్శకుడు: మావ్: ది స్పిరిట్ డ్రీమ్స్ ఆఫ్ చెరా (మిజో), ఉత్తమ నాన్ ఫీచర్ ఫిల్మ్: ఫ్లవరింగ్ మ్యాన్ (హిందీ)ను అవార్డులు వరించాయి.

రమ్మీ ఆడిన మంత్రికి క్రీడల శాఖ

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయశాఖ మంత్రిగా ఉండగా... తాజాగా ఆ బాధ్యతలను ఎన్సీపీ మంత్రి దత్తాత్రేయ భరణెకు అప్పగించారు. కోకాటేకు క్రీడలు, యువజన సంక్షేమ మంత్రిత్వశాఖ కేటాయించారు. గతంలో ఈ శాఖను దత్తాత్రేయ పర్యవేక్షించారు. వివాదాస్పదమైన చర్యలకు పాల్పడే మంత్రులపై తీవ్ర పరిణామాలు తప్పవనే సంకేతాలిచ్చేందుకే ఈ మంత్రివర్గ మార్పు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అయితే, అసెంబ్లీలో రమ్మీ ఆడిన మంత్రిని పదవి నుంచి తొలగించకుండా కేవలం శాఖ మార్చడం వివాదాస్పదమైంది. 'ఇది జవాబుదారీతనం అనిపించుకోదు. కేవలం కంటితుడుపు చర్య మాత్రమే' అని ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) నేతలు మండిపడ్డారు. ఆయనకు క్రీడల శాఖ అప్పగించడం అంటే... అసెంబ్లీలో రమ్మీ ఆడటాన్ని అధికారికంగా అనుమతించినట్లే అవుతుందని దుయ్యబట్టారు.

మద్యం కేసు నిందితుల రిమాండ్ పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం కేసులో 12 మంది నిందితుల రిమాండ్‌ను ఈనెల 13వ తేదీ వరకు ఏసీబీ న్యాయస్థానం పొడిగించింది. నిందితులను శుక్రవారం ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు హాజరుపరిచారు. ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్, రాజ్ కేసీరెడ్డి, వెంకటేశ్ నాయుడు, పైలా దిలీప్, బాలాజీ గోవిందప్ప, బూనేటి చాణక్య, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రిమాండ్‌ను పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. గుంటూరు నుంచి ఇద్దరిని, రాజమహేంద్రవరం నుంచి ఎంపీ మిథున్‌రెడ్డిని న్యాయస్థానానికి తీసుకురాగా... మిథున్‌రెడ్డిని తిరిగి రాజమహేంద్రవరం జైలుకు పోలీసులు తీసుకెళ్లారు. మిగతా వాళ్లను విజయవాడ, గుంటూరు జైళ్లకు తరలించారు. మిథున్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణను ఏసీబీ న్యాయస్థానం 4వ తేదీకి వాయిదా వేసింది. దానిపై కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశించింది.

వసతులు కల్పించలేదు: మిథున్‌రెడ్డి

గతనెల 20న మిథున్‌రెడ్డి అరెస్టు కాగా రిమాండ్ గడువు ముగియడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి విజయవాడ ఏసీబీ న్యాయస్థానానికి రోడ్డు మార్గంలో ఆయనను తీసుకొచ్చారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు తనకు వసతులు కల్పించలేదని మిథున్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. 'అల్సర్‌తో బాధపడుతున్నా, మందులు వాడుతున్నా, ఒకపూట మాత్రమే ఇంటి భోజనం ఇస్తున్నారు' అని న్యాయమూర్తికి మిథున్‌రెడ్డి తెలిపారు. నిబంధనల ప్రకారమే ఆయనకు వసతులు కల్పిస్తున్నట్లు ప్రభుత్వ న్యాయవాది వెల్లడించారు. మిథున్ రెడ్డి మధ్యంతర బెయిల్‌కు దరఖాస్తు చేసే ఆలోచనలో ఉన్నట్టు ఆయన తరపు న్యాయవాదులు తెలిపారు. కాగా, ఇదే కేసులో ఏ2 వాసుదేవరెడ్డి, ఏ3 సత్యప్రసాద్ బెయిల్ పిటిషన్లపై విచారణను ఈనెల 5వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. సిట్ అధికారుల దగ్గర ఉన్న ల్యాప్‌టాప్, ఫోన్ వెనక్కి ఇప్పించాలని 33గా ఉన్న బాలాజీ గోవిందప్ప న్యాయస్థానంలో మెమో దాఖలు చేశారు.

రూ.11 కోట్ల బాక్సుల ఫోటోలు తీయాలి

మద్యం కేసులో జప్తు చేసిన రూ.11 కోట్లకు సంబంధించిన నోట్ల కట్టలు, బాక్సుల ఫోటోలు తీయాలని సిట్‌కు ఏసీబీ కోర్టు సూచించింది. ఏ1 ఉన్న కేసీరెడ్డి విచారణ సందర్భంగా కోర్టులో కంటతడి పెట్టారు. జప్తు చేసిన మొత్తం తనది కాదన్నారు. ఆ డబ్బు తనదేనని సిట్ చెప్పడంపై ఆవేదన వ్యక్తం చేశారు. నోట్లపై ఉన్న నంబర్లు రికార్డు చేయాలని న్యాయవాదిని కోరారు. ఆ డబ్బును తానే పెట్టెల్లో నిల్వ ఉంచితే వేలి ముద్రలు ఉండాలి కదా అని ప్రశ్నించారు.

సిపిఐ నేత సాబీర్ పాషాకు ఘన సన్మానం...

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : పేదలతోపాటు అన్ని వర్గాల బాధితుల హక్కుల కోసం నిరంతరం సిపిఐ పార్టీ పాటుపడుతూ పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కె. సాబీర్ పాషా స్పష్టం చేసారు. మూడవ సారి సిపిఐ కార్యదర్శిగా ఎన్నికైనందుకు శుక్ర వారం కొత్తగూడెంలోని జమాతే ఇస్లామి హింద్ కార్యాలయంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కేవలం కొత్తగూడెం లోనే అన్ని ముస్లిం సంఘాలు, సంస్థలు ఏకమై సిపిఐ నుంచి పోటీచేసిన కూనంనేని సాంబశివరావుకు ఐక్యంగా మద్దతు పలికి భారీ మెజారిటీతో గెలవడానికి కారకులైయ్యారని కొనియాడారు. ఇదే కార్యాలయంలో ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే కూనంనేని వచ్చి నియోజకవర్గ ముస్లింలు 90 శాతం వరకు తనకు ఓటు వేసారని అప్పట్లోనే స్పష్టం చేసినట్లు సాబీర్ పాషా గుర్తు చేశారు. కేంద్రాన్ని ఏలుతున్న బిజెపి, మోడీ ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో నివసిస్తున్న ముస్లింల తోపాటు దళితులు, బహుజన వర్గాలపై ప్రవర్తిస్తుందని ఆరోపించారు. దేశ ప్రజలు ఈ పరిణామాలను గమనించి గడచిన పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పారని స్పష్టం చేశారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మద్దతుతో మాత్రమే ఇప్పుడు బిజెపి ప్రభుత్వం కొనసాగుతుందని తెలిపారు. అందుకే బహుజన వర్గాలు ముస్లిం సంఘాలు కూడా మెలుకువగా ఉండాలని సూచించారు. కొత్తగూడెంలో ఎమ్మెల్యే కూనంనేని చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఉర్దూగర్ చైర్మన్ నయీమ్ ఖురేషి, ముస్లిం ముషావర కమిటీ పెద్దలు అబ్దుల్ రబ్, అమీర్ ఖాద్రి, జెఐహెచ్ జిల్లా అధ్యక్షులు తాజోద్దీన్ ఖాన్, మహమ్మద్ షరీఫ్, జై హెచ్ పెద్దలు షేక్ జహంగీర్ షరీఫ్, ఉమర్ ఫారూఖ్, ఆబిద్ హుస్సేన్, ఇబ్రహీం, షేక్ హబీబ్, నూర్, మజీద్, హుస్సేన్ ఖాన్,పిడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరం

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబుబాబాద్ : ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే పిల్లలకు త్రాగించాలని ఆ పాలు ఎంతో శ్రేయస్కరమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ అన్నారు. ఆగష్టు 1 నుండి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, కాన్పు అయిన మొదటి కొద్ది రోజులు తల్లిపాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయని, దీనిని ముర్రుపాలు లేదా కొలస్ట్రమ్ అంటారని అన్నారు. ఇందులో ప్రోటీన్లు, రోగాలను ఎదుర్కొనే శక్తిని పెంచే గుణం ఎక్కువగా ఉంటుందని, వీటికి తోడుగా విటమిన్ ఎ, బి లతో పాటు తగినంత ఐరన్ కూడా ఉంటుందని, ముర్రుపాలు బిడ్డకు సంజీవని వంటివని ఇవి అమృతంతో సమానమని తెలిపారు. ముర్రుపాలతో శిశువులు చక్కగా పెరుగుతారని. అప్పుడే పుట్టిన బిడ్డ ప్రేగులకు జీర్ణశక్తిని బాగా ఉంచడంలో తోడ్పడతాయని అంతేకాక, కామెర్లు, విరేచనాల వంటి ప్రమాదకరమైన రోగాల నుండి కాపాడతాయన్నారు. తల్లికి లేదా బిడ్డకూ ఒకవేళ ఒంట్లో బాగా లేకపోయిన బిడ్డకు పాలివ్వడం మానవద్దు బిడ్డను ఒకవేళ విరేచనాలు అవుతున్నా తప్పకుండా తల్లిపాలే ఇవ్వాలని కోరారు.

ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందించడంపై దృష్టి పెట్టాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి : ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాల అందించడంపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జిల్లాలో మెరుగైన విద్య అమలుపై రామగుండం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మన జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయుల నుంచి సలహాలు సూచనలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ప్రతి రోజు పిల్లలకు ఏఐ ల్యాబ్‌లో కనీసం 20 నిమిషాలు హాజరయ్యే విధంగా షెడ్యూల్ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థి ప్రమాణాలు పెంచేందుకు ఏఐ టూల్స్ వినియోగంపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు రాబోయే 5 సంవత్సరాల పాటు ఎటువంటి మార్పులు చేయాల్సిన అవసరం లేకుండా అవసరమైన మౌలిక వసతుల కల్పన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి అన్ అకాడమీ పనులు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు 3 నెలలో పూర్తి చేస్తామని అన్నారు.విద్యార్థులు వర్క్‌బుక్ ఉపయోగించేలా చూడాలన్నారు. విద్యార్థులకు చదవడంతో పాటు చదివింది అర్థం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పిల్లలకు కంప్రెహెన్షన్ స్కిల్ వస్తే గణితం సైన్స్ సోషల్ బాగా అర్థం చేసుకుంటారని, బేసిక్ విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసి వృత్తికే వన్నెతెచ్చిన శంకర్‌గౌడ్

విశాలాంధ్ర - వనపర్తి : కళా సాహితీ వేదిక అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయులు పలుస శంకర్ గౌడ్ పదవీ విరమణ వీడ్కోలు సభ శ్రీ లక్ష్మీ కృష్ణ గార్డెన్ నందు ఉపాధ్యాయులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, పత్రికా ప్రతినిధులతో ఘనంగా జరిగింది. ఇట్టి సమావేశానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ఎం.పి, మాజీ ఎం.ఎల్.ఏ రావుల చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై పలుస శైలజా శంకర్ గౌడ్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి బైరోజు చంద్ర శేఖర్ అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ శంకర్ గౌడ్ తన అంకితభావంతో పనిచేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చినారు అని రిటైర్మెంట్ తర్వాత తన శేషజీవితాన్ని కాదు తన అనుభవంతో సమాజ సేవకు విశేషమైన జీవితాన్ని ఉపయోగించాలని సూచించారు. శంకర్ గౌడ్ రిటైర్మెంట్ నిన్న జరిగింది తన పుట్టినరోజు కావడం యాదృచ్ఛికం అయినా సమాజస్రలో శంకర్‌గౌడ్ నూతన పాత్ర పోషించటానికి నాంది కావాలని ఆకాంక్షించారు. శంకర్ గౌడ్ వృతి ఉపాధ్యాయుడు అయిన ప్రవృతి రీత్యా ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు, సమాజ సేవలు చేశారని వారు స్థాపించిన కళా సాహితీ వేదిక భవిష్యత్తు తరాలకు మార్గదర్శనమైంది అని అన్నారు. వనపర్తి సంస్థానం విద్యకు, సాగునీరు, తాగు నీరుకు పాలకులు పెట్టింది పేరని అటువంటి మన వనపర్తిని పాలకులు ఎవరైనా బ్రాండ్ ఇమేజ్ కాపాడాలని సూచించారు. గట్టు యాదవ్, వామను గౌడ్, వాకిటి శ్రీధర్, పలుస.రమేష్ గౌడ్, నందిమల్ల.అశోక్, ఉపాధ్యాయులు రవిప్రసాద్, కంటే ఆంజనేయులు, వరప్రసాద్, జన జ్వాల రాధాకృష్ణ, రాజారాం ప్రకాష్, షేక్.జహంగీర్, బండారు.కృష్ణ, ఉంగ్లం. తిరుమల్, నాగన్న యాదవ్ పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం : మంత్రి సీతక్క

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో / హైదరాబాద్ : రాష్ట్రంలోని రైతుల కోసం సాగునీటి వనరుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సులోని నీటిని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణిలతో కలిసి పంట కాలువలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రామప్ప నుండి లక్నవరం వరకు నీటి కాలువను ఏర్పాటు చేస్తామని, దీని ద్వారా రైతులకు ఏడాదిలో రెండు పంటలకు నీరు అందించే అవకాశం ఏర్పడుతుందని వెల్లడించారు. మన పూర్వీకులు, ముఖ్యంగా కాకతీయులు ఊరిని అభివృద్ధి చేసేందుకు చెరువులను తవ్వించి సాగునీరు, తాగునీరు అందించేవారు. వారి ఆచారాలను అనుసరించి, గ్రామీణాభివృద్ధిని ఊహించుకోగలిగే ప్రణాళికలతో పని చేస్తున్నామని, చెరువుల్లో నీరు ఉంటే ఊరు పచ్చగా మారుతుందనీ, అదే స్ఫూర్తితో రైతులకు నీటి కొరత లేకుండా పనిచేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని రంగాల్లో కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ నారాయణ, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ ములుగుజిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రజల భాగస్వామ్యం కావాలి

విశాలాంధ్ర - తొర్రూర్: సమస్యల పరిష్కారములు ప్రజలు అధికారులు భాగస్వామి కావాలని సిడిఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు అన్నారు. ఒక మార్పు అభివృద్ధికి మలుపు అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 డేస్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శుక్రవారం సిడి ఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణ రావు శుక్రవారం తొర్రూర్ మున్సిపాలిటీ కమిషనర్ వక్కల శ్యాంసుందర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సి డి ఎం ఏ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హండ్రెడ్ డేస్ యాక్షన్ ప్లాన్ అన్ని మున్సిపాలిటీలో విజయవంతంగా సాగుతుందని అన్నారు. క్లీన్ అండ్ గ్రీన్‌పై పబ్లిసిటీ పార్కుల డెవలప్మెంట్ సీజనల్ వ్యాధుల నివారణ ఇలా రోజుకో ప్రోగ్రాంను అమలు చేస్తున్నారని దీనికి ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తుందని అన్నారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్ మాట్లాడుతూ పెద్ద కాలువల పూడికతీత స్వచ్ఛత పట్టణ పారిశుధ్యం పై ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించటం జ్యూట్ బ్యాగులు వాడడంపై అవగాహన తడి పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు ఎరువుల తయారీకి ప్రోత్సాహం అలాగే రోడ్ల వెంట ఉన్న చెట్లను జెసిబి సహాయంతో తొలగించడం జరిగిందని పేర్కొన్నారు. మున్సిపల్ డిఈ ఏఈ రంజిత్. మేనేజర్ కట్టస్వామి వార్డ్ ఆఫీసర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : అర్హత కలిగిన అందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ శాసనమండలి సభ్యులు దండే విఠల్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని కౌటాల మండల కేంద్రంలో రైతు వేదికలో ఏర్పాటు చేసిన నూతన, కుటుంబ సభ్యుల చేర్పులతో రేషన్ కార్డుల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, మార్కెట్ కమిటీ చైర్మన్ సుద్దాల దేవయ్య, ఉమ్మడి జిల్లా డి.సి.ఎం.ఎస్.వైస్ చైర్మన్ కుమురం మాంతయ్యలతో కలిసి లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు మాట్లాడుతూ అర్హత కలిగిన అందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని, గత 10 సంవత్సరాల తరువాత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్‌కార్డులు అందజేస్తుందని ప్రజా పాలన కార్యక్రమంలో రేషన్‌కార్డు కొరకు అందిన దరఖాస్తులను సమగ్రంగా విచారించి అర్హులైన అందరికీ రేషన్ కార్డులు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని. ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ ప్రతి పథకం మహిళల పేరిట ప్రవేశపెట్టి అమలు చేస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, పేర్లను రేషన్ కార్డులలో నమోదు కొరకు మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకున్నట్లయితే తహసిల్దార్, సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

గొర్రెలకు ఉచితంగా నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : ముందస్తు చర్యలే గొర్రెల ప్రాణాలను కాపాడుతాయని వ్యాధుల నివారణకి టీకాలు ప్రధాన సాధనమని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. శుక్రవారం సంగారెడ్డి మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గొర్రెలలో వచ్చే నీలి నాలుక వ్యాధి వల్ల గొర్రెల కాపరులు తీవ్రంగా నష్టపోతున్నారని గొర్రెల లో నీలి నాలుక వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండడం కోసం ప్రభుత్వం గొర్రెలకు కు ఉచితంగా నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నదని గొర్రెల పెంపకం దారులకు సూచించారు. నీలి నాలుక వ్యాధి వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి సోకిన గొర్రెలకు జ్వరం రావడం నోరు వాచి నీరు వదలడం లాంటి లక్షణాలతో గొర్రెలు చివరికి మరణించడంతో గొర్రెల పెంపకం దారులు తీవ్రంగా నష్టపోతున్నారని అలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండడం కోసం ప్రభుత్వం గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఉచిత టీకాల పంపిణీ కార్యక్రమాన్ని గొర్రెల పెంపకం దారులు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి గ్రామంలో పదిమంది గొర్రెల కాపరులకు చెందిన 900 గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేయించాలని అధికారులకు సూచించారు. గొర్రెల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి వసంతకుమారి, పశు వైద్య శాఖ సహాయ సంచాలకులు, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

పంచ జ్యోతిర్లింగ యాత్రకు ప్రత్యేక రైలు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : పంచ జ్యోతిర్లింగ దర్శన యాత్రకు భారత్ గౌరవ ప్రత్యేక పర్యాటక రైలు ఏర్పాటు చేసిందని మెదక్ జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రముఖ పుణ్య క్షేత్రాలు దర్శించుకోవాలని ఐఆర్సిటీసి అసిస్టెంట్ మేనేజర్ వెంకటేష్ సూచించారు. శుక్రవారం మెదక్ రైల్వే స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ ట్రైన్ సికింద్రాబాద్ నుండి ఈ నెల 16న బయలుదేరుతుందని చెప్పారు. యాత్రికుల దర్శన ప్రదేశాల గురించి ఆయన వివరించారు. ప్రతి కోచ్‌కు ఒక సీసీ కెమెరా, సెక్యూరిటీ గార్డ్, టూరిస్ట్ మేనేజర్ ఉంటాడని తెలిపారు. పర్యాటకులకు యాత్ర సమయంలో భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు, ప్రతి భోగిలో ఐఆర్సిటిసి సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ సమావేశంలో అధికారులు ప్రశాంత్ తదితరులున్నారు.

ఆపరేషన్ ముస్కాన్ ద్వారా

54 మంది బాలకార్మికులకు విముక్తి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 54 మంది బాలలను గుర్తించి వారిని విముక్తి చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా ముస్కాన్ నిర్వహించడం జరిగిందన్నారు. దీనికోసం జిల్లాలో 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జూలై 1 నుండి 31 వరకు నెల రోజుల పాటు ఆపరేషన్ ముస్కాన్ చేపట్టామన్నారు. విముక్తి పొందిన వారిలో 44 మంది మగ పిల్లలు,10 మంది బాలికలు ఉన్నారని ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చిన్న పిల్లలను పనిలో పెట్టుకున్న 39 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. మరో 13 మందికి నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదన్నారు. అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా 112 కి ఫోన్ చేసి పోలీసు వారికి సమాచారం అందించాలని తెలిపారు. ప్రత్యేక బృందాల సభ్యులను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

సింగరేణిలో 97శాతం బొగ్గు ఉత్పత్తి సాధన

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: సింగరేణిలో ఈ సంవత్సరం జులై 31 వరకు 97 శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించామని ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి వివిధ డివిజన్లలో మొత్తం 20816200టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా 20188089 టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఇది 97 శాతం ఉత్పత్తి సాధన అని ఆయన వివధ డివిజన్ల బొగ్గు ఉత్పత్తి తీరుతెన్నులను వివరించారు. కొత్తగూడెంలో 4.86 మి.ట (103%) ఇల్లందులో 0.88 మి.ట. (85%), మణుగూరులో 3.95 మి.ట.(108%), బెల్లంపల్లిలో 1.03 మి.ట (95%), మందమర్రిలో 0.58 మి.ట.(67%), శ్రీరాంపూర్‌లో 1.98 మి.ట.(92%), ఆర్.జి వన్‌లో 1.26 మి.ట.(83%), ఆర్.జి -2 లో 2.65 మి.ట.(134%), ఆర్.జి-3లో 1.81 మి.ట.(88%), అడ్రియాల ప్రాజెక్టులో 0.051 మి.ట.(20%), భూపాలపల్లిలో 1.09 మి.ట (77%), మొత్తం సింగరేణి సంస్థలో 97శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఆయన అన్నారు. అధికారులు, అంజనేయ ప్రసాద్ ఆంజనేయులు, రవీందర్ రెడ్డి, జితేందర్ సింగ్, లక్ష్మీభాయి, వీరారెడ్డి, శ్రవణ్ కుమార్, ఫిరోజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయం స్వాధీనానికి వచ్చిన ఎండోమెంట్ అధికారులు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: మెదక్ ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం, 50 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ కోదండ రామాలయంపై ఎండోమెంట్ అధికారుల కన్ను పడింది. శుక్రవారం ఆలయాన్ని స్వాధీనం చేసుకుని హుండీలకు సీల్ వేయడానికి ఎండోమెంట్ అధికారులు వచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, బీజేపీ నాయకులు ప్రతిఘటించడంతో వెనుతిరిగి వెళ్లారు. ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ రంగారావు ఆధ్వర్యంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, టౌన్ పోలీస్ సిబ్బందితో కలిసి ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్లు సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, శ్యామ్ కోదండ రామాలయంకు చేరుకున్నారు. గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు రెండుసార్లు నోటీసులు జారీ చేసినా ఎలాంటి స్పందన లేదు. ఆలయానికి సంబంధించిన రికార్డులు, లెక్కలు అప్పగించలేదని ఇన్స్పెక్టర్ రంగారావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆలయం స్వాధీనం కోసం వచ్చినట్లు తెలిపారు. హుండీలకు సీల్ వేసేందుకు సిద్ధం కాగా సమాచారం అందుకున్న కమిటీ అధ్యక్షులు బండ నరేందర్, సభ్యులు, భక్తులు, బీజేపీ నాయకులు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఎండోమెంట్ అధికారులను సీల్ వేయకుండా అడ్డుకున్నారు. అక్కడికి చేరుకున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ఎండోమెంట్ అధికారులు వచ్చిన విషయం ఎంపి రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లారు. ఎండోమెంట్ అధికారులను బయటకు పంపా లని ఎంపీ సూచించారు. హిందూ దేవాలయాలపై రోజు రోజుకు పెత్తనం పెరిగిపోతుందన్నారు. పెద్ద ఎత్తున ప్రతిఘటించడంతో ఎండోమెంట్ అధికారులు వెనక్కి వెళ్లిపోయారు. జరిగిన విషయాన్ని కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తామని ఇన్స్పెక్టర్ రంగారావు తెలిపారు. టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మెదక్ భక్తుల చేతిలో దినదినాభివృద్ధి చెందుతున్న కోదండ రామాలయాన్ని ప్రభుత్వపరం కాకుండా కాపాడుకుంటామని బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందూ దేవాలయలకు రక్షణ లేకుండా పోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే మెదక్ బంద్ నిర్వహిస్తామన్నారు.

ఈఓ నియామకం

ఆలయాన్ని ఎండోమెంట్స్ శాఖ కింద స్వాధీనం చేసుకుని, మెరుగైన పరిపాలన కోసం ఆలయానికి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించారు. కూచనపల్లి శ్రీ కుచాద్రి వెంకటేశ్వర స్వామి ఆలయం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.శ్రీనివాస్‌ను కోదండ రామాలయం ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నెల రోజుల క్రితమే బాధ్యతలు ఇస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు.

జిల్లాలో యూరియా కొరత లేదు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లాలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సరిపడ యూరియా ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన వ్యవసాయ, సహకార శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో యూరియా నిల్వలు, సరఫరా, వినియోగ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసారు. పంటల సాగుకు అవసరమైనంత సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రైతులు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేయడం వల్ల కృత్రిమంగా డిమాండ్ పెరిగినట్టు కనిపిస్తోందన్నారు. దీని వల్ల అయోమయ పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. యూరియాను పంటల సాగుకు కాకుండా ఇతర అవసరాల కోసం మళ్లించరాదని సూచించారు. పక్కదారు మళ్లించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. యూరియా పంపిణీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రైతులకు అవసరమైనంత మేరకు మాత్రమే యూరియా ఇవ్వాలన్నారు. రైతులు నానో యూరియా వినియోగించేలా చూడాలని దీనివల్ల ఖర్చు తగ్గుతుందన్నారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సీజన్‌లో 1000 ఎకరాల మునగ సాగు లక్ష్యంగా పెట్టుకోవాలని చెప్పారు. ఈ పంట ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం లభిస్తుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, డీఎస్ఓ అవధాని శ్రీనివాసరావు, డిపిడి ఆత్మ బి. సరిత, మార్క్ఫెడ్ డిఎం సునీత, సొసైటీ సీఈఓలు, వ్యవసాయ శాఖ ఏడిఏ లు, ఏవోలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : కొత్తగూడెం ఏరియాలో సింగరేణి కాలరీస్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యం స్పందించి పరిష్కరించాలని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు కొత్తగూడెం ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా పీవీకే 5 గని వద్ద గేట్ మీటింగ్‌లో ప్రసంగించారు. అనంతరం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజుతో సమావేశమై కార్మిక సమస్యల పరిష్కారం కోసం చర్చించారు. పీవీకే 5 గని వద్ద పిట్ కార్యదర్శి హుమాయూన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో సీతారామయ్య, రాజ్ కుమార్ మాట్లాడుతూ గతంలో కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి ఎలాంటి ఆర్థిక సాయం అందేది కాదన్నారు. కానీ ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఎన్నికైన తర్వాత యాజమాన్యం తోపాటు బ్యాంకులతో చర్చించి, ప్రమాదంలో మరణించిన ప్రతి కార్మికుడి కుటుంబానికి రూ.1.20 కోట్లు వచ్చేలా సాధించించడం జరిగిందన్నారు. అదేవిధంగా సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి కూడా రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు. దీనికి కూడా సానుకూలంగా స్పందన వచ్చిందని వెల్లడించారు. జేఎంఈటీ కార్మికుల సమస్యల గురించి మాట్లాడుతూ నియామకం సమయంలో ఒక ఏడాది వరకు సర్టిఫికెట్ సమర్పించని వారిని యాజమాన్యం తొలగించిందన్నారు. ఏరియా అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ గట్టయ్య, సివిల్ పిట్ కార్యదర్శి శ్రీనివాస్, పిట్ వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సాయి పవన్, వీ కే వర్క్ షాప్ పిట్ కార్యదర్శి మధు కృష్ణ, స్టోర్స్ పిట్ కార్యదర్శి కమల్,బుక్య రమేష్, కుర్ర రమేష్, బివి రమణ, సందీప్, శ్రీనాథ్, ప్రసాద్, శ్రీధర్, సతీష్, మహేష్, ఆఫీస్ బేరర్ సంద బోయిన శ్రీనివాస్, పిట్ సెక్రెటరీ మధు కృష్ణ, ఏరియా స్టోర్ ఫిట్ సెక్రెటరీ కమల్, బుక్య రమేష్, కుర్ర రమేష్, రమణ, కే రామచందర్పీ వీకే గని కార్మికులు పాల్గొన్నారు.

సృష్టి కర్తకు భయపడాలి....

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్: బాధ్యతా రాహిత్యంగా జీవితాలు సాధించకుండా సృష్టికర్త ఉన్నాడని గుర్తించి భయభక్తులతో మంచి పనులు చేసే వారికే ఇహ, పర లోకాల్లోనూ శాంతి చేకూరుతుందని జమాతే ఇస్లామి హింద్ సీనియర్ బాధ్యులు, సామజిక కార్యకర్త షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. మానవాళి శాస్త్రీయ సాంకేతిక రంగాల్లో ఎంత ఎదిగినప్పటికీ ప్రోగ్రాం పెట్టారు భూకంపాలు, సునామీలు, వరదల లాంటి పకృతి వైపరీత్యాలు మనిషిని వెక్కిరిస్తూనే ఉన్నాయన్నారు. పవిత్ర శుక్రవారం సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్ మేధర బస్తీలోని మస్జిద్ ఎ వహీద్‌లొ ఆయన మాట్లాడారు. సృష్టి జీవరాశుల్లో అత్యుత్తమ జీవి అయిన మనిషి తన ఆస్తిత్వాన్ని, జీవిత ప్రధాన్యతను మరచి సృష్టి కర్త అయిన దైవాన్ని, ఆయన ఆదేశాలకు భిన్నంగా బతుకుతున్నట్లు బాసిత్ చెప్పారు. ఈ భూప్రపంచమే సర్వంగా, ధన సంపాదనే ధ్యేయంగా ఇష్టం వచ్చినట్లు బ్రతకటం ఆధునిక మనిషికి వెలవటైందన్నారు. నేటి ఆధునిక సమాజంలో ఆధర్మంగా బ్రతుకుతు అన్యాయాలు, అక్రమాలే తెలివితేటలని భావించడం సాధారణమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రక్త సంబంధాలు, బాంధవ్యాలు స్నేహాలకు మనిషి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. మన జీవితం ఎప్పుడు ముగుస్తుందో తెలియదని అందుకే తోటి మనుషులతో బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు. మనుషులందరికీ ఒక్కడే ఉన్నాడని భావించి సమాజంలో మానవత విలువలను పాదు గొలుపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు షారుఖ్ యజ్దాని, మసీదు మౌలానా యూసుఫ్ ఖాన్, జబ్బార్ సాబ్, ఆబీద్ హుస్సేన్, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : ఏటూరు నాగారం సామజిక ఆరోగ్య కేంద్రంను సీజనల్ డిసీసెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్పెషల్ ఆఫీసర్, తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి సందర్శించి, సామాజిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్లు, సిబ్బందినీ ఉద్దేశించి మాట్లాడుతూ, గిరిజన ప్రాంత ప్రజలకు వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ వ్యాధులపట్ల అవగాహనను పెంపొందించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఈ రాబోయే రెండు మాసాల వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశిం చారు. సామాజిక ఆరోగ్య కేంద్రం, ఫీవర్ వార్డ్లో, చికిత్స పొందుతున్న జ్వర బాధితుల ఆరోగ్య పరిస్థితులను, వారి కేస్ షీట్ పరిశీలించి, రోగులకు గల ప్లేట్లెట్స్ సంఖ్యను అడిగి తెలుసుకుని వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత డాక్టర్లకు, సిబ్బందికి తెలియజేశారు. అనంతరం కేంద్రంలోని ఐ సి టి సి సెంటర్‌ను సందర్శించి, హెచ్ఐవి టెస్టుల వివరాలను అడిగి తెలుసుకుని, హెచ్ఐవి బాధితులకు మందులను పంపిణీ చేసి వారికి హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగించాలని సిబ్బందికి వివరించారు. అనంతరం రక్త నిధి సెంటర్‌ను ప్రసూతి వార్డును సందర్శించి, తల్లులను వారి పిల్లల ఆరోగ్యాన్ని వారికి అందుతున్న వైద్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు, డిసిహెచ్ ములుగు డాక్టర్ జగదీష్ , సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్, వివిధ విభాగాల అధికారులు డాక్టర్స్, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మోదీ నేతృత్వంలో మిగిలింది అవమానమే

పాత మిత్రుడు మైత్రి కొనసాగించకపోతే అంత నష్టం లేదు. కానీ బద్ధ శత్రువుగా మారితే చాలా ప్రమాదం. ట్రంప్ నాకు సన్నిహిత మిత్రుడు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్ని గొప్పలు చెప్పుకున్నా గత జనవరిలో ట్రంప్ మళ్లీ అధ్యక్షుడైన తరవాత మన దేశంపై శత్రుత్వమే ప్రదర్శిస్తున్నారు. కొంత కాలంగా భారత్ భారీగా సుంకాలు విధిస్తోందని ఆరోపించారు. వాణిజ్య లావాదేవీల భయం పెట్టి భారత్-పాకిస్థాన్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించేట్టు చేశానని లెక్కలేనన్ని సార్లు ట్రంప్ చెప్పారు. ఆ లెక్కన ట్రంప్‌కు భారత్‌తో వాణిజ్య సంబంధాలు కొనసాగించే ఉద్దేశమే ఉంటే భారత్ నుంచి అమెరికా దిగుమతి చేసుకునే సరుకుల మీద 25 శాతం సుంకం విధించి ఉండరు. భారత్ తమకు మిత్ర దేశమే అయినా కొంత కాలంగా రెండు దేశాల మధ్య పెద్ద వాణిజ్య సంబంధాలేవీ లేవని కూడా చెప్పారు. అంటే భారత్‌తో వాణిజ్య సంబంధాలు లేకపోయినా ఫరవాలేదన్నట్టే. ప్రపంచంలో అన్ని దేశాలకన్నా భారతే ఎక్కువ సుంకాలు విధిస్తోందని కూడా అన్నారు. అంతే కాకుండా భారత్ రష్యా నుంచి భారీగా ఆయుధాలు, భారీగా ఇంధనం దిగుమతి చేసుకుంటోందని, అందువల్ల భారత్ పై జరిమానా విధిస్తామని కూడా ట్రంప్ హుంకరించారు. చైనాతో భారత్ వాణిజ్య సంబంధాలు కూడా ఎక్కువగా ఉండడం సైతం ట్రంప్ ఆగ్రహానికి కారణమైంది. ఉక్రెయిన్ మీద యుద్ధం నిలిపివేయడానికి నిరాకరించే రష్యాతో వాణిజ్య సంబంధాలు ఏమిటి అన్నది ట్రంప్ ప్రశ్న. ట్రంప్ పెంచిన 25 శాతం సుంకాలు, జరిమానాలు శుక్రవారం నుంచి అమలులోకి వచ్చాయి. దీనివల్ల భారత్‌కు ఎంతో కొంత నష్టం తప్పదు. ట్రంప్ అక్కడితో ఆగలేదు. భారత్ ఆర్థిక వ్యవస్థ మృత ప్రాయమైంది అన్నారు. రష్యాదీ అంతేనట. రెండు దేశాలు కలిసి గంగలో దూకనీ అని కూడా శపించారు. చమురు, గ్యాస్ వెలికి తీయడం కోసం అమెరికా పాకిస్థాన్‌కు సహకరిస్తుందట. భవిష్యత్తులో భారత్ తమకు ఏ మాత్రం కిట్టని పాకిస్థాన్ నుంచి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ట్రంప్ ఇలాంటి బెదిరింపులకు దిగడం భారత్‌కే పరిమితమైంది కాదు. బ్రెజిల్‌తో సహా అనేక లాటిన్ అమెరికా దేశాలను, ప్రస్తుతం అమెరికాతో పోటీ పడ్తున్న చైనానూ ఇలాగే హెచ్చరించారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ట్రంప్‌కు గట్టి సమాధానమే ఇచ్చారు. రష్యా నుంచి చమురు దిగుమతి ఆపేయకపోతే చైనా మీద కూడా భారీ సుంకాలు విధిస్తామని ట్రంప్ బెదిరిస్తున్నారు. కానీ చైనా బెదిరిపోలేదు. పైగా ట్రంప్‌కు గట్టి సమాధానం ఇచ్చింది. తమ దేశానికి ఏది ప్రయోజనకరమో ఆ మార్గాన్నే అనుసరిస్తామని చైనా దీటుగా సమాధానం చెప్పింది. ఒత్తిడి చేయడం వల్ల ఒరిగేదేమీ లేదని కూడా తెగేసి చెప్పింది. అనేక లాటిన్ అమెరికా దేశాలు కూడా ట్రంప్‌కు తగిన సమాధానమే చెప్పాయి. భారత్ నుంచి మాత్రం కచ్చితమైన సమాధానం ఏదీ రాలేదు. అయితే ఎవరి సంతకమూ లేని ఒక ప్రకటన మాత్రం విడుదలైంది. ట్రంప్ ప్రకటనను గమనించామని, సంప్రదింపుల ద్వారా సముచితమైన, సమతూకంతో కూడిన, పరస్పరం ప్రయోజనం కలిగించే ఒప్పందం కుదుర్చుకుంటామని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. మన ఆర్థిక వ్యవస్థ మృతప్రాయం అవుతోందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కొద్ది కాలంగా చెప్తూనే ఉన్నారు. మన ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసింది మోదీయేనని రాహుల్ దాపరికం లేకుండానే చెప్పేశారు. మన ఆర్థిక వ్యవస్థ ధ్వంసం కావడానికి రాహుల్ గాంధీ కొన్ని కారణాలు కూడా బయట పెట్టారు. అదానీ ప్రయోజనాలు కాపాడుకోవడానికి పాకులాండడం, పెద్ద నోట్ల రద్దు, అస్తవ్యస్తమైన వస్తు సేవల పన్ను (జీఎస్టీ), ఇతర దేశాల విడిభాగాలను కూర్చి మన దేశంలో వస్తువులు తయారు చేయడంలో విఫలం కావడం, మధ్య తరహా, చిన్న పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు)మాయమై పోవడం, రైతుల మీద అణచివేత మొదలైనవి మన ఆర్థిక వ్యవస్థ కూరుకు పోవడానికి కారణం అని రాహుల్ ఆక్షేపించారు.

మన ఆర్థిక వ్యవస్థ మృత ప్రాయం అయిందని ట్రంప్ అవమానించినా ప్రధానమంత్రి మోదీ ఇప్పటిదాకా ఒక్క మాటైనా మాట్లాడలేదు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కూడా నోరే విప్పలేదు. మోదీ తన స్నేహానికి ప్రాధాన్యం ఇస్తున్నందువల్ల ట్రంప్ ను తప్పుపట్టలేదనుకుందాం. కానీ అవమానాన్ని సైతం సహించే స్థితిలో ఎందుకు పడిపోయినట్టో. ఈ అవమానం మోదీకి మాత్రమే కాదు. ట్రంప్ దేశవాసులందరినీ అవమానించారు. దేశ గౌరవాన్ని కాపాడే బాధ్యతను మోదీ విస్మరించారు. మన ఆర్థిక వ్యవస్థ మృత ప్రాయమైంది అని ట్రంప్ అనడాన్ని రాహుల్ సమర్థించారు. ఆయన ఈ మాట ఎప్పటి నుంచో చెప్తున్నారు. బీజేపీ నేతలు ట్రంప్‌ను ఒక్క మాటైనా అనకుండా రాహుల్ మీద విరుచుకుపడ్తున్నారు. రాహుల్ వ్యక్తం చేసిన అభిప్రాయాన్నే ట్రంప్ కూడా వ్యక్తం చేసినప్పుడు ఆయననూ బీజేపీ నేతలు దుయ్యబట్టాలిగా! అలా జరగడం లేదు. అంటే ట్రంప్‌ను చూస్తే ఇటీవల మోదీ ఛాతీ 56 అంగుళాల నుంచి 36 అంగుళాలకు కుంచించుకుపోయినట్టే బీజేపీ నాయకులు కూడా ఒణికి పోతున్నట్టున్నారు. మోదీ వెనకేసుకొస్తున్న వ్యాపార వర్గాల వారు ట్రంప్‌ను విమర్శించకపోయినా కనీసం అభ్యంతరమైనా వ్యక్తం చేయడం లేదు. మోదీ కీర్తి గానంలో లీనమై పోయే గోదీ మీడియా, కరడుగట్టిన జాతీయవాదులు అందరూ కట్టగట్టుకుని ఎక్కడ మాయమై పోయారో? రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తే మన మీద జరిమానా విధిస్తానంటున్న మోదీ పాకిస్థాన్ మాత్రం రష్యాతో సంబంధాలు పెంచుకుంటూ ఉంటే కిమ్మనకపోవడానికి కారణం ఏమై ఉంటుంది. భారత్-పాకిస్థాన్ దేశాలు రెండూ తనకు మిత్ర దేశాలే అంటున్న ట్రంప్ భారత్ మీద మాత్రమే జరిమానా విధిస్తానంటు న్నారు. పాకిస్థాన్‌లోని ఉక్కు పరిశ్రమలను ఆధునికీకరిం చడం కోసం రష్యాతో షాంఘై సహకార సంఘం సమావేశంలో గత జులై 12న ఒప్పందం కుదిరింది. అది ట్రంప్‌నకు అభ్యంతరకరం కాకపోవడం అంటే భారత్ మీదే కత్తిగట్టినట్టు ప్రవర్తిసున్నారనే. ట్రంప్ నోరు జారడం, ఆ విషయాన్ని తరవాతైనా గ్రహించకపోవడం పరిపాటే. అబద్ధాలు చెప్పడంలోనూ మోదీతో సహా ఏ దేశ నాయకుడూ ట్రంప్‌కు సాటి రారు. ట్రంప్ అన్న మాటలు మన సార్వభౌమాధికారాన్ని చులకన చేసేవిగా ఉన్నాయి. ట్రంప్ వైఖరి మనకు అవమానకరం అని మోదీ భావించకపోవడం ట్రంప్ అన్న మాటల కన్నా పెద్ద అవమానం. ఆలింగనాలు, సుదీర్ఘ కరచాలనాలతో విదేశాంగ విధానం కొనసాగదు. ట్రంప్ అవమానిస్తూ ఉంటే మోదీ మన ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెడ్తున్నారు.

మోదీ పాలనలో ప్రజలకు రక్షణ కరువు

కె. సుబ్బరాయన్, సీపీఐ ఎంపీ

గత 11 సంవత్సరాల మా అనుభవం పాలక వర్గంలో ఉన్నవారు నమ్మదగినవారు కాదని పదే పదే నిరూపించింది. పహల్గాం దాడి, ఆ తర్వాత జరిగిన 'ఆపరేషన్ సిందూర్' ఆ తదనంతరం జరిగిన దాడి నేటి ప్రభుత్వం అస్సలు నమ్మదగినది కాదని రుజువు చేస్తున్నాయి. అధికరణ 370 రద్దు తర్వాత కశ్మీర్ లోయలో ఎటువంటి టెర్రరిస్టు, ఉగ్రవాద దాడి జరగలేదని మోదీ ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్నది. కానీ పహల్గాం దాడి ఈ ప్రభుత్వం నిజం చెప్పడం లేదని, ప్రజలకు తప్పుడు సమాచారం మాత్రమే అందిస్తోందని నిరూపించింది. ఈ దాడిలో 26 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ అంశానికి సంబంధించి నిఘావర్గాలు పూర్తిగా వైఫల్యం చెందాయి. అధికారంలో ఉన్న వారందరూ 'సత్యమేవ జయతే' అనే బోధనను నిజంగా పాటిస్తే, దాడికి నైతిక బాధ్యత వహిస్తూ హోం మంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేసి ఉండాలి. ఆయన రాజీనామా చేయాలి. కానీ, ఆయన రాజీనామా చేయలేదు. పహల్గాంలో టెర్రరిస్టు దాడికి ప్రతిగా భారతదేశం నిర్వహించిన 'బలమైన,' 'విజయవంతమైన' 'నిర్ణయాత్మక' "ఆపరేషన్ సిందూర్"పై పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా జులై 30 ఉదయం అమిత్‌షా లోక్‌సభలో ప్రసంగిస్తున్నప్పుడు సైతం ప్రజాస్వామ్యాన్ని బెదిరించే రీతిలో మాట్లాడారు. ప్రజాస్వామ్యానికి ముప్పువాటిల్లేలా హోం మంత్రి ప్రసంగం ఉంది. లోక్‌సభకు ఎటువంటి వివరణ ఇవ్వడానికి కేంద్ర హోం మంత్రి సభకు రాలేదు. వాదించడానికే ఆయన ప్రయత్నించారు. ఆయన ప్రసంగంలోని స్వరం, ఆయన ప్రసంగం సారాంశం ఈ విషయాన్ని నిరూపిస్తోంది.

ఈ దేశ ప్రజలను రక్షించే సామర్థ్యం మోదీ ప్రభుత్వానికిలేదు. వారి మాటలు, చేతలలోనే ప్రతిదీ స్పష్టమైంది. ప్రతిపక్ష పార్టీలలో బలహీనంగా ఉన్న వారిని తమ వైపు తిప్పుకోవాలనే వారి కోరిక మనకు ప్రస్ఫుటమౌతోంది. ఈ దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వారికి ఎన్నటికీ ఎటువంటి ఆందోళనాలేదు. మన దేశాన్ని వారు ఎన్నటికీ కాపాడలేరు. తమపై ఎవరి బలవంతంలేదని మన దేశ

ఈ దేశ ప్రజలను రక్షించే సామర్థ్యం మోదీ ప్రభుత్వానికిలేదు. వారి మాటలు, చేతలలోనే ప్రతిదీ స్పష్టమైంది. ప్రతిపక్ష పార్టీలలో బలహీనంగా ఉన్న వారిని తమ వైపు తిప్పుకోవాలనే వారి కోరిక మనకు ప్రస్ఫుటమౌతోంది. ఈ దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వారికి ఎన్నటికీ ఎటువంటి ఆందోళనాలేదు.



విదేశాంగ మంత్రి, రక్షణ మంత్రి కూడా చెపుతున్నారు. అయితే, ట్రంప్ పదేపదే చెపుతున్నా ఎందుకు ఖండించడంలేదో వారికే తెలియాలి. మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నోరు తెరిచి సరైన సమాధానం ఎందుకు ఇవ్వడంలేదో కమలం పార్టీ నేతలు చెప్పాలి. మోదీ మౌనంగా ఉండిపోయారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలను ఖండిస్తూ ఇంత వరకూ ఏమీ చెప్పలేదు. ఈ ప్రభుత్వం ఎవరికి భయపడుతోందీ, అందుకు కారణమేమిటి?. మోదీ ప్రభుత్వం మన పరిపాలనను అమెరికా పాలకులకు బానిసత్వంగా మార్చిందని చెప్పడానికి నేను ఎంతో విచారిస్తున్నాను.

పాకిస్తాన్‌లోని కొన్ని ఉగ్రవాద శిబిరాలపై దాడికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తినప్పుడు, మోదీ ప్రభుత్వం అటువంటి ప్రతిపక్ష పార్టీలపై తీవ్రదాడి చేస్తోంది. ఆ పార్టీల దేశభక్తిపై తీవ్రమైన సందేహాన్ని లేవనెత్తుతూ ప్రజలను తప్పుదోవపట్టించేందుకు ప్రయత్నిస్తోంది. తమకు ఇబ్బందికరంగా ఉండే ప్రశ్నలను ఎదుర్కొనేందుకు కాషాయపార్టీకి చెందిన వారు సహజంగానే ఇష్టపడరు. ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి బదులుగా పాకిస్థాన్ మద్దతుదారులుగా వారిపై ముద్రవేస్తున్నారు. ఇది అత్యంత విచారకరం. ప్రతిపక్షాల నోరు మూయించే ప్రయత్నంచేసి ఘోరంగా విఫలమయ్యారు. నేడు అధికారంలో ఉన్న వారు వలస పాలకులకు మద్దతు ఇస్తున్నారు.

వలసవాదానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ద్రవిడ పార్టీలు మాత్రమే పోరాడుతున్నాయి. వీరంతా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని అసమాన త్యాగాలు చేశారు. వలసవాదం, వలస పాలనను వ్యతిరేకిస్తూ, దేశానికి స్వాతంత్ర్యం కోసం కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వాదులు పోరాడుతున్న సమయంలో సైతం వారు మన దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. ఇప్పుడు అలాంటి వ్యక్తులు దేశభక్తి గురించి మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉంది. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ గురించి వారు మాట్లాడుతున్నారు. ఇది హాస్యాస్పదంగా ఉంది. ఈ విధంగా మాట్లాడే నైతిక హక్కు వారికి ఏమాత్రంలేదు. స్వాతంత్ర్య పోరాటం సందర్భంగా పండిత్ నెహ్రూ తొమ్మిది సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. అంతర్జాతీయ వేదికపై భారతదేశాన్ని కీర్తి శిఖరాలకు చేర్చారు. కానీ, వారు దుర్మార్గపు ఉద్దేశంతో నెహ్రూ పరువుతీయడానికి, నిర్లక్ష్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది రాజకీయ ప్రతీకారం తప్ప మరొకటి కాదు. ఈ విషయాన్ని నేను దృఢంగా చెప్పదలుచుకున్నాను.

వారు దేశభక్తి గురించి మాట్లాడుతున్నారు. కానీ భారతదేశంపై చైనా దురాక్రమణ జరిపినప్పుడు, చైనా కమ్యూనిస్టు దేశమైనప్పటికీ, భారత కమ్యూనిస్టు పార్టీ చైనా చర్యను ఖండించిన విషయం విస్మరించలేనిది. భారత కమ్యూనిస్టు పార్టీ దేశభక్తి ఇదే. మీరు మాకు దేశభక్తిని బోధించే ప్రయత్నం చేయకండి.

(పహల్గాంపై టెర్రరిస్టుల దాడి, ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో జరిగిన చర్చలో జులై 29న లోక్‌సభలో కమ్యూనిస్టు పక్ష నాయకుడు సుబ్బరాయన్ చేసిన ప్రసంగం సంక్షిప్తంగా)

మనిషికి మనిషికి మధ్య

ఖాళీతనం. నెర్రలు వారిన బీడు భూముల హృదయాలు. పట్టింపులు లేని బతుకులు. పలకరింపులు లేని జీవితాలు. "నేను క్షేమం. మీరంతా క్షేమమని తలుస్తాను" ఆనాటి ఉత్తరాల వెక్కిరింత. వాట్సాప్‌ల హాయ్‌లు... ఇదీ వీలు కాకుంటే థమ్స్ అప్ వేలి గురుతులు. ప్రపంచమొక పద్మవ్యూహం పాత మాట. ప్రపంచమంతా అరచేతిలో ఇమిడిన పెద్ద భూతం కొత్త మాట. ఎలాగైనా గెలవాలి. ఎలాగైనా నిలవాలి. ఎలాగైనా సాధించాలి. ఇదొక్కటే ఇప్పుడు కళ్ల ముందు కదలాడే నిత్య సత్యం. గెలవడం కోసం తొక్కేయాలి. నిలవడం కోసం నలిపేయాలి. సాధించడం కోసం సంపాదించాలి. ఏ రంగమైనా అవసరం లేదు వీరంగం ఆడడమే అసలు సిసలు రహస్యం. నేరుగా యుద్ధం చేయడం నేటి ఆధునిక యుగంలో పనికిరాని విద్య. వెన్నుపోటు అందరికీ ఇష్టమైన అద్భుత మాట. రాజకీయమో, కుటుంబ బంధమో, ఆర్థిక సంబంధమో, సాహిత్యమో... వెన్నుపోటు నేడొక భగవద్గీత. తొక్కుకుంటూ పైకి రావడం ఒక్కటే నేడు విరాజిల్లుతున్న వాస్తవం. నాకు తెలియదు అంటారు. నేను స్వచ్ఛమంటారు. నేను ఏ మలినమూలేని స్ఫటికం అంటారు.

అలా అన్నవారి మాటలకు అర్థం వెతకాల్సిన పనిలేదు. దానికి పరమార్థమే తస్మాత్ జాగ్రత్త శ్లోకం. ఇది తెలియని వాళ్లకి మిగిలేది నిత్య శోకం. నీ పక్కనే కూర్చుని ముఖానికి చేతుల్ని అడ్డం పెట్టుకుని ఏడుస్తున్నారంటే నిన్ను ఏడిపించడానికి సిద్ధమవుతున్నారమాట. నిన్ను

చక్రవాకం - ముక్కాముల చక్రధర్

చిత్రవథ చేసేందుకు ముసుగేసిన ముఖంతో యోచిస్తున్నారన్నమాట. ఎవరి కన్నీళ్లు అయినా నీకు విలువైనవి. నీ కన్నీళ్లు మాత్రం వాళ్లకి దారి చూపేవి. మనిషికి మనిషికి మధ్య ఏమీ లేని డొల్లతనం నీకు కనపడదు. కనపడనివ్వరు. నవ్వు ముఖాలకు పౌడర్లు, చర్మ సౌందర్యాలు పూసుకుని ఏడుపు ముఖాలను ప్రదర్శనకు పెడతారు. ఏ ప్రదర్శన అయినా అనుమానించా ల్సిన స్థితి నీకు గుర్తు రాదు. అసలు అలాంటి స్థితి ఉందనే స్పృహ నీకు కలుగకుండా చేయడమే ఆధునిక హంతకుల అసలు రహస్యం.

ఆధునిక యుగంలో హత్య చేసేందుకు మారణాయుధాలు అవసరం లేదు. మనసులో గూడు కట్టుకున్న ఈర్ష చాలు. ఇదీ నీకు కనపడదు. భుజం మీద చేతులు మెడ వరకూ వచ్చి దాన్ని ఒక్క నొక్కు నొక్కే వరకూ నువ్వు మరణిస్తావన్న ధ్యాస రాదు. రానివ్వరు. వారి జాగ్రత్తలు వారివి. నీటిలో మునిగి పోయిన వారిని రక్షిస్తున్నామని ప్రపంచానికి చూపిస్తూ ఒడ్డుకు వచ్చిన తర్వాత నీ నోట్లో నీరు కక్కిస్తున్నట్లుగా నటిస్తూ నీకు మరణాన్ని ప్రసాదించడమే వారి ఉత్కృష్ట చర్య. నీటిలో పడడమే తెలియని వాళ్లకి నోట్లో నీరు కక్కించడం మరణ శాసనమని ఎలా తెలుస్తుంది. ఇదీ ఆధునిక హత్యలో దాగున్న వాస్తవ ఆయుధం. ఇలాంటి పువ్వులు పుట్టగానే పరిమళించవు. అగ్నిపూలను కడుపులో దాచుకుని ఆవిర్లను కక్కుతూ మేఘాల సృష్టికర్తలం మేమే అంటూ ప్రపంచానికి నమ్మబలుకు తాయి. మేఘమన్నా, వర్షపు చినుకన్నా... నేల తడవడమన్నా... ఆకాశం ఎర్రగా మారడమన్నా...చెట్లు నవ్వడమన్నా.. నీకు చచ్చేంత ఇష్టమని వారికి నీ కంటే ముందే తెలుసు. నీకు తెలిసేలోగా పథక రచన ప్రారంభిస్తారు. పగడ్బందీగా అమలు చేస్తున్నారని వాళ్లొక్కరికే తెలుసు.
నువ్వు రెండు అరచేతులు చాచి ఆకాశంకేసి చూస్తూ ఆ వర్షంలో కేరింతలు కొడతావని వారికి ముందే తెలుసు. సరిగ్గా అప్పుడే ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉన్న నీపై ఆ వర్షమే ఉధృతమై, ఉపద్రవమై, ఉన్మాదమై, ఊపిరి సలపనీయకుండా నిన్ను దారి తప్పిస్తుంది. వర్షం వెలిశాక ఏ దిక్కుకి చూసినా నీకు కనిపించేవి తెగిపడిన నీ ఖండిత అవయవాలే. నీ శరీర శకలాల ముందు దీనంగా కూర్చుంటావు. నీ శరీర భాగాలను నువ్వు గుర్తించలేవు.

మనిషికి మనిషికి మధ్య నలిగిన జీవితపు ఖండితాంగాలు నీకు కానరావు. నువ్వు విలపించాలనుకుంటావా. నీ కళ్లు నీకు కనిపించవు. చేతుల్ని ఆసరాగా చేసుకుని నేలంతా వెతుకులాటలో పడతావు. ఓ చెయ్యి నిన్ను తాకుతుంది. అది నీదే అనే భ్రమలో ఉంటావు. ఆ చేతితో ఇతర అంగాల వెదుకులాటలో పడదామనుకుంటావు. కానీ, చిత్రంగా ఆ చేయి అచ్చం నీలాగే తన అవయవాలను వెతుక్కుంటూ... తన శరీరం దొరికిందని ఆనందిస్తుంది. ఆ శరీరానికి ఆ కాలు తనది కాదని తెలిసే లోగా నిన్ను ప్రేమగా చంపేసిన వారి చిరునవ్వు నీకు, వాళ్లకి కూడా దొరుకుతుంది. సమయం మించిపోయింది అంటాయి మీ ఇద్దరి తెగిపడిన కంఠనాళాలు. దూరంగా రైలు పట్టాల దగ్గరో, ఫ్లైవర్ చివరో, కాలువ వొడ్డు నుంచే "నేనిక్కడ ఉన్నా. నా శరీరం వచ్చి వారి చెవిని తీసుకొండి" అంటూ కర్ణభేరి పిలుస్తుంది. నీ భుజాలు వారిని మోస్తుంటాయని నీకు తెలియదు. నిజానికి నువ్వు పుట్టగానే నీ భుజాలు మరొకరిని మోయడానికి ఉన్నాయని నీకు తెలీదు. మనిషికి మనిషికి మధ్య ఆధిపత్యాల, కుళ్లు కుతంత్రాల, అభిజాత్యాల, మోసాల, మోహరింపుల, మనో వైకల్యాలుంటాయని తెగిపడే వరకూ ఏ శరీరాలకు తెలీదు. నిన్ను హత్య చేయాలనుకున్న వాళ్లకో సమూహం ఉంటుంది. అక్కడందరూ మన శరీరాల ముందు నిలబడి భేతాళ నృత్యం చేస్తారు. ఆనందపరవశంలో మునిగి తేలుతారు. నువ్వు మాత్రమే ఖండితాంగాలతో వారి వైపు ప్రేమగా చూస్తూంటావు. అంతకు మునుపే నీ రక్తం నీళ్ల రంగులోకి మార్చే శక్తి వాళ్లకి ఉంటుందని నీకు తెలియదు. మనిషికి మనిషికి మధ్య రక్తం ఏరులై పారుతోందని మర్నాటి ఉదయమే పత్రికల్లో పతాక శీర్షికవుతుంది. నేను, నువ్వు వారి చేతిలో మరణిస్తున్నాం కదా... కాసేపు నిద్రపోదాం. కలలోనూ ఆ మనుషులు రాకూడదని దైవాన్ని వేడుకుందాం.

సీనియర్ జర్నలిస్టు, సెల్: 9120 19929

కౌలురైతు కాడి కిందపెడితే సాగు కష్టమే

కేవీవీ ప్రసాద్
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి

రాష్ట్రంలో 80 శాతం పైగా భూమిని సాగుచేస్తున్న కౌలురైతులు కాడి క్రిందపెడితే సాగు జరగటం కష్టం. 2016లో నియమించిన ప్రొఫెసర్ రాధాకృష్ణ కమిషన్ నివేదిక ప్రకారం, రాష్ట్రంలో కౌలు వ్యవసాయం సాగిస్తున్నవారు 24-25 లక్షలమంది. వీరిలో పూర్తిగా భూమిలేనివారు 6.29 లక్షలమంది. కొంతమేర సొంతభూమి సాగుచేస్తూ మరికొంత భూమి కౌలుకు తీసుకుని సేద్యం చేసేవారు 18.03 లక్షలమంది ఉన్నారు. అయితే రైతు సంఘాలు, వ్యవసాయరంగ నిపుణులు మాత్రం రాష్ట్రంలో 32 లక్షల మందిపైగానే కౌలు వ్యవసాయం చేస్తున్నట్లు అభిప్రాయపడుతున్నారు. 2011లో కౌలు రైతుల ప్రయోజనార్థం "భూ అధీకృత సాగుదారుల లైసెన్స్‌డ్" చట్టాన్ని తీసుకు వచ్చారు. కానీ ఈ చట్టం అసంఖ్యాకంగా వున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు, పేద కౌలురైతులకు ప్రయోజనం చేకూరలేదు. పాలక ప్రభుత్వాలు వీరిని ఓటుబ్యాంక్‌గా భావిస్తున్నారే తప్ప వారి రక్షణ కోసం నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేదు.

లక్షలాదిగా ఉన్న కౌలు రైతులను గుర్తించి కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేసి, బ్యాంకర్ల ద్వారా కౌలు సేద్యం సాగించేందుకు అవసరమైన హామీ లేని రుణాలు అందజేయడం, అన్నదాత సుఖీభవ పథకం, ఇన్ సబ్సిడీ, బీమా నష్ట పరిహారాలు, వ్యవసాయ పనిముట్లు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలన్నది లక్ష్యం. కౌలుచట్టం రూపొందించి దశాబ్దన్నర జరుగుతున్నా నిరుపేద వర్గాలకు చెందిన కౌలురైతుల సాగు సేద్యం నిరంతరం కష్టనష్టాల మధ్య సాగుతుందనటంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు. సొంత భూమి కలిగిన రైతులే వ్యవసాయం గిట్టుబాటుకాక, నష్టాలతో సాగు కొనసాగించలేక "ఆదాయం ఒకటి-వ్యయం రెండు చందం"గా జీవితం గడుపుతున్నారు. సాగు ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నా రైతాంగం పండించే పంటకు మద్దతు ధరలు లభించడం లేదు. రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యంగా మారాయి. దేశవ్యాపితంగా ప్రతిరోజూ సగటున 31 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఏ ప్రభుత్వం అధికారం వెలగబెడుతున్నా "సమగ్ర వ్యవసాయ విధానం"పై దృష్టి సారించడం లేదు. రైతుల ఆదాయం పెరగకపోగా నష్టాల సేద్యంతో కౌలురైతు విలవిలలాడుతున్నాడు.

దేశవ్యాపితంగా ప్రతిరైతు సగటున రు.74,000 రుణభారం మోస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ 93 శాతం రైతు కుటుంబాలపై సగటున 2.45 లక్షల రుణభారం ఉంది. ఆరుగాలం శ్రమిస్తున్నా ఆదాయాలు పెరగక అప్పులు తీర్చేదారి లేక రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలనలో ఇప్పటి వరకు 1.20 లక్షల మంది సాగుదారులు కడతేరారు. వ్యవసాయరంగ నిపుణుల అంచనా ప్రకారం సాగుసేద్యం గిట్టుబాటు కాక ప్రతిరోజూ సుమారు 2,000 మంది రైతులు వ్యవసాయాన్ని వదిలి పట్టణాలకు తరలిపోతున్నారు. ఫలితంగా వ్యవసాయానికి కౌలు రైతులే దిక్కవుతున్నారు. అయితే కౌలు రైతులను ఆదుకునేందుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంక్ రుణాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, కనీసం సాగుకు వినియోగించే ఎద్దులు, ఎడ్లబండ్లు, నాగలి, గొర్రులాంటి పనిముట్లు సైతం పేదవర్గాలకు చెందిన కౌలు రైతులకు అందించి సాగును ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపడం అన్యాయం. దేశంలో సుమారు 50శాతం పైగా కౌలురైతులు సాగు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం కౌలుదారుల చట్టం రూపొందించడంలో ఏమాత్రం చొరవ చూపకపోవడం అన్యాయం.

మన రాష్ట్రం 2011లో చట్టం చేసినా కౌలు రైతుల సంక్షేమం పాలకులకు పట్టడంలేదు. కౌలు రైతులందరికీ గుర్తింపుకార్డులు ఇచ్చింది లేదు. గత వైసీపీ ప్రభుత్వం 2011 కౌలు చట్టాన్ని రద్దు చేసి "ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల చట్టాన్ని" తెచ్చింది. భూ యాజమాని లిఖితపూర్వకంగా కౌలు ఒప్పందం పత్రం రాసి ఇస్తేనే గుర్తింపు కార్డులు జారీ చేయాలని నిబంధనలు పొందుపర్చింది. దీంతో కౌలు రైతుల పరిస్థితి "పెనంమీద నుంచి పొయ్యిలో" పడిన చందంగా మారింది. లోభూయిష్ట చట్టాన్ని మార్చాలని, భూ యజమాని అంగీకారం తప్పనిసరి అన్న సవరణ మార్చాలన్న డిమాండ్ కౌలు రైతుల్లో పెరిగింది. కౌలు రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించి ఆందోళన తీవ్రతరం చేశాయి. కౌలు రైతులను గుర్తించి సీసీఆర్సి కార్డుల జారీని సులభతరం చేస్తామంటూ టీడీపీ ఎన్నికల ప్రణాళికలో చేర్చింది. జనసేన అధినేత ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను ఎన్నికలకు ముందు పరామర్శించి సాయం అందించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా కౌలు రైతుల చట్టంలో మార్పు చేసింది లేదు. వైసీపీ తెచ్చిన చట్టమే అమలు జరుగుతున్నది. భూ యజమానుల దయాదాక్షిణ్యాలపైనే కార్డుల జారీ ప్రక్రియ నడుస్తోంది. కూటమి నేతలు, ప్రభుత్వ రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు కౌలు రైతుల రక్షణ సంక్షేమం కోసం కొత్తగా సమగ్ర చట్టం తెస్తామంటూ సమావేశాలు, సమీక్షలతో కాలయాపన చేస్తున్నారు. మూడు పంట కాలాలు ముగిసినా కౌలురైతుల సమగ్ర చట్టం రూపుదిద్దుకోలేదు. కార్డుల జారీ నత్తనడకన సాగుతోంది.

గతంలో ఏప్రిల్, మే మాసాల్లో కౌలు గుర్తింపు కార్డులకోసం గ్రామ సభలద్వారా కార్డుదారుల గుర్తింపు ప్రక్రియ, కార్డుల జారీ జరిగేది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జూన్ రెండవ వారంలో కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటి వరకు 5.50 లక్షల మందికి మాత్రమే కౌలు గుర్తింపు కార్డులు జారీ అయ్యాయి. అనేక జిల్లాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల్లో సగంమందికి కూడా కార్డులు అందజేయలేదు. తూర్పుగోదావరి జిల్లాలో 1.10 లక్షల మందికి కార్డుల జారీ లక్ష్యం కాగా, ఇచ్చింది 46,595 మందికి మాత్రమే కార్డులు అందాయి. ఎన్టీఆర్ జిల్లాలో 56 వేల మందికి కార్డులు ఇవ్వాల్సి వుండగా ఇచ్చింది 37,739, వైఎస్ఆర్ కడప జిల్లాలో 11 వేల మందికి జారీ కావాలి. ప్రస్తుతానికి ఇచ్చింది 2,919 మాత్రమే. ఇలా అనంతపురం, చిత్తూరు, శ్రీ సత్యసాయి, విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కార్డుల జారీ ముందుకు సాగటంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

2025 ఆగస్టు 2న రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంగా ప్రకటించిన "అన్నదాత సుఖీభవ" సాగుదారుల ఖాతాల్లో జమ చేస్తున్నది. అయితే చట్టంలో మార్పులు జరిగి కార్డుల జారీ ప్రక్రియ పూర్తయిన తరువాత కౌలు రైతులకు పథకం వర్తింపచేస్తామంటున్నది ప్రభుత్వం. కార్డుల జారీ ప్రక్రియ జాప్యం జరిగేకొద్దీ వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు పథక ప్రయోజనందక్కే అవకాశంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కౌలు రైతుల రక్షణకు సమగ్రచట్టం తెచ్చేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. కౌలు రైతులు నిరాశ చెంది వ్యవసాయాన్ని వీడకముందే ప్రభుత్వాలు జాగరూకతతో వ్యవహరించాలి. కౌలు రైతులకు సమగ్రచట్టం తేవాలి.

మోహన్ భగవత్‌ను అరెస్టు చేయమన్నారు

మాలెగావ్ కేసు విచారణాధికారి వెల్లడి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో నిందితులందరినీ ముంబైలోని ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసు విచారణ బృందంలో ఉన్న మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ దీనిపై స్పందిస్తూ కీలక ఆరోపణలు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్‌ను అరెస్టు చేయాలని అప్పట్లో తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. శుక్రవారం ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించి కొంతమంది వ్యక్తులను అరెస్టు చేయాలని తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. వారిలో రామ్ కల్సంగ్రా, సందీప్ దాంగే, దిలీప్ పాటిదార్‌తో పాటు మోహన్ భగవత్ కూడా ఉన్నారన్నారు. అలాంటి ప్రభావం చూపే వ్యక్తిని అరెస్టు చేయడం అంటే అది తన శక్తికి మించిందన్నారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న పరమ్‌బీర్ సింగ్‌తో పాటు మరికొంతమంది ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను తనకు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వారి సూచనల ప్రకారం... తనకు సాయం చేసేందుకు రాష్ట్రం నుంచి దాదాపు పది మంది సిబ్బందిని సమకూర్చారన్నారు. నిధులు సమకూర్చడంతో పాటు అధికారికంగా రివాల్వర్ కూడా జారీ చేశారని ముజావ్ తెలిపారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించేందుకు నిరాకరించడంతో తనపై తప్పుడు కేసు పెట్టారన్నారు. ఆ తర్వాత వాటన్నింటిలో తాను నిర్దోషిగా బయటకు వచ్చినట్లు వెల్లడించారు.

కేంద్రంపై సుప్రీంకోర్టు అసంతృప్తి

న్యూఢిల్లీ: బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. బెట్టింగ్ యాప్‌ల నిషేధంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది. గత విచారణలో కేంద్రప్రభుత్వానికి నోటీసులు ఇచ్చినా కౌంటర్ దాఖలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్రప్రభుత్వ వైఖరి తెలుసుకునేందుకు మరొక అవకాశం ఇస్తున్నామని హెచ్చరించింది. బెట్టింగ్ యాప్‌ల నిషేధంపై కేంద్రం వైఖరి ఏమిటి? దీనిపై ఎలాంటి యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తుందో చూద్దామని సుప్రీంకోర్టు మందలించింది. తదుపరి విచారణలో మధ్యంతర ఆదేశాలు ఇస్తామని స్పష్టం చేసింది. సినిమా హీరోలు, సెలబ్రిటీలు బెట్టింగ్ యాప్‌లకు మద్దతుగా నిలవకుండా నిషేధం విధించేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కేఏ పాల్ కోరారు. బెట్టింగ్ యాప్‌లతో ఎంతోమంది యువకులు నష్టపోతున్నారని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

ఎఫ్-35 యుద్ధవిమానాలపై చర్చ జరగలేదు: కేంద్రం

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన అత్యాధునిక, 5వ తరం యుద్ధవిమానాలు ఎఫ్-35 విమానాల కొనుగోలుపై అమెరికాతో ఎలాంటి చర్చలు జరగలేదని కేంద్రం లోక్‌సభకు తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్రమోదీ వాషింగ్టన్ పర్యటన తర్వాత భారత్ ఈ విమానాలు కొనుగోలు చేయాలని అమెరికా ప్రతిపాదించింది. కాంగ్రెస్ ఎంపీ బల్వంత్ బస్వంత్ వాంఖడే లేవనెత్తిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయమంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 'ఈ అంశంపై ఇంకా అధికారిక చర్చలు జరగలేదు' అని వెల్లడించారు. ఈ ఏడాది ప్రారంభంలో ఉన్నత స్థాయి ద్వైపాక్షిక సమావేశంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన తర్వాత ఎఫ్-35 విమానాల అమ్మకం కోసం అమెరికా భారతదేశానికి ఏదైనా అధికారిక ప్రతిపాదనను పొడిగించిందా అని కాంగ్రెస్ ఎంపీ ప్రశ్నించిన నేపథ్యంలో కేంద్రం ఈ విధంగా స్పందించింది. భారత్ ఎగుమతులపై 25 శాతం సుంకాలు పెంచుతున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో రెండు దేశాల మధ్య సంబంధాల్లో ఒడిదుడుకులు ఎదురయ్యాయి.

జీతం రూ.15 వేలు... ఆస్తులు రూ.30 కోట్లు

మాజీ క్లర్క్ బాగోతం

బెంగళూరు: కర్నాటకలోని కొప్పల్ జిల్లాలో ఓ ప్రభుత్వ కార్యాలయంలో గుమాస్తాగా పనిచేసిన వ్యక్తిపై లోకాయుక్త దాడులు నిర్వహించింది. భారీగా అక్రమాస్తులు బయటపడ్డాయి. లోకాయుక్త అధికారుల ప్రకారం... కలకప్ప నిడగుండి, కొప్పల్ జిల్లాలోని కర్నాటక గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థలో గుమాస్తాగా పనిచేశారు. రూ.15 వేల జీతం తీసుకునే అతడు... భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. మాజీ కేఆర్ఐడీఎల్ ఇంజినీర్ చిన్చోల్కర్‌తో కలిసి నిడగుండి నకిలీ పత్రాలు, బిల్లులు సృష్టించి రూ.75 కోట్లకు పైగా దుర్వినియోగం చేశారని తెలిసింది. దీంతో లోకాయుక్తా దాడులు నిర్వహించింది. దాదాపు రూ.30 కోట్లకు పైగా విలువైన ఆస్తులు బయటపడ్డాయి. దాదాపు 24 ఇళ్లు, 40 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆస్తులు నిడగుండి, ఆతడి భార్య, సోదరుడి పేర్లతో ఉన్నట్లు తేలింది. అంతేకాదు, ఆయన నివాసం నుంచి 350 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.5 కేజీల వెండి ఆభరణాలు, నాలుగు వాహనాలను (రెండు కార్లు, రెండు బైక్‌లు) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిడగుండిని అదుపులోకి తీసుకున్న లోకాయుక్త అధికారులు విచారణ చేస్తున్నారు.

ఆగని నిరసనలు-సాగని సభలు

- ఎస్ఐఆర్‌పై చర్చకు ప్రతిపక్షాల డిమాండ్
- లోక్‌సభ రసాభాస - రాజ్యసభ వాషౌట్
- అడ్డుకున్న మార్షల్స్: ఎంపీల ఆగ్రహం
- పార్లమెంటు సోమవారానికి వాయిదా

న్యూఢిల్లీ: పార్లమెంటు ఉభయ సభలు శుక్రవారం ఎటువంటి చర్చ లేకుండానే సోమవారానికి వాయిదా పడ్డాయి. సమావేశాలు ప్రారంభమైన రోజు నుంచి ఎస్ఐఆర్‌పై చర్చ కోసం ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇదే డిమాండ్‌తో 10వ రోజు లోక్‌సభ రసాభాస కాగా రాజ్యసభ వాషౌట్ అయింది. ఎస్ఐఆర్‌పై చర్చ కోసం పట్టుపట్టిన ప్రతిపక్ష ఎంపీలు రాజ్యసభలో నిరసన క్రమంలో వెల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను పారామిలటరీ నియంత్రణలోకి తీసుకుందని ఆరోపించారు. అటు లోక్‌సభలోనూ ప్రతిపక్ష సభ్యుల నిరసనలపై స్పీకర్ ఓం బిర్లా అసహనం వ్యక్తంచేశారు. సభను జరగనివ్వాలని కోరారు కానీ ప్రతిపక్ష సభ్యులు మాత్రం ఎస్ఐఆర్‌పై చర్చకు అనుమతివ్వాలని పట్టుపట్టారు. దీంతో డీఎంకే ఎంపీ టీఆర్ బాలు వంటి కొందరి పేర్లు ప్రస్తావిస్తూ ఓంబిర్లా ఆగ్రహం వ్యక్తంచేశారు. నిరసనలతో సభలో గందరగోళం నెలకొనడంతో ప్రశ్నోత్తరాలు జరగలేదు. ప్రారంభమైన మూడు నిమిషాల్లో సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. లోక్‌సభ తిరిగి సమావేశమైనప్పుడు ప్రతిపక్షాల నినాదాలు కొనసాగాయి. గోవా అసెంబ్లీలో ఎస్టీలకు సీట్ల కల్పనకు సంబంధించిన బిల్లుపై చర్చ నిర్వహించేందుకు సభాపతి విఫల ప్రయత్నం చేశారు. అనంతరం సభను సోమవారానికి వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ ఎస్ఐఆర్ వ్యతిరేక ఆందోళన కొనసాగింది. ఎస్ఐఆర్ రద్దుకు విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లిన ఎంపీలను మార్షల్స్ అడ్డుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి ప్రారంభమైనప్పుడు టీఎంసీ, డీఎంకే ఎంపీలు డెరెక్ ఓ బ్రెయిన్, నదీముల్ హక్, సాగరిక, తిరుచీ శివ, సంజయ్ సింగ్ (ఆప్) వెల్‌లోకి వెళ్లేందుకు యత్నించగా, భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అయినప్పటికీ కొందరు వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. భద్రతా సిబ్బంది తమను అడ్డుకోవడంపై నిరసన వ్యక్తం చేశారు. రాజ్యసభలో జీరో అవర్, ప్రశ్నోత్తరాలు జరగలేదు. మధ్యాహ్నం సభాపతి స్థానంలో ఘనశ్యామ్ తివారీ ఉన్నారు. ఎవరి స్థానాల్లో వారు కూర్చోవాలని నిరసన తెలిపే సభ్యులను కోరారు. ప్రశ్నోత్తరతాలు నిర్వహించే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ ఎంపీ వివేక్ తనఖాను ప్రశ్న అడగమన్నారు. కానీ సభ గందరగోళంగా ఉందని, మాట్లాడలేనని వివేక్ అన్నారు. సభ్యుల ఆందోళన కొనసాగించడంతో రాజ్యసభను తివారీ సోమవారం వరకు వాయిదా వేశారు. ఉదయం సభను డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నిర్వహించారు. ఎస్ఐఆర్‌పై చర్చ కోరుతూ 267 నిబంధన కింద 30 వాయిదా తీర్మానాలు ఆయనకు అందాయి. ఇతర రాష్ట్రాల్లో బెంగాలీలపై వివక్ష, భారత దిగుమతులపై అమెరికా 25శాతం సుంకం విధించడం, ఐటీ రంగంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగుల తొలగింపు తదితర అంశాలనూ ఎంపీలు ప్రస్తావించారు. సభాపతి మార్గదర్శకాలకు అనుగుణంగా లేనందున అన్ని నోటీసులు తిరస్కరిస్తున్నట్లు హరివంశ్ వెల్లడించారు. సభాపతి నిర్ణయాన్ని విపక్ష సభ్యులు తీవ్రంగా ఖండించారు.తమ స్థానాల్లో నుంచి లేచి నిరసన తెలిపారు. అనంతరం ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్‌ను సభాపతి మాట్లాడమనగా, ఎస్ఐఆర్‌పై చర్చకు అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు. హరివంశ్ స్పందిస్తూ విచారణలో ఉన్న అంశం కాబట్టి చర్చకు అనుమతి ఇవ్వలేనని చెప్పారు. ప్రతిపక్ష సభ్యులు శాంతించాలని కోరారు. ఆప్ నేత అశోక్ కుమార్‌ను మాట్లాడమన్నారు. కానీ ప్రతిపక్షాల నిరసనలతో సభ ముందుకు సాగలేదు. ప్రారంభమైన 11 నిమిషాల్లో సభను హరివంశ్ వాయిదా వేశారు. శుక్రవారం ఉభయ సభల్లో ఎలాంటి చర్చ జరగలేదు. అయితే లోక్‌సభలో గోవాలో ఎస్టీలకు ప్రాతినిధ్యం కల్పించే బిల్లు, పోర్టుల బిల్లు, మర్చంట్ షిప్పింగ్ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టింది.

షాక్‌కు గురయ్యా: ఖర్గే



న్యూఢిల్లీ: ప్రతిపక్ష సభ్యులు ప్రజా సమస్యలపై గొంతెత్తకుండా అడ్డుకోవడం ఏమిటని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. రాజ్యసభ వెల్‌లో శుక్రవారం భద్రతా సిబ్బంది ఉండటాన్ని తీవ్రంగా ఖండించారు. ఇదే అంశమై రాజ్యసభ డిప్యూటీ స్పీకర్ హరివంశ్‌కు లేఖ రాశారు. సభ్యులు తమ ప్రజాస్వామిక హక్కులు వినియోగించే సమయంలో సభలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది పరుగులు పెట్టడం చూసి షాక్‌కు గురైనట్లు తన లేఖలో ఖర్గే పేర్కొన్నారు. ప్రతిపక్షాల తరపున ఈ విషయాన్ని సభాపతి దృష్టికి తెచ్చినట్లు వెల్లడించారు. 'నిన్న, నేడు సభలో ఇదే పరిస్థితి. పార్లమెంటు ఈ స్థాయికి దిగజారిందా? ఇది తీవ్ర అభ్యంతకరం. దీనిని ముక్తకంఠంతో ఖండిస్తున్నాం' అని ఖర్గే పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రజా సమస్యలను సభ్యులు లేవనెత్తే సమయంలో వెల్‌లోకి సీఐఎస్ఎఫ్ సిబ్బంది రారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఖర్గే లేఖను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. రాజ్యసభలో అనూహ్య పరిణామంపై హరివంశ్‌కు ఖర్గే లేఖ రాశారన్నారు. 'ఆకస్మికంగా రాజ్యసభ చైర్మన్ తప్పుకున్న తర్వాత చాంబర్ ఆఫ్ కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్‌ను సీఐఎస్ఎఫ్ సిబ్బంది నియంత్రణలోకి తీసుకోవడం చూశాం' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

కేరళ నన్ల అరెస్టు వివాదాస్పదం

న్యూఢిల్లీ: చత్తీస్‌గఢ్‌లో కేరళ నన్ల అరెస్టు వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దుర్గ్ రైల్వేస్టేషన్‌లో జులై 25న కేరళకు చెందిన ఇద్దరు నన్స్- సిస్టర్ ప్రీతి మేరీ, ఇంకా సిస్టర్ వందన ఫ్రాన్సిస్‌ను చత్తీస్‌గడ్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మానవ అక్రమ రవాణా, బలవంతపు మతమార్పిడి ఆరోపణలపై ఈ అరెస్టులు జరిగాయి. అయితే, ఈ ఘటన ఇప్పుడు దేశ రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశమైంది. పార్లమెంటు వెలుపల సైతం కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ సహా పలువురు రాజకీయ నేతలు ప్లకార్డులు చేతబట్టి నిరసనలకు దిగారు. అటు కేరళవ్యాప్తంగా క్రైస్తవ వర్గాలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నాయి. చత్తీస్‌గఢ్‌లో అరెస్టు చేసిన ఇద్దరు కేరళ నన్స్‌ను విడుదల చేసేలా జోక్యం చేసుకోవాలని కోరుతూ డీఎంకే ఎంపీ విల్సన్... కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరణ్ రిజిజుకు లేఖ రాశారు. కాగా, చత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వేస్టేషన్ సమీపంలో ముగ్గురు గిరిజన యువతులతో కలిసి ప్రయాణిస్తున్న నన్స్‌ను బజరంగ్ దళ్ సభ్యులు అడ్డుకున్నారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, మతమార్పిడి చేస్తున్నారని నన్స్‌పై బజరంగ్ దళ్ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీరిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఆ యువతులు స్వచ్ఛందంగా ఉద్యోగ అవకాశాల కోసం కేరళ వెళుతున్నామని చెప్పారు. తమ దగ్గర చెల్లుబాటు అయ్యే పత్రాలు కూడా ఉన్నాయని నన్స్ వాదించారు. అయినప్పటికీ, ఈ ఆరోపణల ఆధారంగా నన్స్‌ను అరెస్టు చేసి దుర్గ్ సెంట్రల్ జైలులో ఉంచారు.

కేరళ నన్స్‌ను విడుదల చేయండి కేంద్రానికి డీఎంకే ఎంపీ లేఖ

చెన్నై: చత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్ట్ చేసిన ఇద్దరు కేరళ నన్‌ల విడుదలలో జోక్యం చేసుకోవాలని కోరుతూ డీఎంకే ఎంపీ పి.విల్సన్ కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిరణ్ రిజిజుకు శుక్రవారం లేఖ రాశారు. మానవ అక్రమ రవాణా, బలవంతపు మతమార్పిడి ఆరోపణలతో ఇద్దరు కేరళ నన్‌లను చత్తీస్‌గఢ్ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇద్దరు నన్స్ ప్రీతి మేరీ, వందన ఫ్రాన్సిస్‌ను బీజేపీ పాలిత చత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిరాధార ఆరోపణలతో ఏకపక్షంగా అరెస్ట్ చేశారని లేఖలో పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని, రాజ్యాంగ సమతుల్యతను పునరుద్ధరించేందుకు కేంద్ర మంత్రులు అత్యవసర చర్యలు తీసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగంలోని సంబంధిత సవరణను ప్రవేశపెట్టడం ద్వారా జాతీయ మైనారిటీల కమిషన్ (ఎన్‌సీఎం)కు రాజ్యాంగ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. మైనారిటీలపై దాడులను క్రిమినల్ చర్యగా పరిగణించి... మతపరంగా మైనారిటీలను రక్షించి, రాజ్యాంగం ప్రకారం వారి హక్కులు కాపాడేలా చూడాలని, జాతీయ మైనారిటీల కమిషన్ చట్టం, 1992ను సవరించాలని కోరారు. జాతీయ మైనారిటీల కమిషన్‌లో చైర్మన్ సహా ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని, గుర్తింపుపొందిన ఆరు మైనారిటీ వర్గాలకు ప్రాతినిథ్యం కల్పించాలని ఎంపీ విల్సన్ డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల జీతం పెంచే ప్రతిపాదన లేదు

కేంద్రం స్పష్టీకరణ

న్యూఢిల్లీ : పోషణ్ పథకం కింద పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల గౌరవ వేతనాన్ని పెంచే ప్రతిపాదన లేదని మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా, ఆ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికులు 'గౌరవ కార్మికులు' అని, వారు తమ స్థానిక సమాజాలలో పిల్లల సంరక్షణ, అభివృద్ధి కోసం స్వచ్ఛందంగా తమ సేవలను అందిస్తారని తెలిపారు. ఒక ప్రశ్నకు సమాధానంగా, 'ప్రస్తుతం అలాంటి ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదు' అని ఠాకూర్ అన్నారు. కాగా, వారికి గౌరవ వేతన చెల్లింపులతో పరిహారం చెల్లిస్తున్నారు. దీనిని చివరిగా అక్టోబరు 1న 2018న సవరించారు. ప్రస్తుతం, సాధారణ అంగన్‌వాడీ కేంద్రాలలో పని చేస్తున్న కార్యకర్తలు నెలకు రూ.4,500 అందుకుంటుండగా, మినీ-కేంద్రాలలో పని చేసేవారు రూ.3,500 అందుకుంటున్నారు. అంగన్‌వాడీ సహాయకులకు నెలకు రూ.2,250 చెల్లిస్తున్నారు. అదనంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.500, సహాయకులకు రూ.250 చొప్పున పని తీరు ఆధారిత ప్రోత్సాహకాలు ఇస్తున్నారు.

పహల్గాం తర్వాత 12 మంది ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: పహల్గాం దాడి తర్వాత భద్రతా బలగాలు ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను ముమ్మరం చేశాయి. వరుస ఆపరేషన్లలో ఉగ్రవాదులను మట్టుపెడుతున్నాయి. ఆ దాడి జరిగి 100 రోజులు కాగా... ఇప్పటివరకు 12 మంది ఉగ్రవాదులను భద్రతా బలగాలు హతమార్చాయి. వారిలో ఆరుగురు పాకిస్థానీ ఉగ్రవాదులు ఉన్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మిగిలిన ఆరుగురికి కూడా జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడులతో సంబంధం ఉందని పేర్కొన్నాయి. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి జరిగింది. దానికి భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో దీటుగా బదులిచ్చింది. అది మే7న ప్రారంభమైంది. ఉగ్రవాదులను జల్లెడ పట్టేందుకు పలు ఆపరేషన్లు నిర్వహించింది. వాటిలో మహాదేవ్ ఒకటి. ఆ ఆపరేషన్‌లోనే పహల్గాం ఘటన బాధ్యులు హతమయ్యారని కేంద్రం ప్రకటించింది. మరోవైపు జరిగిన శివశక్తి ఆపరేషన్‌లో మరో ఇద్దరు హతమయ్యారు. 'ఎన్ని ఆపరేషన్లు జరుగుతున్నాయో చెప్పడం కష్టం. జమ్మూకశ్మీర్‌లోని అన్ని యూనిట్లు ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నాయి' అని అధికార వర్గాలు మీడియాకు వెల్లడించాయి. మే 15న షోపియాన్‌లోని కెల్లర్ అడవుల్లో ముగ్గురు, నాదెర్ ప్రాంతంలో ఇంకో ముగ్గురు ఉగ్రవాదులను మట్టుపెట్టారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పహల్గాం కుట్రదారులను, ఆపరేషన్ మహాదేవ్ ద్వారా నాటి ఊచకోతలో పాల్గొన్న ముష్కరులను హతమార్చామని ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించిన సంగతి తెలిసిందే. కశ్మీర్‌లో 70 నుంచి 75 మంది చురుగ్గా ఉన్నారని, జమ్మూ, రాజౌరీ, పూంచ్‌లో 60 నుంచి 65 మంది ఉగ్రవాదుల కదలికలను గుర్తించినట్లు పేర్కొన్నాయి.

సంస్కృతం వ్యవహారిక భాషగా మారాలి

ఆర్ఎస్ఎస్



నాగపూర్ : సంస్కృతం అన్ని భారతీయ భాషలకు తల్లి అని, అది రోజువారీ మాధ్యమంగా మారాలని, దేశంలోని ప్రతి ఇంటికి చేరాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధ్యక్షుడు మోహన్ భగవత్ శుక్రవారం అన్నారు. సంస్కృత పరిరక్షణ, ప్రచారం కోసం ఆయన నినాదాలు చేశారు. దీనిని 'మన భావోద్వేగాలను అభివృద్ధి చేసే భాష' అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ ప్రాచీన భాషను తెలుసుకోవాలన్నారు. నాగ్‌పూర్‌లోని కవి కులగురు కాళిదాస్ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఒక భవనం ప్రారంభోత్సవంలో భగవత్ మాట్లాడుతూ సంస్కృతాన్ని అర్థం చేసుకోవడానికి, భాషలో సంభాషించగలగడానికి మధ్య వ్యత్యాసం ఉందని తెలిపారు. సంస్కృత విశ్వవిద్యాలయానికి ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తోందని, కానీ ప్రజల మద్దతు కూడా అవసరమని ఆయన అన్నారు. సంస్కృతం భారతదేశంలోని అన్ని భాషలకు తల్లి అని, అది మరింత అభివృద్ధి చెందాలంటే, ప్రజలు తమ దైనందిన జీవితంలో దీనిని ఉపయోగించాలని సూచించారు. 'ఆత్మనిర్భర్' (స్వావలంబన) గా మారడం, 'స్వబల్' (స్వీయ బలం) ప్రదర్శించడం అవసరంపై ఏకాభిప్రాయం ఉందని భగవత్ ధ్రువీకరించారు. దీని కోసం 'మనం మన తెలివితేటలు, జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలి' అని తెలిపారు. భారత్ బలం దాని 'స్వత్వం' అని ఆయన నొక్కి చెప్పారు. సంస్కృతం తెలుసుకోవడం అంటే దేశాన్ని అర్థం చేసుకోవడం లాంటిదని ఆయన అన్నారు. భగవత్ విశ్వవిద్యాలయంలో అభినవ్ భారతి అంతర్జాతీయ విద్యా భవనాన్ని ప్రారంభించారు. పాశ్చాత్య సమాజాలు 'గ్లోబల్ మార్కెట్' గురించి మాట్లాడుతూ పాశ్చాత్యులు 'గ్లోబల్ మార్కెట్' ఆలోచనను అభివృద్ధి చేశారని, అది ఇప్పుడు 'విఫలమైందని' అని తెలిపారు.

కంగనా పిటిషన్‌కు హైకోర్టు తిరస్కృతి

చండీగఢ్: బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రణావత్‌కు పంజాబ్-హర్యానా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బటిండా కోర్టులో ఉన్న క్రిమినల్ పరువు నష్టం దావా రద్దు చేయాలంటూ కంగనా దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. ఐపీసీ సెక్షన్లు 499, 500 కింద అభియోగాలు మోపారని, మేజిస్ట్రేట్ జారీ చేసిన సమన్లు చట్టబద్ధమైనదని జస్టిస్ త్రిభువన్ దహియా సింగిల్ బెంచ్ స్పష్టం చేసింది. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన ఉద్యమంపై ఆమె చేసిన ట్వీట్‌పై పరువు నష్టం కేసు నమోదైంది. కంగనా చేసిన రీట్వీట్‌లో బటిండాకు చెందిన మహిందర్ కౌర్ ఫొటోలో అందులో ఉంది. ఢిల్లీ షాహిన్‌బాగ్ నిరసన తెలుపుతున్న మహిళలో లింక్ చేయడంపై తన పరువుకు భంగం కలిగించారని ఆమె కోర్టును ఆశ్రయించారు. దాంతో పరువు నష్టం కేసులో కంగనాకు వ్యతిరేకంగా కోర్టు సమన్లు జారీ చేసింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కంగనా రనౌత్ మరింత బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని... అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాత చట్టపరమైన ప్రక్రియ మేరకు మేజిస్ట్రేట్ సమన్లు జారీ చేశారని హైకోర్టు పేర్కొంది. ట్వీట్‌లో ఆమె ఉద్దేశమేమీ తప్పు కాదని... సరిగ్గానే ట్వీట్ చేసిందని కంగనా తరపు న్యాయవాది వాదనలు వినిపించినా కోర్టు అంగీకరించలేదు. కంగనా ఆ ట్వీట్ చేయలేదని... కేవలం రీట్వీట్ చేసిందని... ట్వీట్‌లో గౌతమ్ యాదవ్ పేరును చేర్చలేదని... కంగనాపై మాత్రమే పిటిషన్ దాఖలైందంటూ చేసిన వాదనలను సైతం కోర్టు తోసిపుచ్చింది. 2021 రైతు ఉద్యమం సమయంలో కంగనా ఈ ట్వీట్ చేసింది. ఆ ట్వీట్‌లో మహిందర్ కౌర్ (87) అనే వృద్ధ మహిళ రూ.200 తీసుకుని ఆందోళనకు వచ్చినట్లుగా కంగనా ట్వీట్ చేశారు.

రాహుల్ వ్యాఖ్యలు సరికాదు: శశిథరూర్

న్యూఢిల్లీ: భారత్, రష్యా సంబంధాలపై అక్కసు వెళ్లగక్కుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమర్థించడాన్ని సొంత పార్టీ ఎంపీ శశిథరూర్ తప్పుబట్టారు. రాహుల్ వ్యాఖ్యలతో విభేదిస్తున్నానని చెప్పారు. భారత్, రష్యా ఆర్థిక వ్యవస్థలు ఇప్పటికే పతనమయ్యాయని, వాటిని మరింత దిగజార్చుకోనీయండంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను శశిథరూర్ కొట్టిపారేశారు. భారత ఆర్థిక స్థితి ఎలా ఉందో అందరికీ తెలుసన్నారు. ట్రంప్‌ను రాహుల్ సమర్థించడంపై పార్లమెంట్ వెలుపల శుక్రవారం మీడియా ప్రశ్నించగా ఈ మేరకు స్పందించారు. రష్యాతో భారత్ ఏం చేస్తుందన్న విషయాన్ని అసలు పట్టించుకోబోమని, వారిద్దరూ మునిగిపోతుంటే తమకెందుకని, మిగిలిన అందరి గురించి పట్టించుకుంటామని ట్రంప్ పోస్టు చేసిన విషయం తెలిసిందే. 'భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలున్నప్పటికీ... ఆ దేశంతో స్వల్ప లావాదేవీలే ఉన్నాయి. ఆ దేశం విధిస్తున్న సుంకాలు ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్నాయి. ఉక్రెయిన్‌లో దాడులు ఆపాలని ప్రపంచమంతా గొంతెత్తి అరుస్తుంటే... భారత్ మాత్రం రష్యా నుంచి ఆయుధాలను, ఇంధనాన్ని కొనుగోలు చేస్తోంది' అని ట్రంప్ చిర్రుబుర్రులాడారు. ఆ పోస్టుపై రాహుల్ స్పందిస్తూ... భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ ట్రంప్ నిజం మాట్లాడారని అన్నారు. దీనిపై అధికార పక్షం నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్‌కు చెందిన మరో ఎంపీ కార్తి చిదంబరం కూడా రాహుల్ వ్యాఖ్యలను సమర్థించలేదు. కానీ, ట్రంప్ ఓ సంప్రదాయేతర రాజకీయ నాయకుడంటూ చురకలు అంటించారు.

అమెరికా ఒత్తిడికి లొంగకండి

- దేశ ప్రయోజనాలు కాపాడండి
- మోదీ సర్కార్‌కు ఆర్ఎస్ఎస్ అనుబంధ ఎస్‌జేఎం సూచన

న్యూఢిల్లీ: భారత మార్కెట్లలోని సున్నితమైన రంగాలలోకి ప్రవేశించడానికి అమెరికా 'బలవంతపు వ్యూహాలు' అని, దాని ఒత్తిడికి లొంగవద్దని సంఘ్ పరివార్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ శుక్రవారం మోదీ ప్రభుత్వానికి సూచించింది. జాతీయ ప్రయోజనాలు కాపాడటానికి దృఢంగా ఉండాలని కోరింది. రక్షణ ఉత్పత్తిలో స్వావలంబనను బలోపేతం చేయడానికి, దేశీయ ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి అవసరమైన అత్యంత పోటీ ధరలకు ముడి చమురు పొందేందుకు భారతదేశ సార్వభౌమ హక్కు బాహ్య ఒత్తిడికి గురికాకూడదని ఎస్‌జేఎం జాతీయ సహ కన్వీనర్ అశ్వనీ మహాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెలలో రాయితీలు తగ్గడం, మాస్కో నుంచి చమురు కొనుగోలు చేయవద్దని ట్రంప్ హెచ్చరించడంతో భారత ప్రభుత్వ శుద్ధి కర్మాగారాలు గతవారంలో రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపివేసినట్లు ఒక ఆంగ్ల వార్తా సంస్థ గురువారం తెలిపింది. 'బలవంతపు వ్యూహాలు' భారతదేశ నిర్ణయాలను తిప్పికొట్టగలవని వాషింగ్టన్ విశ్వసిస్తే... నేటి భారతదేశం దశాబ్దం క్రితం నాటి భారతదేశం కాదని గుర్తించాలని మహాజన్ అన్నారు. 'భారత ప్రభుత్వం తన దృఢమైన వైఖరి కొనసాగించాలని, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేయడానికి, జాతీయ ప్రయోజనాలు కాపాడటానికి, నిజంగా బహుళ-ధ్రువ, సమానమైన ప్రపంచ వాణిజ్య క్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి 'ఆత్మనిర్భర్ భారత్' వైపు నిర్ణయాత్మక చర్య తీసుకోవడానికి ఈ క్షణాన్ని ఉపయోగించుకోవాలని ఎస్‌జేఎం కోరుతోంది' అని మహాజన్ అన్నారు. 'మనం ప్రపంచ శక్తిగా ఎదుగుతున్నాము. ఆపరేషన్ సిందూర్ సమయంలో నిర్ణయాత్మకంగా వ్యవహరించాము. ఆయుధ ఉత్పత్తిలో బలమైన స్వదేశీ సామర్థ్యాలను నిర్మించడానికి కట్టుబడి ఉన్నాము. అమెరికా కూడా ఏకధ్రువ ప్రపంచ దృక్పథ జడత్వాన్ని దాటి, బహుళ ధ్రువ, సహకార క్రమం వాస్తవికతను స్వీకరించాలి' అని అన్నారు. 'సంప్రదాయ భాగస్వాములకు మించి వాణిజ్య వైవిధ్యాన్ని వేగవంతం చేయడానికి, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, విస్తరించిన బ్రిక్స్ కూటమి, దక్షిణార్ధగోళంతో సంబంధాలు మరింత పెంచుకోవడానికి ఇది మంచి తరుణమని ఎస్‌జేఎం విశ్వసిస్తుంది. అమెరికా భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్నప్పటికీ, వాణిజ్యం ఎల్లప్పుడూ పరస్పర ప్రయోజనాన్ని అందించాలి. ఒత్తిడి సాధనంగా ఉపయోగించకూడదు' అని ఆయన తెలిపారు. భారతదేశం-అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) చర్చల సమయంలో ఒత్తిడికి వ్యతిరేకంగా స్థిరంగా నిలబడినందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తూ, జన్యుపరంగా మార్పు చెందిన (జీఎం) వ్యవసాయ ఉత్పత్తులు, పాల దిగుమతులు, ఇతర సున్నితమైన రంగాలకు మన మార్కెట్లను బలవంతంగా తెరవడానికి చేసే ప్రయత్నాలను భారతీయ సంధానకర్తలు సరిగ్గా' ప్రతిఘటించారని మహాజన్ పేర్కొన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

చందు నాయక్ చిత్రపటానికి నివాళులు

విశాలాంధ్ర, హైదరాబాద్ : అచ్చంపేటలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు చందు నాయక్ చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ తదితరులు పరామర్శించారు. దిల్‌సుక్‌నగర్, చైతన్యపురి ప్రాంతంలో నివాసం ఉండే చందు నాయక్ హైదరాబాదులో పేదల కోసం గూడు లేని వారికోసం గుడిసెలు వేయించి భూ పోరాటం నిర్వహించారు. భారత కమ్యూనిస్టు పార్టీలో నాయకునిగా అంచ లంచలుగా ఎదగడం జరిగింది. ఇటీవల కొంత మంది దుర్మార్గులు కంట్లో కారం చల్లి కాలుపులు జరపడంతో అక్కడికక్కడే మరణించడం జరిగింది.

సిపిఐ నాల్గవ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4 వ మహాసభల గోడ పత్రికను శుక్రవారం వినాయక్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సి.హెచ్.దశరథ్ మాట్లాడుతూ దున్నేవాడికి భూమి కావాలని, తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించి పది లక్షల ఎకరాల భూమిని ప్రజలకు పంచిన ఘన చరిత్ర సిపిఐ పార్టీదని, కార్మికుల కర్షకుల శ్రమను దోచుకుంటున్న కార్పొరేట్ వర్గాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి ఎనిమిది గంటల పని దినాల అమరులోకి తెచ్చింది. భాషా సంయుక్త రాష్ట్రాల ఆవశ్యకతను గుర్తించి సాధించిన పార్టీ 4వ రాష్ట్ర మహాసభకు ప్రజలందరూ ఆర్థిక హార్దిక సహకరించి మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి టి.యాదయ్య గౌడ్ మాట్లాడుతూ మహాసభ విజయవంతం చేయడానికి ఇంటికో మనిషి శాఖకు బండి కదలి రావాలని ఆయన అన్నారు. మండల సహాయ కార్యదర్శి కాసర్ల నాగరాజు, మండల కార్యవర్గ సభ్యులు షేక్ అజిత్, బి.యాదగిరి, ఎస్.యూసుఫ్, కే.పవన్, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డు ఇవ్వాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరుగుతున్న సందర్భంలో, రేషన్ కార్డులు అందుకోబోతున్న అమ్మలకి, అక్కలకి, చెల్లెల్లకి శ్రావణ శుక్రవార శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఖైరతాబాద్ నియోజక వర్గానికి కేటాయించిన 1959 రేషన్ కార్డుల కు సంబంధించి మంత్రికి ఎమ్మెల్సీ దాసోజి శ్రవణ్ అభినందనలు తెలిపారు. అయితే ఈ సందర్భంగా మూడుచోట్ల స్పష్టత అవసరమని, వెంటనే సవరణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఖైరతాబాద్ సర్కిల్‌లో 22,399 దరఖాస్తులు అందినప్పటికీ, కేవలం 1959 కార్డులు మాత్రమే మంజూరు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. అదే సమయంలో బహదూర్‌పురా, కార్వాన్, జూబ్లీహిల్స్, నాంపల్లి వంటి నియోజకవర్గాల్లో 5000కు పైగా కార్డులు ఇవ్వబడినట్టుగా ఉందని తెలిపారు. ఈ వ్యత్యాసానికి కారణాలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కమిషనర్ "ప్రజాపాలన" కార్యక్రమంలో రేషన్ కార్డులకు దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఇప్పటి వరకు మొత్తం వచ్చిన దరఖాస్తులు ఎన్ని? ప్రజాపాలన ద్వారా కొత్తగా వచ్చినవి ఎన్ని? అన్న వివరాలను అధికారికంగా విడుదల చేయాలని డా. శ్రవణ్ డిమాండ్ చేశారు. "గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు కూడా రాలేదు" అనే వ్యాఖ్య పూర్తిగా వాస్తవానికి విరుద్ధమని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో 2016 నుండి 2023 మధ్యకాలంలో 6,47,479 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. అలాగే 2014లో 4 కిలోల బియ్యాన్ని 6 కిలోలకు పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అన్నారు. గతంలో ఏమీ ఇవ్వలేదని చెబితే ప్రజల్లో తప్పుదారి పట్టించే అభిప్రాయాలు ఏర్పడతాయని హెచ్చరించారు. "రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసిన ప్రతి అర్హుడికి కార్డు మంజూరు చేయాలి. ఇది సామాజిక న్యాయం. ఇది సంక్షేమ పాలనకు మూలాధారం. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది" అని డా. దాసోజు శ్రవణ్ స్పష్టం చేశారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



విశాలాంధ్ర - మొయినాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎంఎస్పి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రావుగల్ల బాబు మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిల్కూర్ వార్డులో వృద్ధులు, వితంతలు, ఒంటరి మహిళలు, వికలాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు (శనివారం) చేవెళ్లలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో చేయూత పెన్షన్ దారుల సన్నాహక సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ వస్తున్నట్లు ఆయన వివరించారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, బీడీ కార్మికుల పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ సభను నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 13న నగరంలోని ఎల్బీ స్టేడియంలో జరిగే మహాసభను పెన్షన్ దారులు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా నాయకులు సిరిగిరి కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొండిగారి మహేందర్ మాదిగ, ఉపాధ్యక్షులు రాజు మాదిగ, చిలుకూరు గ్రామ పించన్ల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నవనీతరావుకు ఎక్సలెన్స్ ఇన్ లీడర్‌షిప్ అండ్ అడ్మినిస్ట్రేషన్ అవార్డు

విశాలాంధ్ర - కాప్రా : నాచారం డివిజన్‌లోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ కె.నవనీతరావుకు ఎక్సలెన్స్ ఇన్ లీడర్‌షిప్ అండ్ అడ్మినిస్ట్రేషన్ అవార్డు లభించింది. ప్రతిష్ఠాత్మక ఈటీ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సమ్మిట్- 2025 కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని నోవా హోటల్‌లో నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యా రంగంలో ముందంజ వేసిన వారిని గుర్తించి ప్రతిష్ఠాత్మక అవార్డులు అందించారు. విద్యలో పరివర్తన పద్ధతులు, అచంచలమైన అంకితభావాన్ని, విద్యా నైపుణ్యాన్ని గుర్తించి నవనీత రావుకు ఈ అవార్డును అందించారు. ఈ మేరకు ఆయనకు కుటుంబ సభ్యులు, స్నేహితులు, పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు అందిస్తాం

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : అర్హులైన ప్రతి ఒక్కరికి తెలంగాణలో రేషన్ కార్డు అందిస్తామని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారా హిల్స్ బంజారా భవన్‌లో లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నామని అన్నారు. అలాగే తెలంగాణలోని 32 జిల్లాలో రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరమని అన్నారు. హైదరాబాద్ జిల్లాలో సివిల్ సప్లైస్, జీహెచ్ ఎంసీ, రెవెన్యూ శాఖల సమన్వయంతో రేషన్ కార్డులు ఇస్తున్నమని అన్నారు. రేషన్ కార్డులు పొందుతున్న లబ్ధిదారులందరికీ శుభాకాంక్షలు మంత్రి శుభా కాంక్షలు తెలిపారు గతంలో దొడ్డు బియ్యం తినే పరిస్థితి లేకుండే ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి ఆలోచనలతో పెద్దలకే పరిమితమైన సన్న బియ్యం ఇప్పుడు పేదలందరకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గత పాలకులు గతంలో 5 లక్షల రేషన్ కార్డులు తొలగించారని ఈ సందర్భంగా అన్నారు. గత 10 సంవత్సరాలుగా లక్షలాది మంది రేషన్ కార్డులకై ఎన్నో ఇబ్బందులు పడ్డారని ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని అర్హులైన ప్రతి ఒక్కరికి రాజకీయాలకతీతంగా రేషన్ కార్డులు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అలాగే మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచితంగా ప్రయాణం కల్పిస్తున్నామని, ఇప్పటి వరకు 200 కోట్లు ఉచిత ప్రయాణాలు జరిగాయని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో పారదర్శకంగా 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నామని అన్నారు. గతంలో ఉప్పల్‌లో పని చేస్తుంటే కొల్లూరులో ఇల్లు ఉంటే ప్రజలకు ఎలా ఉపయోగపడుతుందని, ఉన్న చోటే ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచనని ఈ సందర్భంగా వివరించారు. హైదరాబాద్‌లో 55,378 రేషన్ కార్డులు కొత్తగా ఇస్తున్నామని ఫలితంగా 3,79,249 రేషన్ కార్డులు అయ్యాయని స్పష్టం చేశారు. లబ్ధిదారుల సంఖ్య 23,61,440 లక్షల నుండి 27,40,689 లక్షలకు పెరిగిందని వివరించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 1953 కొత్తగా రేషన్ కార్డులు పంపిణీ తో 7435 మందికి కొత్తగా రేషన్ కార్డు లబ్ధిదారులు అయ్యారని అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 35648 నుండి 37601 కి పెరిగాయని, లబ్ధిదారుల సంఖ్య 1,07.087 నుండి 1,20,974 కి పెరిగిందని మంత్రి తెలిపారు. ఈ నియోజకవర్గంలో ఇంకా 4898 కొత్త రేషన్ కార్డులు పరిశీలించాల్సి ఉంటుందని అన్నారు. ప్రజా సమస్యలు వినడం మా బాధ్యత వాటిని పరిష్కారం చేయడం మా ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. అలాగే ఇచ్చిన వాగ్దానంతో అర్హులైన అందరికీ పథకాలు అందిస్తూ ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా అర్హత కలిగిన మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నామని అన్నారు. అలాగే సన్న వడ్ల కి 500 బోనస్ ఇస్తున్నామని రైతులకు రైతు భరోసా, రుణమాఫీ చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఎక్కడ కూడా

అవినీతితో కూడుకున్న రాజ్యాంగం బీజేపీది

విశాలాంధ్ర - హైదరాబాద్ : అవినీతితో కూడుకున్న రాజ్యాంగం బీజేపీది అయితే ప్రేమతో కూడుకున్న రాజనీతి మనది అని టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. ఈ రెండింటిలో తెలంగాణను మెడల్‌గా నిలిచామన్నారు. అందులో ఒకటి కులగణన మరొకటి జనగణనలో కులగణన డిమాండ్ అని పేర్కొన్నారు. శుక్రవారం జనహిత పాదయాత్రలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశానికి టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా నటరాజన్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్ ఎస్ ఎస్ కి మనకు వ్యత్యాసం ఉందని, ఆర్ ఎస్ ఎస్ స్వార్ధంతో కూడుకున్నది అయితే నిస్వార్ధంతో మనం ఉన్నామని చెప్పారు. రోగం ఏంటో తెలిస్తేనే వైద్యం అందేది.. అలాంటి పనే రాహుల్ గాంధీ చేశారని, రాహుల్ గాంధీ అనేక విషయాల్లో తెలంగాణ మోడల్ గురించి ప్రస్తావిస్తారని పేర్కొన్నారు. స్వార్ధం కోసం పని చేసే వ్యక్తి కాంగ్రెస్ కార్యకర్త కాదని, నిస్వార్ధంగా పని చేసే నిక్కర్సైన కార్యకర్తలు మనవాళ్ళు అని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో న్యూ తెలంగాణ మోడల్ నిర్మాణం అవుతుందని వివరించారు. ప్రేమను విస్తరింప చేసే పార్టీ మన కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. మహేష్ గౌడ్ మాట్లాడుతూ పదేళ్ల పాటు కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయడం వల్లే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అభిప్రాయపడ్డారు. గడిల పాలన అంతమొందించి ప్రజాపాలన కాంగ్రెస్ పార్టీ తీసుకొస్తుందని ప్రజలు నమ్మారని తెలిపారు. తుక్కుగూడ సభలో ఏఐసిసి పెద్దలు ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను అమలు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వంపై ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. కేసిఆర్ పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల మయంగా మార్చారని అయినా దేశం ఆశ్చర్యపోయే రీతిలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. సంక్షేమ పథకాల్లో లోటు పాట్లు, స్థానికంగా ప్రజలు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటుంటే వాటి సత్వర పరిష్కారం కోసం టీపిసిసి జనహిత పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు పాదయాత్ర చేస్తున్నామని.స్పష్టం చేశారు. కార్యకర్తల బాగోగులు తెలుసుకోవడానికి ఉమ్మడి జిల్లాల సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజామోదం ఉన్న నాయకులకు మాత్రమే టికెట్లు ఇచ్చి గెలిపించుకుంటామని పేర్కొన్నారు. అంతకుముందు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్రలో భాగంగా మొదటి రోజు ఉదయం పరిగిలోని ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ, స్థానిక ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ సైన్స్‌లో కెరీర్ అవకాశాలు, ఉద్భవిస్తున్న ధోరణులపై ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ "ఫోరెన్సిక్ సైన్స్‌లో కెరీర్ అవకాశాలు, ఉద్భవిస్తున్న ధోరణులు" అనే అంశంపై ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. విజయ చరణ్, ఓయూ ఫోరెన్సిక్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.సౌమ్య ప్రారంభించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని వివిధ కళాశాలల నుండి అండర్ గ్రాడ్యుయేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి. విజయ చరణ్ మాట్లాడుతూ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లను సులభతరం చేయడం, విద్యార్థుల నైపుణ్య అభివృద్ధిని పెంచడం విదేశాలలో చదువుకునే అవకాశాలపై అవగాహన కల్పించడం. డిజిటల్ ఫోరెన్సిక్స్, ఫోరెన్సిక్ సైకాలజీ వంటి ప్రత్యేక రంగాల నుండి ఫోరెన్సిక్ శాస్త్రవేత్తలు, క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేటర్లు వంటి సాంప్రదాయ స్థానాల వరకు వివిధ రకాల ఉద్యోగ ఎంపికల గురించి అవగాహన పెంచడానికి ఈ కార్యక్రమం ఉద్దేశించబడిందని పునరుద్ఘాటించారు. ఫోరెన్సిక్ శాస్త్రవేత్తలు మరియు క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేటర్‌ల వంటి సాంప్రదాయ పాత్రల నుండి డిజిటల్ ఫోరెన్సిక్స్ ఇతర రంగాల వంటి ప్రత్యేక ప్రాంతాల వరకు విభిన్న కెరీర్ మార్గాలపై అవగాహన తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని ఆమె వివరించారు. రిసోర్స్ పర్సన్ షెర్లాక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్సెస్ సిఈఓ, డైరెక్టర్ రంజీత్ సింగ్. ఫోరెన్సిక్ సైన్స్‌లో విస్తృత శ్రేణి కెరీర్ ఎంపికలు అత్యాధునిక పరిణామాలపై దృష్టిని ఆకర్షించడం ఈ కార్యక్రమం ప్రాథమిక లక్ష్యం, ఇది ఈ డైనమిక్ రంగంలో నైపుణ్యం కలిగిన నిపుణుల కోసం అర్హత కలిగిన కార్మికుల అవసరాన్ని హైలైట్ చేస్తుంది.

కొత్త టెక్నాలజీలను స్వీకరించడం ద్వారా సైన్స్, దర్యాప్తు సమస్య పరిష్కారం పట్ల మక్కువ ఉన్న వ్యక్తుల కోసం డైనమిక్, ప్రతిఫలదాయకమైన కెరీర్ మార్గాన్ని హైలైట్ చేయాలని డాక్టర్ సౌమ్య తన సందేశంలో వ్యక్తం చేశారు.

స్పోర్ట్స్ కాంక్లేవ్‌కు సర్వం సిద్ధం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ హెచ్ ఐ సి సి, నోవాటేల్‌లో రేపు నిర్వహించనున్న స్పోర్ట్స్ కాంక్లేవ్ కు సర్వం సిద్ధమైంది. తెలంగాణ క్రీడా విధానం 2025ను యావత్ క్రీడా సమాజానికి విస్తృత స్థాయిలో పరిచయం చేసేందుకు, క్రీడా విధానం అమలులో అందరి భాగస్వామ్యం పెంచేందుకు ఉద్దేశించిన ఈ స్పోర్ట్స్ కాంక్లేవ్‌కు కావలసిన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ప్రఖ్యాత క్రీడా విశ్లేషకులు చారు శర్మ, భారత క్రికెట్ మాజీ ఒలంపియన్లు పుల్లెల గోపీచంద్ గగన్ నారంగ్, అంజు జార్జ్ వివిధ క్రీడా ఫెడరేషన్ల ప్రతినిధులు క్రీడా సంఘాల ప్రతినిధులు ప్రముఖ క్రీడా జర్నలిస్టులు విశ్వనాథన్ సభ నాయక్‌తోపాటు మరి కొంతమంది సీనియర్ క్రీడా జర్నలిస్టులు తదితరులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారు. ఈ విధానం ప్రధానంగా పటిష్టమైన క్రీడా పరిపాలన, దీర్ఘకాలిక క్రీడల అభివృద్ధి, కెరియర్ మరియు ఉపాధి మార్గాల రూపకల్పన, క్రీడా మౌలిక సదుపాయాల కల్పన, సమగ్ర క్రీడా వాతావరణ కల్పన వంటి అంశాలపై దృష్టి సారించనుంది. గత ఏడాది కాలం నుండి సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ఒక సమగ్రమైన పటిష్టమైన క్రీడా విధానం తీసుకురావాలన్న సంకల్పంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఎంతో కృషి చేసింది. ఎఫ్ ఐఎఫ్ ఏ వంటి గ్లోబల్ క్రీడా సంస్థలతో పాటు ప్రముఖ కార్పొరేట్లు, క్రీడా నిపుణులతో రాష్ట్రం ఎంవోయూస్ చేసుకుంటోంది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలకు ఇది ఆరంభము మాత్రమేనని స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. నేటి కార్యక్రమాలకు జరుగుతున్న ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక జాతీయ అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించే సత్తా ఉందని అనేకసార్లు నిరూపించబడిందని, క్రీడా శాఖ అధికారుల శ్రమ రాష్ట్ర ప్రభుత్వ సహకారం సీఎం రేవంత్ పట్టుదల కలసి తెలంగాణ నూతన క్రీడా విధానం 2025 రూపు దిద్దుకుందని ప్రకటించిన క్రీడా విధానం మెరుగ్గా అమలు పరచడానికి, దీనిని జాతీయస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి వివిధ క్రీడా కార్యక్రమాలలో అందరినీ భాగస్వామ్యం చేయడానికి జాతీయస్థాయిలో మద్దతు కూడగట్టడానికి ఈ స్పోర్ట్స్ కాంక్లేవ్ ముఖ్య ఉద్దేశమని శివసేన రెడ్డి అన్నారు.

ప్రతి డివిజన్‌లో సమాంతరంగా అభివృద్ధి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి డివిజన్‌లో సమాంతరంగా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగర పాలక సంస్థ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో 10 లక్షల రూపాయల ముడా నిధులతో పార్కు పునరుద్ధరణ పనులకోసం 12 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న మహిళా జిమ్ నిర్మాణపు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా జరగని అభివృద్ధి పనులు కేవలం ఈ 16 నెలల్లోనే శరవేగంగా జరుగుతున్నాయని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఎదిర శివాలయం ఆవరణలో 10 లక్షల రూపాయల ముడా నిధులతో నూతనంగా నిర్మించనున్న మల్టీ పర్పస్ షెడ్ నిర్మాణపు పనులకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. అంతకుముందు శివాలయంలో కొలువైన మహాశివుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకి వేద ఆశీర్వాదం అందించి, తీర్ధ ప్రసాదాలు అందజేశారు. అలాగే మహబూబ్ నగర్ నగర్ భగీరథ కాలనీలో 20 లక్షల రూపాయల ముడా నిధులతో నూతనంగా నిర్మించనున్న పార్క్ నిర్మాణపు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీగా ఉన్న మహబూబ్ నగర్ ను మున్సిపల్ కార్పొరేషన్ గా అభివృద్ధి చేసుకోవడం జరిగిందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అత్యధిక సంఖ్యలో నిధులు తెచ్చి మహబూబ్ నగర్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. అదేవిధంగా పట్టణంలోని అలీస్ మార్ట్ దగ్గర 25 లక్షల రూపాయల ముడా నిధులతో నూతనంగా నిర్మించనున్న పార్క్ నిర్మాణపు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ప్రతి కాలనీలో అన్ని రకాల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది యేండ్లు అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు అజ్మత్ అలి, ఫైయాజ్, ఫైసల్, మరియు మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంకు చేరిన కాళేశ్వరం నివేదిక

4న మంత్రివర్గంలో చర్చించనున్న కేబినేట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాళేశ్వరంలో జరిగిన అక్రమాలపై కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అధికారులు సమర్పించారు. ఈ సందర్భంగా నివేదికను అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో సీఎంకు నివేదికను అందజేయడం జరిగింది. అయితే ఈ నివేదికను అధ్యయనం చేసి పూర్తి సారాంశాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ కమిటీలో నీటిపారుదల శాఖ సెక్రెటరీ, న్యాయ శాఖ సెక్రెటరీ, జీఏడీ సెక్రటరీ సభ్యులుగా వేసింది. వీరు నివేదికను అధ్యయనం చేసి పూర్తి సారాంశాన్ని ఈ నెల 4న రాష్ట్ర కేబినెట్‌కు సమర్పించనున్నారు. అనంతరం జరిగే కేబినెట్ సమావేశంలో దీని చర్చించి తదుపరి కార్యాచరణపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త సమస్యలపై

వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసుకునే సదుపాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగర ప్రజలకు మరింత సౌకర్యం కల్పించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త తొలగింపు వంటి సమస్యలపై పౌరులు తక్షణమే ఫిర్యాదు చేయగలగే విధంగా ప్రత్యేక వాట్సాప్ నంబర్‌ను ఏర్పాటు చేసినట్టు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ వెల్లడించారు. ఇంతకు ముందు మై జీహెచ్‌ఎంసీ యాప్ ద్వారా మాత్రమే ఫిర్యాదు చేసే అవకాశం ఉండేది. అయితే సమస్యలపై మరింత వేగంగా స్పందించేందుకు ఇప్పుడు వాట్సాప్ నంబర్ 81259 66586ను ప్రారంభించామని ఆయన తెలిపారు. పౌరులు తమ ప్రాంతంలో ఎదురవుతున్న భవన నిర్మాణ వ్యర్థాలు, గార్బేజ్ బిన్ ఓవర్‌ఫ్లో జీవిపి పాయింట్‌ల వద్ద పేరుకొనిపోయిన చెత్త తొలగింపు వంటి సమస్యల ఫోటోలు, లోకేషన్ వివరాలు ఈ నంబర్‌కు పంపించవచ్చు. ఇలా వచ్చిన ఫిర్యాదులను అధికారులు తక్షణమే పరిష్కారం చూపుతారని ఆయన తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రజల సహకారంతో పరిశుభ్ర నగర లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ ఈ సేవను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఆర్‌వి కర్ణన్ పేర్కొన్నారు.

సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సీపీఐ 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా 23వ మహాసభలు జడ్చర్ల పట్టణ కేంద్రంలో ఈనెల 5,6 తేదీలలో గౌడ ఫంక్షన్ హాల్లో జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా మహాసభలు విజయవంతనికై పార్టీ శ్రేణులతో కలిసి మాస్ ఫండ్ క్యాంపియన్ చిరు వ్యాపారాలు వీరి వ్యాపారస్తులతో విరాళాలు సేకరించారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావుతో పాటు మాజీ శాసనసభ్యులు సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి పాల్గొంటారని వివరించారు. ఈ మహాసభలలో పార్టీ భవిష్యత్తు ప్రణాళికలు పోరాట రూపాలను సిద్ధం చేసుకుని పేద ప్రజల కోసం కార్మికుల కోసం ఉదండాపూర్ నిర్వాసితులకు, న్యాయం జరిగే వరకు పోరాటం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల మండల పార్టీ కార్యదర్శి బాగి కృష్ణయ్య, రైతు సంఘం నాయకులు, అలవాల్ రెడ్డి, చాంద్ బాషా మహేష్, ఆంజనేయులు, కోట కదిరి నరసింహ కుమార్, జంగయ్య, మహిళా సంఘం నాయకురాలు భార్గవి ఇందిరా సత్యమ్మ పాల్గొన్నారు.

సిపిఐ మహా సభలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ రంగారెడ్డి జిల్లా 17వ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పర్వతాలు, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం మొయినాబాద్ కేంద్రానికి విచ్చేసి పర్యవేక్షణ కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొయినాబాద్ మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్‌లో సిపిఐ జిల్లా 17వ మహాసభలు జరుగుతాయని చెప్పారు. రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అధ్యక్షతన జిల్లా మహాసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ హాజరవుతున్నారన్నారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుండి 400 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని, రంగారెడ్డి జిల్లాలో అన్ని గ్రామాలకు పార్టీ గ్రామ శాఖల నిర్మాణం చేపట్టడానికి, ప్రజాసంఘాలను బలోపేతం చేయడానికి ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇండ్ల పట్టాల కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చేవెళ్ల నియోజవర్గం బాధ్యుడు కె. రామస్వామి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. ప్రభు లింగం, రాష్ట్ర రైతు సంఘం కౌన్సిల్ సభ్యుడు మాజీ చేవెళ్ల మండల సిపిఐ కార్యదర్శి ఎం. సుధాకర్ గౌడ్, చేవెళ్ల మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, షాబాద్ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం, పి. సుధీర్, మొయినాబాద్ మండల కార్యదర్శి కె. శ్రీనివాస్, మహిళా రంగారెడ్డి జిల్లా మహిళ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, ఇన్సఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి. మక్బూల్ తదితరులున్నారు.

నగర వ్యాప్తంగా 7258 పాట్ హోల్స్‌కు మరమ్మతులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన రహదారులపై రోడ్ సేఫ్టీ డ్రైవ్ కొనసాగుతోంది. నగరవాసులకు సురక్షితమైన, మెరుగైన రహదారి వాహనదారితనం కల్పించడమే ఈ డ్రైవ్ ముఖ్య ఉద్దేశం. డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం రోడ్ల మరమ్మత్తులు, కాచ్పిట్‌లు, సెంట్రల్ మీడియన్ మరమ్మత్తులు వంటి పనులు చేపట్టబడ్డాయి. నగరంలోని ఆరు జోన్లలో ఈ కార్యక్రమం సాగింది. నగరంలో నేడు మొత్తం 462 బి టి, సిమెంట్ కాంక్రీట్ పాట్ హోల్స్ నింపడం జరిగింది. 23 క్యాచ్ పిట్‌లు మరమ్మత్తు చేయడంతో పాటు 8 క్యాచ్ పిట్ కవర్లు మార్చడం జరిగింది. ఎల్బీనగర్ జోన్‌లో 133 పాట్ హోల్స్, 10 కాచ్పిట్‌లు, 7 కవర్లు మార్చడం జరిగింది., చార్మినార్ జోన్ లో 52 పాట్ హోల్స్, 9 క్యాచ్ పిట్‌లు, ఖైరతాబాద్ జోన్‌లో 63 పాట్ హోల్స్ పూడ్చడం జరిగింది, శేరిలింగంపల్లి జోన్‌లో 55 పాట్ హోల్స్ పూడ్చడం జరిగింది, కూకట్‌పల్లి జోన్ లో 85 పాట్ హోల్స్ పూడ్చారు, సికింద్రాబాద్ జోన్‌లో 74 పాత్హోల్స్, 4 కాచ్పిట్‌లు నగర వ్యాప్తంగా ఇప్పటి వరకు 7258 పాట్ హోల్స్ (గుంతలు) పూడ్చగా, 333 క్యాచ్ పిట్ లకు మరమ్మత్తులు చేయడం జరిగింది. 114 క్యాచ్ పిట్‌లు మార్చడం జరిగింది. 3 ప్రాంతాల్లో సెంట్రల్ మీడియన్ మైనర్ మరమ్మత్తులు చేయడం జరిగింది. ఈ డ్రైవ్‌లో భాగంగా ప్రతి జోన్‌కి సంబంధించిన ఇంజినీరింగ్ విభాగాలు, ఫీల్డ్ సిబ్బంది సమన్వయంతో వేగంగా పని చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి, రహదారి భద్రత కోసం అన్ని చర్యలు తీసుకుంటోందని కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు.

ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు గురుకులాలు ఏర్పాటు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు గురుకులాలు ఏర్పాటు చేసి ఉత్తమమైన విద్యను అందిస్తుదని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటిని ప్రకృతి సమతూల్యతను పరిరక్షించాలి. శుక్రవారం శామీర్‌పేట లోని మహాత్మాగాంధీ జ్యోతి రావ్ పూలే వెనుకబడిన తరగతులు బాలుర గురుకుల పాఠశాల నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్దులతో ముచ్చటిస్తూ పాఠశాల దశలనే విద్యార్దులు లక్ష్యాలను ఎంచుకుని, దానికి అనుగుణంగా సాధించేందుకు ఇప్పటి నుంచే అలవాటు చేసుకోని, ఎలాంటి అవరోదాలు వచ్చినా వాటిని అదిగమించి, అనుకున్న లక్ష్యాలను చేదించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో ప్రతి ఒక్క మొక్కను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు ఎంతగానో మానవాళికి ఉపయోగపడుతున్నా యని, గ్లోబల్ వార్నింగ్ నుండి మానవాలిని రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటిని కాపాడు కోవల్సిన బాధ్యత మనందరి మీద ఉన్నదని, దీనివల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా పర్యావరణాన్ని పరిరక్షించబడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజినీ కాంత్, శామీర్‌పేట తహశీల్దార్ యాదగిరి రెడ్డి, మున్సిపల్ ఇఇ కన్నేశ్వర్, శానిటరీ ఇన్స్పెక్టర్ రూపా, విద్యార్దులు, తదితరులు పాల్గొన్నారు.

మాతా భువనేశ్వరి అమ్మవారికి కలెక్టర్ ప్రత్యేక పూజలు

అమ్మవారికి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా అధికారులు, తోటి ఉద్యోగులు సాంప్రదాయ రీతిలో బోనం సమర్పించారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టరేట్ ఆవరణలో గల శ్రీ మాతా భువనేశ్వరి అమ్మవారి దేవాలయంలో బోనాల సందర్భంగా జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పాటు అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా అధికారులు, తొటి ఉద్యోగులు పోతురాజుల విన్యాసాలతో ఉరేగింపుగా సాగి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారి బోనాల ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా ఆలయ మర్యాదలతో నిర్వహించారు. ఎస్సీ వెల్ఫేర్ అధికారి జి. వినోద్ కుమార్ జిల్లా టిజిఓ అధ్యక్షులు జి. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఏర్పాటు చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్‌రావు, కార్యదర్శి ఎ.కురుమూర్తి పాల్గొన్నారు. లా ఆఫీసర్ ఆర్.ఎస్. చంద్రవతి, డిఆర్‌డిఎ సాంబశివరావు, జెడ్పీ సిఇఓ కాంతమ్మ, కలెక్టరేట్ పరిపాలన రామోహన్, జిల్లా ఉపాధి కల్పన అధికారి యం. రాధిక, బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీ లక్ష్మి, సివిల్ సప్లై డిఎం సుగుణ బాయ్, వివిధ శాఖల జిల్లా అధికారలు పాల్గొన్నారు.

బస్తీ బాటతో మల్లాపూర్‌లో సమస్యలకు చెక్

విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ డివిజన్ భవాని నగర్ కాలనీలో కొద్దిరోజుల ముందు గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ నిర్వహించిన బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా వెలువడిన సమస్యలో ప్రధాన సమస్యగా కాలనీ కమాన్ వద్దా రెండేళ్ల ముందు శంకుస్థాపన చేసిన బాక్స్ డ్రైన్ పనులు ఇంకా మొదలు కాకపోవడంతో కాలనీ ప్రజలు ఇబ్బంది పడ్తున్న విషయాన్ని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో, తద్వారా కార్యనిర్వాహక ఇంజనీర్ నాగేందర్‌ని జులై 16న నెమలి అనిల్ బృందం కలిసి వినతి పత్రాన్ని అందచేసిన విషయం తెలిసిందే,వెంటనే స్పందించిన అధికారులు శుక్రవారం బాక్స్ డ్రైన్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్థంబాలను తొలగించి పనులను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ ఎలక్ట్రికల్ నాగరాజ్, భవాని నగర్ కాలనీ అడ్వైసర్ మన్నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, నాయకులు నెమలి సురేష్, సురేష్ గౌడ్, పైళ్ల శ్రీనివాస్, సురేష్, పవన్, రంజిత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే రూ.5 వేల జరిమానా

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ పరిధిలో రోడ్డు పైన చెత్త వేసిన వారిపై మున్సిపల్ అధికారులు శుక్రవారం ఉదయం 5వేలు జరిమానా విధించారు. మీరు రోడ్ల పైన, ఇంటి పరిసరాల్లో చెత్త వేస్తున్నారా? తస్మాత్ జాగ్రత్త! మున్సిపాలిటీ మూడో నేత్రం మిమ్మల్ని గమనిస్తుంది. దాంతో తప్పదు మీకు భారీ జరిమానా విధిస్తుంది.. కొందరు రోడ్ల పైన, కాలనీలలో కాళీ జాగాల్లో ఇష్టానుసారంగా చెత్తను పడేస్తుంటారు. దీంతో దోమలు విజృంభించి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వంటి అనేక రోగాలకు దారితీస్తుంది. ఇలాంటి పరిస్థితులను అరికట్టేందుకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రోడ్లపై చెత్త వేసిన వారికి నిర్దాక్షిణ్యంగా జరిమానా విధిస్తున్నారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి స్పందిస్తూ రోడ్లపై విచ్చలవిడిగా చెత్త వేస్తున్న వారికి ఫైన్ విధిస్తూ మున్సిపల్ అధికారులు చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమం అభినందనీయమని, ఇంటి నుండి వెలువడే చెత్తను ప్రతి ఒక్కరూ విధిగా మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు మాత్రమే వేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మున్సిపల్ అధికారులు కూడా ప్రజలలో మరింత అవగాహన కల్పించి, రోడ్ల పైన చెత్త వేయకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

ఉద్యోగ, కార్మికుల సంక్షేమానికి కలసికట్టుగా పనిచేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : దశాబ్దాలుగా కార్మికుల పక్షాన పోరాడుతున్న కాంగ్రెస్ అనుబంధ మూడు జలమండలి యూనియన్‌ల ఐక్యత చారిత్రకం అని, ఉద్యోగ, కార్మికుల సంక్షేమం, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కలసికట్టుగా పని చేయాలనీ టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ కోరారు. కాంగ్రెస్ హైకమాండ్ పిలుపు మేరకు మధుయాష్కి గౌడ్ అధ్యక్షతన జరిగిన, హైదర్ గూడా, ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అయన నివాసంలో శుక్రవారం కాంగ్రెస్ అనుబంధ సంఘాలు మూడు జలమండలి యూనియన్ల సమావేశం జరిగింది. తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, టీ.పి.సి.సి ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్, యూనియన్ అధ్యక్షులు సి.సతీష్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, హైదరాబాద్ వాటర్ వర్క్స్ సేవరేజ్ కంగర్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకులు తెలంగాణ వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కల్లెం రాజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు యాస్కి గౌడ్ మాట్లాడుతూ జలమండలిలో నిరంతరం ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడుతున్న మూడు ముఖ్య కాంగ్రెస్ అనుబంధ యూనియన్లు, ముస్లిం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, బిసి అసోసియేషన్‌ల మద్దతుతో రాబోయే యూనియన్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐక్యంగా కలసికట్టుగా పోటీ చేయాలని నిర్ణయించడం, చారిత్రకం అన్నారు. మధుయాష్కి గౌడ్ మార్గదర్శకత్వంలో జలమండలి ఉద్యోగ, కార్మిక సమస్యలు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని, వచ్చే యూనియన్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో అందరు ఐక్యంగా పాల్గొని భారీ విజయాన్ని రాష్ట్ర ప్రభుత్వంకి కానుకగా అందించాలని బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కోరారు. మధు యాష్కి గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా, జలమండలి ఉద్యోగ కార్మికుల తరపున పోరాడుతున్న అన్ని కాంగ్రెస్ అనుబంధ యూనియన్లు కలసికట్టుగా పనిచేయలని విజ్ఞప్తి చేసారు. మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జలమండలి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తక్షణమే పరిష్కారం కోసం కృషి చేద్దామన్నారు. ఈ సమావేశంలో కంగర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామరాజుతో పాటు మూడు జలమండలి యూనియన్ల నేతలు అల్లి శ్రవాన్‌కుమార్, బి.దేవేందర్, ఎం.రాజా, కె.ఆనంద్ రెడ్డి, ఎం.రాంచేందర్, రాములు ముదిరాజ్, వి.కృష్ణ, అశోక్, షేర్ బహదూర్, బి.మహేష్, మల్లేష్, ఎండీ. జాంగిర్, లింగామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా 51 మంది లబ్ధిదారులకు ద్వారా మంజూరైన రూ.30,67,000ల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి బాధిత కుటుంబాలకి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని తెలిపారు. పేద మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయంని అందిస్తుందని దీనిలో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్నో వందలాది కుటుంబాలను సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకున్నామని తెలిపారు. గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తుందని దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని, మరింత ఆర్థిక సహాయం పెంచితే పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని అన్నారు. నాయకులు సంజీవ రెడ్డి, నాయి నేనీ చంద్రకాంత్‌రావు, పోతుల రాజేందర్, ఎండీ.ఇబ్రహీం, ఎల్లం నాయుడు, శ్రీధర్ రెడ్డి, రాంచందర్, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర రావు, వెంకట్ నాయక్, పూర్ణ, వెంకటేష్, శ్రీకాంత్, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: సీఎం సహాయ నిధి పేదలకు వరమని అన్నారు. ప్రతి పేదవాడి ఆరోగ్యానికి ప్రభుత్వ భరోసా కల్పిస్తున్నారని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా 6 మండలాల్లో 62 మంది 35 లక్షల 28 వేల రూపాయల చెక్కులను పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేశారు. శంకర్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే రేవంత్ రెడ్డి ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని అనారోగ్యంతో ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు అండనిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఆరోగ్యం కోసం ప్రభుత్వం వేల కోట్లను ఖర్చు చేస్తుందని వెంటనే బాధితులకు ఉపశమనం కల్పిస్తూ నగదును వారి ఖాతాల్లోకి జమా చేస్తుందని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, జంగా నరసింహ యాదవ్, వీరేష్, ఆరు మండలాల అధ్యక్షులు, నాయకులు చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, కృష్ణారెడ్డి, సీతారాం, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ బ్లాక్ నెంబర్ 21,22 సమీపంలో ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 233/15లో వున్న స్థలం కబ్జా చేసి రెండు అక్రమ విల్లాల నిర్మాణాలను చేపడుతున్నారు. వాటిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ తహసీల్దార్ పూల్ సింగ్‌కి పిర్యాదు చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేస్ -3 బ్లాక్ నెంబర్ 21,22 వెనక ఐరా కన్స్ట్రక్షన్ ప్రక్కన వున్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 233/15 ను కబ్జా చేసి సర్వే నెంబర్ - 274లో పర్మిషన్‌ను అక్కడి పత్రాలను చూపెడుతూ అక్రమ నిర్మాణలను చేపడుతున్నారని తెలిపారు. ప్రవేటు స్థలం పత్రాలు చూపెడుతూ ప్రభుత్వ స్థలలను కబ్జా చేయడం సర్వ సాధారణంగా మారిందని, గతంలో సర్వే నెంబర్ - 90,94లో కుడా ఇలానే చేశారని వ్యక్తం చేశారు. రెవిన్యూ, మున్సిపల్ అధికారులు ఆ స్థలనికి వెళ్లి పరిశీలించి పనులను నిలిపి వేశామన్నారని, నిలిపివేసిన కూడా గురువారం రాత్రి స్లబు పనులు జరిగాయని అక్కడి స్థానిక ప్రజలు చెబుతున్నారని గుర్తు చేశారు. కనుక వెంటనే అక్రమ నిర్మాణాలు తొలిగించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున రెవిన్యూ, మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాస్తగిరి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : గొర్రెలకు, మేకలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని మొయినాబాద్ మండల పశువైద్యాధికారి డా. అహ్మద్ తెలిపారు. మొయినాబాద్ మండల పరిధిలోని ఎల్కగూడ, సురంగల్ గ్రామాల్లో శుక్రవారం గొర్రెలకు, మేకలకు నీలి నాలుక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎల్కగూడ, సురంగల్ గ్రామాల్లో మొత్తం 1053 గొర్రెలకు, మేకలకు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు. వర్షాకాలంలో జీవాలకు వచ్చే వ్యాధుల పట్ల పశుపెంపకం దారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా టీకాలు వేస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు సహాయ శాస్త్ర వైద్యులు ప్రసన్న కుమార్, బీఏ. భీమ్ రావు, సిబ్బంది గోరెమియా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర సమితి విస్తృతస్థాయి సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్ యాదవ్ అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్, హిమాయత్ నగర్, అమృత ఎస్టేట్స్ ఏఐకెఎస్ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథులుగా వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు హాజరయి ప్రసంగిస్తూ ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు జరపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణం అన్నారు. నూతన జిల్లాలు ఏర్పడిన తర్వాత సహకార సంఘాలను విభజన చేయకుండా సహకార సంఘాలకు ఎన్నికలు జరపకుండా సహకార వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో సహకార వ్యవస్థ చిన్నాభిన్నమై వృత్తిదారులకు తీరని శాపంగా మారిందన్నారు. వెంటనే విభజించి ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. పాడి పశువులు గొర్రెలు మేకలను అడవిలో మేపుకొనుటకు హక్కుని కల్పించాలని ప్రమాదవశాత్తు మరణించిన జీవాలకు గొర్రెలకు మేకలకు నష్టపరిహారం ఇవ్వాలని చదువుకున్న యువతి యువకులకు పశుసంవర్ధక శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పాల ఉత్పత్తి అభివృద్ధి చెందడానికి మినీ పాల డైరీలకు 80% సబ్సిడీ ఇవ్వాలని 50దాటిన వృద్ధులకి 5000 రూపాయల పింఛన్ ఇవ్వాలని ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరులకు 20 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లో విద్యా ఉద్యోగాల్లో 42 % శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో పాస్ చేసి కేంద్రానికి పంపించి నెలలు గడిచిన ఆమోదించకుండా బీసీలకు తీరని అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బీసీలందరూ ఐక్యంగా పోరాడాలి అన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగరంలో పౌర మౌలిక సదుపాయాలను పెంపొందించేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ సికింద్రాబాద్, ఖైరతాబాద్ జోన్లలో క్షేత్ర స్థాయి పర్యటించి పలు పనులను తనిఖీలు చేపట్టారు. వర్షాకాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమ అమలుతో పాటు మౌలిక సదుపాయాల పెంపొందించేందుకు ఉద్దేశించిన పనుల పురోగతిని సంబంధిత జోనల్ కమిషనర్‌లు రవి కిరణ్ , అనురాగ్ జయంతి లతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనులను ప్రభావంతంగా చేపట్టేందుకు అధికారులకు మార్గనిర్దేశం చేశారు. మొదట సికింద్రాబాద్ జోనల్ పరిధిలో బాగ్ లింగం పల్లి, పరిసర ప్రాంతంలలో పర్యటించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపడుతూ విధులు, పబ్లిక్ ప్లేస్ లో పరిశుభ్రత, ఆరోగ్య వాతావరణం నెలకొనేలా చూడాలన్నారు. ప్రజల ఫిర్యాదులపై త్వరితంగా స్పందించాలని అధికారులకు స్పష్టంచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సికింద్రాబాద్ జోనల్ పరిధిలో వర్షాకాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం అమలు జరుగుతున్న తీరు, సానిటేషన్ పరిస్థితులు, యాంటి లార్వా చర్యలు, రహదారి నిర్వహణ, డ్రైనేజ్ వ్యవస్థల పనితీరు వంటి అంశాలపై కమిషనర్ జోనల్ కమిషనర్ , అధికారులతో సమీక్షించారు. చెత్త సేకరణ కేంద్రాలను పరిశీలించి, బహిరంగ ప్రదేశాల్లో శుభ్రతను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. వారు ప్రస్తావించిన సమస్యలపై తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ ఖైరతాబాద్ జోన్‌లోని జూబ్లీ హిల్స్ రోడ్డు నంబర్ 44,45 లో జి హెచ్ ఎం సిపార్క్‌ను జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, తదితర అధికారులతో కలిసి సందర్శించారు. పార్క్ లో చేపట్టిన అభివృద్ధి పనుల అమలు పురోగతిని, సివిల్ పనుల ప్రగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సిటిజన్ ఫ్రెండ్లీ గా పార్క్ గా మార్చేందుకు చేపట్టిన పనుల ప్రాధాన్యత దృష్ట్యా సకాలంలో పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్లు,ఆంజనేయులు, సమ్మయ్య ఈ ఈ విజయకుమార్ హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర చేసిన కార్పొరేటర్ ఉప్పలపాటి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : వర్షాకాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, పట్టణ ప్రణాళిక విభాగం ఏసిపి నాగిరెడ్డి, జిహెచ్‌ఎంసి ఆయా శాఖల సంబంధిత అధికారులతో కలిసి మియాపూర్ డివిజన్ పరిధిలోని అమన్ కాలనీ చిరంజీవి నగర్ ప్రగతి ఎనక్లేవ్ కాలనీలలో మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ శ్రీకాంత్ గారు కోరారు, పారిశుద్ధ్య చర్యల స్పెషల్ డ్రైవ్లో భాగంగా డిప్యూటీ కమిషనర్తో పాటు జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలసి మియాపూర్ డివిజన్ పరిధిలోని చిరంజీవి నగర్, అమన్ కాలనీ, ప్రగతి ఎనక్లేవ్ కాలనీల్లో పాదయాత్ర చేస్తూ కాలనీల ప్రజలను చైతన్య పరుస్తూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేయాలని, వర్షపునీరు ఇంటి పరిస రాల్లో నిలువ ఉండకుండా చూడాలని సూచించారు. మియాపూర్ డివిజన్ అభివృద్ధికోసం పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ సహకారంతో ముందుకు వెళ్లడం జరుగుతుందని డివిజన్ పరిధిలో మంజూరైన అభివృధి పనులను విడతల వారిగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేల కృషి చేస్తామని ఈ సంధర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. జిహెచ్‌ఎంసి అధికారులు డిఈ దుర్గాప్రసాద్, శానిటేషన్ సూపర్వైజర్ శ్రీనివాస్, ఎంటమాలజి ఏఈ చిన్న రమావత్, శానిటేషన్ ఎస్ఆర్పి మహేష్, స్థానిక నాయకులు, సుప్రజ, మహమ్మద్ ఖాజా, అప్రోజ్,జహంగీర్,రామ్ ప్రభు పాల్గొన్నారు.

రోస్టర్ విధానాన్ని సవరించాలి



విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలంగాణలో ఉన్న 40 లక్షల మంది మాల సమాజానికి అన్యాయం చేసే రోస్టర్ విధానాన్ని సవరించకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడిస్తాం అని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్, గౌరవాధ్యక్షు లు చెరుకు రామచందర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్‌లు హెచ్చరించారు. తెలంగాణలో మాల విద్యార్థులకు, మాల ఉద్యోగులకు జరుగుతున్న రోస్టర్ విధానం వల్ల జీవో 99 వల్ల జరుగుతున్న అన్యాయంపై తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ నాయకులు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ జీవో 99 వల్ల రాష్ట్ర ప్రభుత్వం విధించిన రోస్టర్ విధానం వల్ల తెలంగాణ మాల సమాజం పూర్తిగా నష్టపోతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల, అంబేద్కర్ విగ్రహాల ముందు, మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన వేలాదిమంది మాల ఉద్యోగుల విద్యార్థులు రోడ్లమీదకి వచ్చి నిరసన తెలపాలని, వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాల సమాజానికి న్యాయం చేయాలని అన్నారు. తెలంగాణ క్యాబినెట్ లో ఉన్న మాల మంత్రులు మాల శాసనసభ్యులు, ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం తీసుకొచ్చిన మాలలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని మండిపడ్డారు. ఇప్పటిక అనేక విశ్వవిద్యాలయాలలో అడ్మిషన్లలో మాల విద్యార్థులు పూర్తిగా నష్టపోతున్నారని వెంటనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పునరాలోచించాలన్నారు.ఈ కార్యక్రమంలో చీఫ్ కోఆర్డినేటర్ తాళ్లపల్లి రవి, కన్వీనర్ నల్లల కనకరాజ్, తెలంగాణ విద్యార్థి జేఏసీ మాదాసు రాహుల్‌రావు, నామా సైదులు, చేపూరి నరసింహ, డాక్టర్ వీరస్వామి సేపూరి ప్రణయ్, గాజుల పున్నమ్మలు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, దేశభక్తికి కొత్త అధ్యాయం ప్రారంభం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : క్రమశిక్షణ, నాయకత్వం, దేశప్రేమను ఉద్ఘాటిస్తూ, కుంట్లూరులోని జాన్సన్ గ్రామర్ స్కూల్ -ఐ.సి.ఎస్.సి. జాతీయ క్యాడెట్ కార్ప్స్ జూనియర్ డివిజన్ యూనిట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రాంగణంలో ఎన్ సి సి రైజింగ్ సెరమనీ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా ఈ పాఠశాల అధికారికంగా 1 (టి) బెటాలియన్ ఎన్ సి సి - జెడి వింగ్‌లో చేరింది. ఇది విద్యార్థులకు భారతదేశంలో అత్యంత గౌరవనీయమైన యూత్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తుంది, ఇది వ్యక్తిత్వ వికాసం, పౌర బాధ్యతలను పెంపొందించడంలో కీలకంగా ఉంటుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 1 (టి) బెటాలియన్ ఎన్ సి సి కార్యనిర్వహణ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ కె. ఎస్. పాండియన్ అధ్యక్షత వహించారు. లెఫ్టినెంట్ కర్నల్ పాండియన్, యువ క్యాడెట్లను క్రమశిక్షణతో కూడిన బాధ్యతగల పౌరులుగా మలచడంలో ఎన్ సి సి పాత్రను ప్రస్తావించారు. ఇది దేశానికి మనమిచ్చేవాగ్దానం, సేవా దృక్పథం, ఆత్మాన్వేషణ, నాయకత్వ వైపు పయనం అని వ్యాఖ్యానించారు. ఎన్ సి సి జెండా ఆవిష్కరణతో ప్రారంభమైంది. ఇది గర్వకారమైన సంప్రదాయా నికి ఆరంభ సంకేతంగా నిలిచింది. ప్రార్థన, స్కూల్ కౌన్సిల్ సభ్యుల స్వాగత ఉపన్యాసం, ఎన్ సి సి ప్రధాన సిద్ధాంతాలను ప్రతిబింబించే కర్టెన్-రైజర్ ప్రదర్శన మరింత శోభను చేకూర్చాయి. ఇది పాఠశాలలో దేశభక్తి భావాన్ని ప్రతిధ్వనింపజే సింది. పాఠశాలలో ఎన్‌సిసి కార్యక్రమం ప్రారంభమవడమే కాకుండా, ఆత్మవి శ్వాసం, సహనశీలత, నాయకత్వ లక్షణాలతో కూడిన యువతను తీర్చిదిద్దే పాఠశాల కట్టుబాటును పునరుద్ఘాటించింది. ఈ జెడి వింగ్ ప్రారంభంతో, కుంట్లూరులోని జాన్సన్ గ్రామర్ స్కూల్ వారి ఏకత్వం క్రమశిక్షణ అనే సిద్ధాంతాల ద్వారా యువ మేధో సంపత్తిని సాధికారత వైపు నడిపిస్తూ, దేశ నిర్మాణంలో భాగస్వామిగా మారింది.

సంతూర్ రాయల్ సాండిల్ విడుదల

నిజామాబాద్ : సంతూర్ రాయల్ సాండిల్ అనేది విప్రో వినియోగదారుల సంరక్షణ, కాంతి అనేది ఒక ప్రీమియం సంతూర్ పోర్ట్‌పోలియో కిందకి వస్తుంది. అది కొత్త ట్రిపుల్ సాండిల్ ప్యాక్‌ను పరిచయం చేస్తూ దాని చర్మ సంరక్షణ రేంజిని విస్తరించింది. సినీ నటి మీనాక్షి చౌదరీ టీవీ కమర్షియల్ ద్వారా దీన్ని లాంచ్ చేశారు. ఈ కొత్త ఆఫర్ మూడు ఉత్పత్తులు అయిన సోప్, సాండిల్ వుడ్ ఫేస్ ప్యాక్, సాన్డిల్ ఫేస్ క్రీమ్‌లతో మనల్ని దగ్గరకు చేరుస్తుంది. మూడు దశల చర్మ సంరక్షణలో భాగంగా మెరుగైన పనితీరుని అందిస్తూ చర్మ సౌందర్యాన్ని పెంచుతూ నల్ల మచ్చలను తగ్గిస్తుంది. ఎంఎస్ పరిశోధన క్లినిక్ నిర్వహించిన క్లినికల్ అధ్యయనం ప్రకారం ఒక వారం రోజుల వాడుక తరువాత మెరుగైన మురుగుదలని చూసామని రెజిమెన్ వివరించారు. టాన్ తగ్గడం మాత్రమే కాకుండా నాల్గవ వారంలో నల్ల మచ్చలు కుడా తగ్గి మంచి కాంతిని గమనించారు. ఈ ఫార్ములాని డెర్మటాలజీ ప్రకారం టెస్ట్ చేసారు. ఇది అన్ని రకాల చర్మాల వారికి సరిపోతుందని లైటెనింగ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ ప్రసన్న రాయ్ అన్నారు.

కూన వెంకటేష్ గౌడ్ విగ్రహావిష్కరణ



విశాలాంధ్ర-దుండిగల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సహృదయులు కూన వెంకటేష్ గౌడ్ సేవలు, జ్ఞాపకాలు చిరుకాలం ప్రజల మదిలో మేదిలే విధంగా తన కుమారులు కూన శ్రావణ్ గౌడ్, కూన గౌరిశంకర్ గౌడ్, తన కుటుంబ సభ్యులు గాజులరామారంలో కెవిఎస్ కన్వెన్షన్‌లో కూన వెంకటేష్ గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం కూన వెంకటేష్ గౌడ్ జన్మదినం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్, కూన అంతయ్య గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సహృదయులు కూన వెంకటేష్ గౌడ్ జ్ఞాపకార్థంగా తన కుమారులు శ్రీ శ్రీ వెంకటేశ్వరాస్వామి దేవాలయానికి బంగారు తోరణలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, కూన కుటుంబ సభ్యులు, నాయకులు, ప్రజలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గోన్నారు.

ట్రంప్‌నకు మోదీ దాసోహం

- బీజేపీ పాలనలో సామాన్యులకు అన్యాయం
- ప్రధానికి చంద్రబాబు, పవన్ ఊడిగం
- అప్పుల రాజధానిగా అమరావతి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ: ఎందరో మహానుభావుల పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న స్వతంత్ర భారతదేశం ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడిలేదని, అమెరికా అధ్యక్షుడు ట్రంపు బెదిరింపులతో కాలుమొక్కుతా బాంచన్ దొర అన్నట్లు ప్రధాని మోదీ వ్యవహార శైలి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఎన్టీఆర్ జిల్లా ద్వితీయ మహాసభలు జగ్గయ్యపేటలో అంగరంగవైభవంగా శుక్రవారం జరిగాయి. పట్టణలోని పార్టీ కార్యాలయం పిల్లలమర్రి భవన్ నుండి బలుసుపాడు సెంటర్ (పొట్టి శ్రీరాములు విగ్రహం) వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండాలు చేతపట్టుకుని నూతన ఉత్సాహంతోను, నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూర్యదేవర నాగేశ్వరరావు సభ ప్రాంగణంలో పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ దేశంపై సుంకాలు, అదనపు పన్నులు, వ్యాపారలావాదేవీలు నిలిపివేస్తానని ట్రంప్ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశ ప్రజలు తిరగబడితే ట్రంప్ పాతాళానికి దిగిపోతారని హెచ్చరించారు. పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధాన్ని అన్ని పార్టీలు ముక్తకంఠంతో సమర్థించాయని, అయితే ఎవరి ఒత్తిడికి తలొగ్గి యుద్ధం ఆపారో దేశ ప్రజలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని నిలదీశారు. ట్రంప్ వ్యాఖ్యలను పార్లమెంట్‌లోనూ ఖండించకుండా దేశ ప్రజలను నవ్వులపాలు చేశారని విమర్శించారు. హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన మోదీ... దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడంలో ముందున్నారని ఆరోపించారు. 2014 వరకు రూ.56 లక్షల కోట్లు అప్పులుండగా... మోదీ హయాంలో అవి రూ.200 లక్షల కోట్లుకు చేరుకున్నాయని విమర్శించారు. మోదీ పాలనలో దేశం దూసుకుపోతోందని మన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దేశ ఆర్థిక పరిస్థితులపై అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

ఏడాది కాలంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ చేసిందేమీ లేదని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తిగా విఫలం చెందారని రామకృష్ణ అన్నారు. అనుభవం, పాలనాదక్షుడిగా చెప్పుకునే చంద్రబాబు పాలన లంచాలమయంగా మారిందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం ఇవ్వనిదే పనులు జరగడం లేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేలు చెప్పినా లంచాలు లేకుండా అధికారులు పనులు చేయడం లేదని, ఇదేనా సుపరిపాలన అని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని అప్పులు ఏడాది కాలంలో చంద్రబాబు ప్రభుత్వం చేసిందని, వివిధ మార్గాల ద్వారా రూ.1.70 లక్షల కోట్లు తీసుకొచ్చిందని, కేవలం అమరావతి రాజధాని నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.30 వేల కోట్లు అప్పు చేసినట్లు తెలిపారు. అధికారంలో ఉన్నా...లేకున్నా ప్రజల పక్షాన పోరాటాలు చేసి...అనేక విజయాలు సాధించామన్నారు. జగ్గయ్యపేటలో కమ్యూనిస్టు పార్టీకి సుస్థిర స్థానం ఉందని, తొలి ఎమ్మెల్యే పిల్లలమర్రి వెంకటేశ్వరరావు ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలపై పోరాడి అనేక విజయాలు సాధించారని గుర్తుచేశారు.

అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ మారుతున్న రాజకీయ పరిణామాలు, పొత్తుల్లో భాగంగా కమ్యూనిస్టులు కొంతమేరకు వెనబడి ఉన్నప్పటికీ... ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాలకు నాగార్జునసాగర్ నీటిని అందించడంలో కమ్యూనిస్టుల పోరాటం ఉందన్నారు. భూ పోరాటాలు చేసి పేదలకు భూమి కల్పించడంలోను, హక్కులు సాధించడంలోనూ కమ్యూనిస్టుల పాత్ర ఉందన్నారు. పేదలకు పని కల్పించడం కోసం ఉపాధి హామీ పథకం సాధించామన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో చేసే రాజకీయాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదమని హెచ్చరించారు. మణిపూర్ మహిళలను వివస్త్రలుగా చేయడం, ధర్మస్థలంలోని ఆలయ నిర్వాహకుల అకృత్యాలు సమాజానికి ప్రమాదంగా మారాయన్నారు. మహిళలకు బీజేపీ పాలనలో రక్షణ లేదని విమర్శించారు. హిందూమతంపై కుట్ర జరుగుతోందని పెద్దఎత్తున ప్రచారం చేస్తూ మతవిద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారు. దోనేపూడి శంకర్ మాట్లాడుతూ జగ్గయ్యపేట సహజ సంపద, సున్నపురాయి నిక్షేపాలకు నిలయం జగ్గయ్యపేట అని, ఇటువంటి ప్రాంతాన్ని స్వార్థప్రయోజనాల కోసం పాలకులు దోసేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ కోటేశ్వరరావు, పార్టీ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కృష్ణాజిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని తదితరులతో పాటు జిల్లా, నగర స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వీసీబీ చైర్మన్ జేవీ సత్యనారాయణమూర్తికి అభినందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకుకు నూతన చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయిన జేవీ సత్యనారాయణ మూర్తికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గం అభినందనలు తెలిపింది. విజయవాడ దాసరి భవన్‌కు శుక్రవారం విచ్చేసిన జేవీ సత్యనారాయణమూర్తిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, పి.హరనాథ్‌రెడ్డి, అక్కినేని వనజ, కేవీవీ ప్రసాద్, జంగాల అజయ్‌కుమార్, దేగా ప్రభాకర్, రాష్ట్ర సమితి సభ్యులు వై.చెంచయ్య, యడ్ల కిశోర్ పాల్గొన్నారు.

127 ఏళ్ల తర్వాత భారత్‌కు బుద్ధుడి అవశేషాలు

న్యూఢిల్లీ: భారత సాంస్కృతిక వారసత్వానికి గర్వకారణమైన పవిత్రమైన పిప్రావా బుద్ధ అవశేషాలను భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ విజయవంతంగా తిరిగి దేశానికి తీసుకువచ్చింది. ఇవి బుద్ధుని భౌతిక అవశేషాలకు సంబంధించినవిగా విశ్వసిస్తున్నారు. ఈ అవశేషాలు కొన్ని మిలియన్ల డాలర్ల విలువగలవిగా అంచనా వేస్తున్నారు. హాంకాంగ్‌లో జరిగిన ఒక వేలంలో ఇవి కనుగొనబడ్డాయి. అక్కడ ప్రైవేట్ సేకరణదారులు కొనుగోలు చేసే ప్రమాదం ఏర్పడింది. గాడ్‌రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ సహకారంతో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ వెంటనే జోక్యం చేసుకొని వేలాన్ని ఆపివేసి ఈ అపురూప విలువైన అవశేషాలను భారత భూభాగానికి తీసుకువచ్చింది. ఈ అవశేషాలు 1898లో బ్రిటిష్ సివిల్ ఇంజినీర్ విలియం క్లాక్సన్ పెప్పే చేత పిప్రావాలో (ఇప్పటి ఉత్తర ప్రదేశ్‌లో) కనుగొనబడ్డాయి. క్రీస్తుపూర్వం మూడో శతాబ్దంలో బుద్ధుడి అనుచరులు వీటిని స్థాపించినట్లు ప్రజల నమ్మకం. ఇవి గ్లోబల్ బౌద్ధ సమాజానికి అత్యంత ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగినవిగా, భారత పురావస్తు చరిత్రలో అత్యంత విలువైన పురావస్తు సంపదల్లో ఒకటిగా పరిగణించబడుతున్నాయి. సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ మాట్లాడుతూ మనం కోల్పోయిన వారసత్వాన్ని తిరిగి పొందిన అత్యంత ముఖ్యమైన ఘట్టాల్లో ఇది ఒకటి అని పేర్కొన్నారు.

పేదల కోసం సీపీఐ నిరంతర పోరు

రామచంద్రయ్య, జగదీశ్

విశాలాంధ్ర-ధర్మవరం: సీపీఐ పేద ప్రజల పార్టీ అని, వదేళ్లుగా వారి సమస్యల పరిష్కారంలో ఎన్నో విజయాలు సాధించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, జగదీశ్, జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, పార్టీ నాయకుడు జాన్సన్ బాబు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు పద్మావతి తెలిపారు. సీపీఐ జిల్లా మహాసభలు రెండో రోజైన శుక్రవారం ధర్మవరంలో కీర్తిశేషులు తీరంపురం నారాయణ సభ వేదికలో ప్రతినిధుల సభ జరిగింది. సీనియర్ నాయకులు చేనంపల్లి భుజంగం పార్టీ జెండా ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అధ్యక్షవర్గంగా వెంకటనారాయణ, సురేంద్ర నాయుడు, వినోద్ వ్యవహరించారు. నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎన్నో ప్రజా సమస్యలు పరిష్కరించిన ఘనత సీపీఐకే దక్కిందన్నారు. అధికారం లేకపోయినా పేదల కోసం పోరాడిందన్నారు. భవిష్యత్‌లో కూడా పేదల సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, నాయకులు జింక చలపతి, కాటమయ్య, దాదా పీర్, మహదేవ్, కదిరప్ప, శ్రీనివాసులు, వినోద్, బాలస్వామి, శ్రీరాములు, విజయలక్ష్మి, రవి, వెంకట నారాయణ, రమణ పాల్గొన్నారు.

అనిల్ అంబానీకి బిగుస్తున్న ఉచ్చు

లుకౌట్ నోటీసులు జారీ - 5న విచారణకు ఈడీ సమన్లు

ముంబై: అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. రూ.17 వేల కోట్ల మేర రుణ మోసాల కేసులో లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. విచారణ సమయంలో దేశం విడిచివెళ్లకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విజ్ఞప్తి మేరకు లుకౌట్ సర్క్యులర్ జారీ అయింది. ఈనెల 5న విచారణకు హాజరు కావాలని ఈడీ శుక్రవారం ఉదయం సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఆయన వాంగ్మూలం తీసుకోనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. రుణ మోసం వ్యవహారంలో గతవారం అనిల్ అంబానీకి చెందిన కార్యాలయాల్లో మూడు రోజుల పాటు ఈడీ సోదాలు నిర్వహించింది. ముంబైలోని 35 ప్రాంగణాల్లో 50 కంపెనీలు, 25 మంది ఆస్తులను తనిఖీ చేసింది. సోదాల్లో కీలక ఫైళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఈడీ సమన్లు, లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి.

గండికోట అభివృద్ధికి మాస్టర్ ప్లాన్



- డిసెంబరు 26, 27న పర్యాటక ఉత్సవాలు
- ఏపీ పర్యాటక పెట్టుబడిదారుల సమావేశంలో సీఎం చంద్రబాబు
- గండికోట పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన

విశాలాంధ్ర-కడప/గండికోట: పర్యాటకంగా గండికోట అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శుక్రవారం గండికోట వద్ద ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక పెట్టుబడిదారుల సమావేశానికి హాజరయిన ముఖ్యమంత్రి గండికోట ప్రాంతాన్ని యాంకర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వరప్రసాదంగా ఏర్పడిన గండికోట ప్రాంతం భారత్ గ్రాండ్ కాన్యన్‌గా పేరొందిందన్నారు. 13వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించి, ఆ తర్వాత విజయనగర రాజులు పాలించిన ఈ ప్రాంతం చారిత్రక సంపదకు ప్రతిరూపంగా ఉందని స్పష్టం చేశారు. గండికోట ప్రాంతాన్ని సాస్కీ కింద రూ.78 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. డిసెంబరు 26, 27 తేదీల్లో గండికోట ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. అద్భుతమైన పర్యాటక కేంద్రంగా గండికోటను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేసిందని, పర్యాటకులు బస చేసేలా స్టార్ హోటళ్ల నిర్మాణం చేపడతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పర్యాటక ప్రాంతాల్లో 50 వేల హోటల్ గదుల నిర్మాణం చేసేలా కార్యాచరణ చేపట్టామని వెల్లడించారు. పర్యాటకులను ఆకర్షించేలా గండికోట వద్ద వ్యూపాయింట్‌తో పాటు ఎకో ఫ్రెండ్లీ టెంట్ సిటీ, బోటింగ్‌తో పాటు కోట వద్ద లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు సందర్శించిన వారికి మంచి అనుభూతి కలిగేలా రోప్ వే, గ్లాస్ బాటమ్ వాక్ వే, లైట్ అండ్ సౌండ్ షోలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది చివరి కల్లా టెంట్ సిటీని కూడా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గ్రాండ్ కాన్యన్‌ను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలిరైడ్స్ కూడా సెప్టెంబరు నుంచి మొదలు అవుతాయన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కారావాన్ పర్యాటక సర్వీసులు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు.

రూ.500 కోట్ల విలువైన పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పందాలు

రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ఒప్పందాలు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. ఈజ్ మై ట్రిప్, హిల్టన్ హోటల్స్ సహా వివిధ సంస్థలు ఏపీ పర్యాటక కార్పొరేషన్‌తో రూ.500 కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నాయి. గండికోటతో పాటు శ్రీశైలం, మంత్రాలయం, తిరుపతి తదితర ప్రాంతాల్లో హోటళ్ల నిర్మాణం, అడ్వెంచర్ స్పోర్ట్స్, హై రోప్, కయాకింగ్, జెట్ స్కీయింగ్ లాంటి ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఈ ఒప్పందాలు కుదిరాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలయిన సాస్కి, స్వదేశ్ దర్శన్ కింద గండికొట, బొర్రా గుహలు, అహోబిలం, నాగార్జున సాగర్ ప్రాంతాల్లో వివిధ పర్యాటక ప్రాజెక్టులను సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఏపీలో అమలు చేస్తున్న పర్యాటక పాలసీలో భాగంగా పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పిస్తున్నామని, అపారమైన అవకాశాలను వినియోగించుకోవాలని సీఎం ఈ సందర్భంగా పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎకో టూరిజం, అడ్వెంచర్, క్రూయిజ్, వెల్ నెస్, కారావాన్, గోల్ఫ్, హెరిటేజ్, టెంపుల్ పర్యాటక ప్రాజెక్టులకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. విశాఖ, అరకు వ్యాలీ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోటలను 7 యాంకర్ హబ్‌లుగా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. అలాగే 25 థీమాటిక్ సర్క్యూట్‌లను కూడా ప్రకటించామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో హోం స్టేలను కూడా ప్రోత్సహిస్తామని అన్నారు. రాష్ట్ర స్థాయిలో 8 పర్యాటక ఈవెంట్లను నిర్వహించటంతో పాటు జిల్లాల వారీగానూ కార్యక్రమాలు, పర్యాటక ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అంతకుముందు గండికోట గ్రాండ్ కాన్యన్ సందర్శించిన ముఖ్యమంత్రి అక్కడే ఉన్న టూరిస్ట్ గైడ్, పర్యాటకులతో కొద్దిసేపు మాట్లాడారు.

నితీశ్‌కు ఝలక్ తప్పదా?

సీఎం అభ్యర్థిపై బీజేపీ కన్ను

పట్నా: బీహార్‌లో ఏడాది చివరి కల్లా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇక అన్ని పార్టీలు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. అయితే తాజాగా వెలువడిన సర్వేలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ప్రజాదరణ తగ్గినట్లు ప్రచారం జరుగుతోంది. స్టేట్ వైడ్ సర్వే ఆఫ్ బీహార్ ఎలక్షన్స్ 2025 (కుల-సమాజ వారీ ఓటింగ్) ప్రకారం 25 శాతం మందే నితీశ్ కుమార్‌ను తదుపరి ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారు. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రథమ స్థానంలో ఉన్నారు. ఆయనను ముఖ్యమంత్రిగా చూడాలని 32.1 శాతం ప్రజలు కోరుకుంటున్నారు. నితీశ్ వైపున 38 శాతం ఎస్టీలు, 27 శాతం ఎస్సీ, ముస్లింలు, 24 శాతం ఉన్నత తరగతి హిందువులు, 21 శాతం ఓబీసీలు ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 50 శాతం మంది ముస్లింలు తేజస్వి వైపే ఉన్నారు. ఆయనను ముఖ్యమంత్రిగా చూడాలని బలంగా కోరుకుంటున్నారు. ఇక రాబోయే ఎన్నికల్లో బీజేపీ సొంత ముఖ్యమంత్రిని చూడాలని అనేక మంది ఓటర్లు కోరుకున్నట్లు సర్వేలో తేలింది. 33.7 శాతం మంది బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిని కోరుకున్నట్లు తెలుస్తోంది. బీజేపీకి వేరే మార్గం లేకపోతే నితీశ్ కుమార్‌ను 23.1 శాతం మందే కోరుకుంటున్నారు. అయితే బీహార్ సమగ్ర అభివృద్ధి కోసం ఏ పార్టీని విశ్వసిస్తారన్న ప్రశ్నకు మహాఘట్‌బంధన్‌కు 36.1 శాతం మంది స్వల్ప ఆధిక్యత కనిపించగా... ఎన్డీఏకు మాత్రం 35.4 శాతం మంది విశ్వసిస్తున్నట్లు చెప్పారు. నితీశ్ కుమార్‌కు ప్రజాదరణ దెబ్బతినడంతో బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిపై దృష్టి పెట్టాలని కమలనాథులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నితీశ్ కుమార్ పలుమార్లు బీహార్ ముఖ్యమంత్రిగా పని చేశారు. కొత్త సీఎం అభ్యర్థిని రంగంలోకి దించితే... తిరిగి అధికారంలోకి రావొచ్చని ఎన్డీఏ భావిస్తున్నట్లు సమాచారం.

జులై జీఎస్టీ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి పెరిగాయి. జులై నెలలో రూ.1.96 లక్షల కోట్లు వసూలయ్యాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి 7.5 శాతం వృద్ధి నమోదైంది. ఈ మేరకు జులై నెలకు సంబంధించిన జీఎస్టీ గణాంకాలను కేంద్రం శుక్రవారం విడుదల చేసింది. గతేడాది జులైలో జీఎస్టీ రూపంలో రూ.1.82 లక్షల కోట్లు వసూలైంది. జీఎస్టీ వసూళ్లు కొన్ని నెలలుగా రూ.1.8 లక్షల కోట్లు పైన స్థిరంగా నమోదవుతూ వస్తున్నాయి. ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం ఇది వరుసగా ఏడోసారి. ఈ ఏడాది ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.2.37 లక్షల కోట్లు వసూళ్లు సాధించగా... జూన్‌లో రూ.1.85 లక్షల కోట్లు వసూళ్లు నమోదయ్యాయి.

రష్యా నుంచి చమురు కొంటాం: భారత్

న్యూఢిల్లీ: తమ వస్తువులపై అమెరికా 25 శాతం సుంకాలు విధించడంతో పాటు రష్యా నుంచి చమురు దిగుమతులపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత్ ఆచితూచి స్పందించింది. 'డెడ్ ఎకానమీ'పై చెప్పడానికి ఏమీ లేదంటూ అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలను తేలికగా తీసుకుంది. రెండు దేశాల భాగస్వామ్యం అనేక మార్పులు, సవాళ్లను ఎదుర్కొందని తెలిపింది. అయితే, రష్యాతో సంబంధాలకు కట్టుబడి ఉన్నామని, తమది స్థిరమైన, కాలం పరీక్షించిన భాగస్వామ్యమని స్పష్టం చేసింది. తాజా పరిణామాలపై భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏ దేశంతోనూ భారత్‌కు ఉన్న సంబంధాలను మూడో దేశం కోణంలో చూడవద్దని పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలుకు కట్టుబడి ఉన్నామని, అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా తమ నిర్ణయాలు ఉంటాయన్నారు. దేశ ఇంధన ప్రయోజనాలు కాపాడుకోవడంలో భాగంగా అంతర్జాతీయ మార్కెట్లో అత్యుత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. 'పరస్పర ఆసక్తులు, ప్రజాస్వామ్య విలువలు, ప్రజల మధ్య బలమైన సంబంధాల విషయంలో భారత్, అమెరికా దేశాలు అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగిస్తాయి. ఇందులో రెండు దేశాలు ఎన్నో మార్పులు, సవాళ్లను ఎదుర్కొన్నాయి. అందుకే ముఖ్యమైన అజెండాపైనే మేము దృష్టి సారించాం. ఈ భాగస్వామ్యం కొనసాగుతుందని విశ్వసిస్తున్నాం' అని రణధీర్ జైశ్వాల్ వెల్లడించారు. అమెరికాతో భారత్ రక్షణ సంబంధాలపై స్పందిస్తూ రెండుదేశాలు బలమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఇవి బలోపేతమయ్యాయని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

15 నుంచి ప్లాస్టిక్ రహిత సచివాలయం

వచ్చే జూన్ నాటికి రాష్ట్రమంతా
సురేశ్ కుమార్

విశాలాంధ్ర - సచివాలయం: రాష్ట్ర సచివాలయాన్ని ఈ నెల 15 నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పురపాలక... పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సచివాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడంపై శుక్రవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది జూన్ ఐదోతేదీ నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడటమే కాకుండా మైక్రో ప్లాస్టిక్ కారకాల వల్ల మానవాళి, పశు పక్ష్యాదుల ఆరోగ్యాన్ని ఎంతగానో దెబ్బతీస్తున్నాయన్నారు. పలువురు క్యాన్సర్ బారిన పడి మృత్యువాత పడుతున్నారన్నారు. తొలుత రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులైన బాటిళ్లు, కప్పులు, ప్లేట్లు, స్టిక్కర్లు, క్యారీ బ్యాగుల అమ్మకం, పంపిణీ, వాడకంపై తక్షణ నిషేధాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. వీటి స్థానంలో పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించేలా చర్యలు చేపడతామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని అన్ని బ్లాకుల్లో ఆర్వో. ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారని, ఉద్యోగులకు పునర్వినియోగించదగిన స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ బాటిళ్లను సరఫరా చేయాలని ప్రతిపాదించడమైందన్నారు. ఘన, ద్రవ్య వ్యర్థాల సేకరణకు మూడు రంగుల డస్టు బిన్లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సహకారంతో అమలు చేయడం జరుగుతున్నదని, దీన్ని విజయవంతం చేసేందుకు ఉద్యోగులు సహకరించాలని సురేశ్ కుమార్ కోరారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి.అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ చైర్మన్‌గా సెక్రటేరియట్ ప్లాస్టిక్ ఫ్రీ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐదో తేదీన ప్రచార సామాగ్రిని ప్రారంభించడం... 11న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు ట్రైల్...15 నుంచి పూర్తి స్థాయిలో నిషేధించడం జరుగుతుందని వివరించారు.

ప్రభుత్వ పథకాల్లో ఆ పేర్లు వాడొద్దు: మద్రాస్ హైకోర్టు

చెన్నై: పథకాల్లో వాడే పేర్ల విషయంలో తమిళనాడు ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా తీసుకువచ్చే ప్రజా సంక్షేమ పథకాల్లో జీవించి ఉన్న నేతల పేర్లు వాడొద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే వాటి గురించి ప్రచారం చేసేటప్పుడు మాజీ ముఖ్యమంత్రుల చిహ్నాలు, డీఎంకే పార్టీ గుర్తులు, జెండాను ఉపయోగించకుండా నిషేధించింది. అన్నాడీఎంకే పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై మద్రాస్ హైకోర్టులో తాజాగా విచారణ జరిగింది. 'ఉంగలుదాన్ స్టాలిన్' పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న ప్రచార కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పేరును ఉపయోగించడాన్ని షణ్ముగం సవాల్ చేశారు ఈ అంశంపై తాము ఇచ్చిన ఉత్తర్వులు ఏ ప్రభుత్వ పథకం ఆవిష్కరణ, అమలుకు అడ్డంకి కాబోదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అలాగే ఈ వ్యాజ్యంపై రాష్ట్ర ప్రభుత్వం, డీఎంకే పార్టీ తమ స్పందనలు తెలియజేయాలని ఆదేశాలు ఇచ్చింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.